జులై
2025

231

సంపుటి : 21 సంచిక : 2

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

## ఈ సంచికలో........

వర్గ పోరాటాలతోనే పార్టీ పురోగమనం
ఎఐ యుగంలో గ్రాడ్యుయేట్ సంక్షోభం
అదిగో నవోదయం
నిరసనలతో అట్టుడుకుతున్న అమెరికా
ఘర్షణల కాలం -2
ముస్లింలపై నేరస్తుల ముద్రవేస్తున్న బిజెపి
జాతీయోద్యమంలో జాడలేని ఆర్ఎస్ఎస్
ఏడాది పాలనలో సాధించింది శూన్యం
ప్రజాసైన్స్ ఉద్యమం అనుభవాలు, సవాళ్లు
నవ సినిమా వైతాళికుడు, బహుముఖ ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్

స్ఫూర్తి

# నవ సినిమా వైతాళికుడు, బహుముఖ ప్రతిభాశాలి

# సత్యజిత్ రాయ్



బాలాజీ

మొదటి సినిమాతోనే గ్రేట్ మాస్టర్స్ సరసకు చేరిన దర్శకుడిగా, తను సృష్టించిన పాత్రలతో తరతరాల పాఠకులను అలరిస్తున్న రచయితగా, కంప్యూటర్ ఫాంట్లు లేని కాలంలో సరికొత్త అక్షరాలను సృష్టించిన కాలిగ్రాఫర్‌గా, వినూత్న రీతిలో గ్రంథాల ముఖచిత్రాలూ, పోస్టర్లూ, లోగోలూ డిజైన్ చేసిన ఇల్లస్ట్రేటర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా, సంగీత దర్శకుడిగా, డాక్యుమెంటరీ నిర్మాతగా, పత్రికా సంపాదకుడిగా – ఇలా తను ప్రవేశించిన ప్రతి రంగంలోనూ అసమాన ప్రతిభాపాటవాలు కనబరిచి బహుముఖ ప్రజ్ఞాశాలి సత్యజిత్ రాయ్. పద్మభూషణ, భారతరత్న బిరుదులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఆస్కారు జీవన సాఫల్య పురస్కారం, జపాన్‌కు చెందిన అఖిరా కురసోవా జీవన సాఫల్య పురస్కారం వంటి వ్యక్తిగత అవార్డులతో పాటు, తన వేర్వేరు సినిమాల కోసమూ లెక్కలేనన్ని అవార్డులూ, గౌరవాలూ దక్కించుకున్నారాయన. పౌరాణిక ఇతివృత్తాలతోనే భారత చలనచిత్రం సతమతున్న కాలంలో, అచ్చమైన భారతాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు సత్యజిత్‌రాయ్.

సత్యజిత్‌రాయ్ తాత ఉపేంద్ర కిషోర్ రాయ్ చౌదరీ రవీంద్రనాథ్ ఠాగూర్‌కు చాలా సన్నిహితుడు. విజ్ఞాన, కళారంగాల్లో నిష్ణాతుడు. మంచి పిల్లల కథా రచయిత. భారతదేశంలోనే మొట్టమొదటి పిల్లల పత్రిక 'సందేశ్'ను ప్రారంభించాడు. ఉపేంద్ర కథలు చదవని బెంగాలీ పిల్లలు అరుదు. ఆయన ప్రతిభావంతుడైన చిత్రకారుడే కాక, వయొలిన్ విద్వాంసుడు కూడా. ఉపేంద్ర పెద్ద కుమారుడు సుకుమార్ రాయ్ (సత్యజిట్ రాయ్ తండ్రి) గొప్ప రచయిత, మేధావి. ఆయన కూడా పిల్లల కథా రచయిత. అతడి కథలూ, కవితలూ పిల్లలనే కాదు, పెద్దవారినీ అలరించాయి. సైన్స్ డిగ్రీ తర్వాత సుకుమార్ ఇంగ్లాండ్‌లో ఫోటోగ్రఫీ, ప్రింటింగ్ టెక్నాలజీని అభ్యసించాడు.

సుకుమార్ రాయ్, సుప్రభా రాయ్‌లకు 1921, మే 2న జన్మించాడు సత్యజిత్ రాయ్. అతడు పుట్టిన రెండున్నరేళ్లకే తండ్రి సుకుమార్ మరణించాడు. దాంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. సుప్రభా కొడుకుని తీసుకుని తన అన్నయ్య ఇంటికి వచ్చి కుటుంబ పోషణకు చిన్న ఉద్యోగం చేసేది. సత్యజిత్ మొదట బాలీగంజ్ హై స్కూలులో చదువుకున్నాడు. కళాశాలలో రెండేళ్లు సైన్స్ చదివినా 'త్రికోణమితిలో సైన్‌లూ, తీటాలూ ఇబ్బంది పెట్టేవి. ఫిజిక్సూ, కెమిస్ట్రీ నచ్చేవికావు' అని చెప్పుకున్నాడు. తన తండ్రి స్నేహితుడైన ప్రశాంత చంద్ర మహలనోబిస్ (భారత పంచవర్ష ప్రణాళికల రూపకర్త) సలహా మేరకు ప్రెసిడెన్సి కాలేజీలో రెండేళ్ళు ఎకానమిక్స్ చదివాడు. కానీ, అతడి ధ్యాసంతా చిత్రకళ మీదనే. సత్యజిల రాయ్‌కి చిన్నప్పటినుంచే సినిమా అన్నా, సంగీతమన్నా మక్కువ. హాలీవుడ్ నటీనటుల బొమ్మలు కత్తిరించి దాచుకునేవాడు. కాలేజీ టైములో నటుల మీది ఇష్టం దర్శకుల మీదికి మళ్లింది. అలాగే రకరకాల సంగీతాల రికార్డులు వినడం కూడా ఇష్టంగా వుండేది. కలకత్తాలో హాలీవుడ్ సినిమాలకీ, గ్రామ్‌ఫోన్ రికార్డులకీ కొదువలేదు. మొత్తానికి తన తల్లి ప్రోద్బలంతో 1940 లో రవీంద్రుడు శాంతినికేతన్‌లో నెలకొల్పిన విశ్వభారతీ యూనివర్సిటీలో చేరాడు. అక్కడ నందలాల్ బోస్, బినోద్ బిహారీ ముఖర్జీ లాంటి ప్రఖ్యాత చిత్రకారుల నుండి చాలా విషయాలు నేర్చుకున్నాడు. 1972 లో తన విశ్వభారతి గురువు, అంధత్వం దాడిచేసినా బొమ్మలు వెయ్యడం ఆపని గొప్ప చిత్రకారుడు బినోద్ బిహారీ ముఖర్జీపై **'ది ఇన్నర్ ఐ'** (అంతర్ దృష్టి) అనే డాక్యుమెంటరీ తీశాడు. ఆ రోజుల్లోనే ముగ్గురు మిత్రులతో కలిసి అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటాలను సందర్శించి భారతీయ చిత్ర, శిల్ప కళల గురించి అవగాహన చేసుకున్నాడు. ఈ సంగతులు అతడికి కమర్షియల్ అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో చాలా ఉపకరించాయి. శాంతినికేతన్‌లో జర్మనీ బోధించే యూదు ప్రొఫెసర్ ఒకాయన ఉండేవాడు. ఆయన దగ్గర ఉన్న పాశ్చాత్య సంప్రదాయ సంగీతపు రికార్డులను సాయంకాలాల్లో వినేవాడు. కలకత్తాలో **'సిటిజెన్ కేన్'** రిలీజైనప్పుడు శాంతినికేతన్‌లో ఉండడం కారణంగా చూడలేకపోయాడు. సినిమాలు చూడలేక పోయినా అక్కడి గ్రంథాలయంలో సినిమా క్రాఫ్టుకు సంబంధించిన 'ఫిల్మ్ టిల్ నౌ' (పాల్‌రోథా), 'గ్రామర్ ఆఫ్ ది ఫిల్మ్' (రేమండ్ స్పాటిస్‌వుడ్) లాంటి పుస్తకాలు చదివేవాడు. ఇవన్నీ సత్యజిత్ లోని దర్శకుడికి దాణా వేశాయి.

### ఉద్యోగ పర్వం – సృజనాత్మక డిజైనింగు

ఇలావుంటే 1942 డిసెంబరు నెలలో హఠాత్తుగా ఓ రోజు కలకత్తాపై జపాన్ వాళు బాంబులు వేయడంతో శాంతినికేతన్ వదిలి కలకత్తా వచ్చేశాడు. 1943లో డి. జె. కీమర్ అనే బ్రిటీషు అడ్వర్టైజ్‌మెంట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. దాంతోపాటే సిగ్నెట్ ప్రెస్ అనే ప్రచురణ సంస్థకు బొమ్మలు వేసేవాడిగా (ఇలలస్ట్రేటర్‌గా) కుదిరాడు. సాధారణంగా ఒక ప్రధాన పాత్రకు లేదా ప్రధాన సంఘటనకు సంబంధించిన బొమ్మతో ముఖచిత్రాలు తయారుచేసేవారు. కానీ సిగ్నెట్ ప్రెస్‌లో పుస్తకాల కవర్లు రూపకల్పన చేసేటప్పుడు సత్యజిత్ గొప్ప సృజనతో కొత్త పద్ధతులు సృష్టించాడు. సినిమా పోస్టర్లు డిజైను చేసినా, ఏవైనా సంస్థల లోగోలు తయారుచేసినా ఖచ్చితంగా రాయ్ ముద్ర కనిపించేది.

బిభూతిభూషన్ బంధోపాధ్యాయ 'పొథర్ పాచాలి' నవల అప్పటికే చాలా పాపులర్‌గా వుంది. దాన్ని సులువైన భాషలో 'ఆమ్ ఆటీర్ భేపూ' (మామిడి టెంక ఈల) అనే బాలల

(మిగతా 33వ పేజీలో)

# ఈ సంచికలో...


1. నవ సినిమా వైతాళికుడు, బహుముఖ ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్
బాలాజీ.........2
2. వర్గ పోరాటాలతోనే పార్టీ పురోగమనం
వి శ్రీనివాస రావు.....4
3. ఎఐ యుగంలో గ్రాడ్యుయేట్ సంక్షోభం
సుజయ్ చక్రవర్తి........... 7
4. అదిగో నవోదయం
శుభ్రత సేన్ గుప్త ...... 10
5. నిరసనలతో అట్టుడుకుతున్న అమెరికా
ఎస్ వెంకట్రావు......13
6. ఘర్షణల కాలం -2
ఎంవిఎస్ శర్మ.........19
7. ముస్లింలపై నేరస్తుల ముద్రవేస్తున్న బిజెపి
అపూర్వానంద........22
8. జాతీయోద్యమంలో జాడలేని ఆర్ఎస్ఎస్
మృదులా ముఖర్జీ.........24
9. ఏడాది పాలనలో సాధించింది శూన్యం
ఎ కోటిరెడ్డి.........27
10. ప్రజాసైన్స్ ఉద్యమం అనుభవాలు, సవాళ్లు
వి బాలసుబ్రమణ్యం........29



**సంపాదకుడు :**

**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**

**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# చారిత్రక సమ్మె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న దేశ వ్యాపిత సమ్మెకు కార్మికవర్గం ఉపక్రమించింది. పది కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర అఖిలభారత సెక్టోరల్ ఫెడరేషన్లు, సంఘాలతో కూడిన సంయుక్త వేదిక సమ్మె పిలుపు నిచ్చింది. ఇది గతంలో జరిగిన సమ్మెల లాంటిది కాదు. పదకొండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల బేరసారాల శక్తిని పూర్తిగా కొండెక్కించి వారిని పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై కార్మికవర్గం చేస్తున్న సంఘటిత తిరుగుబాటు ఇది.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు కార్పొరేట్ అనుకూల, శ్రామిక ప్రజల వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నది. ఫలితంగా శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పడిపోతున్నాయి. కార్మికుల నిజవేతనాలు ఏటేటా తగ్గిపోతుంటే మరోవైపు కార్పొరేట్‌ల ఆస్తులు ఆకాశానికి అంటుతున్నాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014-15 నుండి 2020-21 మధ్య కాలంలో సంఘటిత రంగంలో కార్మికుల వేతనాల పెరుగుదల రేటు అంతకు ముందున్న 10.1 శాతం నుండి 6 శాతానికి పడిపోయింది. తీవ్రంగా పెరిగిన ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే నిజవేతనాలు మరింత పడిపోయాయి. ఇదే కాలంలో పెట్టుబడిదారుల లాభాలు 38.7 శాతం నుండి 51.9 శాతానికి పెరిగాయి. ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం 2022-23 నాటికి దేశంలోని ఉన్నత 1 శాతం ధనికుల చేతిలోకి దేశం మొత్తం ఆదాయంలో 22.6 శాతం వెళ్లిపోయింది, మొత్తం సంపదలో 40.1 శాతం వారి చేతుల్లోనే ఉంది. అదే సమయంలో పేదలైన దిగువ 50 శాతం ప్రజల వద్ద కేవలం 3 శాతం సంపద మాత్రమే ఉంది. ప్రభుత్వ విధానాలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయో ఈ లెక్కలే కాదు ఇంకా అనేక అధికారిక లెక్కలు చెబుతూనే ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం కనీస వేతనాలు, కార్మికవర్గ ఆదాయాలు పెంచడానికి కృషి చేయాలి. కానీ అది ఆ పని చేయకపోగా అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పేరుతో పెట్టుబడిదారులకు అనుకూలంగా, కార్మికవర్గానికి వ్యతిరేకంగా 'కార్మిక సంస్కరణలకు' ఉపక్రమించింది. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్‌కోడ్‌లను ప్రవేశ పెట్టడం అందులో ఒక ప్రధానమైన చర్య. కార్మికులు తమ వేతనాలు, పనిపరిస్థితులు రక్షించుకోడానికి సంఘం పెట్టుకునే హక్కునూ, సమ్మెచేయగలిగే హక్కునూ లేబర్ కోడ్‌లు హరిస్తాయి. అమెరికాలో మాదిరిగా యజమానులు ఎప్పుడు కావాలంటే అప్పుడు కార్మికులను పనిలోకి తీసుకోడానికీ, లేకుంటే పనిలో నుండి తీసేసేందుకు (హైర్ అండ్ ఫైర్) అవకాశం కల్పిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ కోడ్‌లు పెట్టుబడిదారుల గరిష్ట లాభాలకు గ్యారంటీ కల్పిస్తాయి, దానికోసం కార్మికుల కనీస హక్కులు హరిస్తాయన్నమాట. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి వంటి పెట్టుబడిదారులు ఐటి ఉద్యోగులు కూడా వారానికి 72 గంటలు, 90 గంటలు పనిచేయాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

ఇప్పటికే అసంఘటిత రంగంలోని కార్మికులు కనీస వేతనాలకోసం పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోబడం లేదు. మరోవైపు సంఘటిత రంగ కార్మికులు అనేక పోరాటాలతో సాధించుకున్న హక్కులను కూడా హరించడానికి లేబర్ కోడ్‌ల రూపంలో పూనుకున్నది. ఇదే జరిగితే దేశంలో అసమానతలు, దారిద్ర్యం, నిరుద్యోగం మరింతగా పెరిగిపోతాయి. ప్రజల కొనుగోలు శక్తి మరింతగా పడిపోతుంది. ఫలితంగా దేశాభివృద్ధి కూడా మందగిస్తుంది. అందువల్ల కార్మికులు నేడు చేస్తున్న పోరాటం వారి హక్కుల కోసం మాత్రమే చేస్తున్న పోరాటం కాదు. మొత్తం దేశాభివృద్ధి కోసం చేస్తున్న పోరాటం.

అందుకే ప్రజలందరూ - ప్రతి ఫ్యాక్టరీ, ప్రతి సంస్థ, ప్రతి పట్టణం, ప్రతి పల్లె సమ్మెకు మద్దతుగా నిలబడాలి. తమ హక్కుల సాధనకోసం ఢిల్లీలో ఏడాదికిపైగా వీరోచిత పోరాటం చేసి విజయం సాధించిన సంయుక్త కిసాన్ మోర్చాతో సహా అనేక రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతర అనేక సంఘాలు ఇప్పటికే సమ్మెకు మద్దతు ప్రకటించాయి. వామపక్షాలు సమ్మెకు దన్నుగా నిలబడ్డాయి. అంతా కలిసికట్టుగా సమ్మెను జయప్రదం చేయడం ద్వారా నరేంద్ర మోడీ విధానాలకు 'నో' చెప్పాలి.

# వర్గ పోరాటాలతోనే పార్టీ పురోగమనం

## క్షేత్రస్థాయి కృషి, క్షేత్రస్థాయి నాయకత్వ అభివృద్ధితో నిర్మాణ పటిష్టత



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి

**వి.శ్రీనివాసరావు**

ఆంధ్ర ప్రదేశ్‌లో బలమైన వామపక్ష శక్తిగా స్వతంత్ర రాజకీయ పునాదిపై సిపిఐ(యం)ను పునర్నిర్మించాలని రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర విస్తృత సమావేశం పిలుపునిచ్చింది. 24వ అఖిలభారత మహాసభ నిర్మాణ నివేదిక ఆధారంగా కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలపై జూన్ 16,17 తేదీలలో విజయవాడలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శులకు వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాపులో రూపొందించిన నిర్దిష్ట ప్రణాళికను 18,19 తేదీలలో జరిగిన రాష్ట్ర విస్తృత సమావేశం చర్చించి ఆమోదించింది. ఈ నాలుగు రోజులు పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, యు వాసుకి హాజరై మార్గనిర్దేశనం చేశారు. వర్క్‌షాపును ప్రారంభిస్తూ బివి రాఘవులు మహాసభ డైరెక్షన్‌కనుగుణంగా కేంద్ర కమిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలోని ముఖ్యాంశాలను వివరించారు. అందులోనూ సభ్యత్వ నాణ్యత, బ్రాంచిల ఫంక్షనింగ్, వర్గ ప్రజా ఉద్యమాలు, హిందూత్వ ప్రమాదం, ఉద్యమాల్లోకి యువతను ఆకర్షించడం వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలను నొక్కి వక్కాణించారు.

రాష్ట్ర కమిటీ వర్క్‌షాపును నాలుగు సెషన్స్‌గా విభజించి వేర్వేరు అంశాలపై నిర్దిష్టంగా చర్చించడం జరిగింది. 1 : రాష్ట్రంలో హిందూత్వ మతోన్మాదాన్ని ఎదుర్కోవడం ఎలా?, 2 : నిర్మాణం – ప్రాధాన్యతలు. 3 : కమిటీలు – శాఖలు – సభ్యులు, 4 : నాయకులు – కార్యకర్తలు – హోల్‌టైమర్‌లు. మొదటి సెషన్‌కు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కా॥ ఎ.వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, వి.రాంభూపాల్ పత్రాన్ని ప్రవేశపెట్టి కర్తవ్యాలను వివరించారు. బి.తులసీదాస్, వి.ఉమామహేశ్వరరావు ప్యానలిస్టులుగా ఉన్నారు. రెండవ సెషన్‌కు కా॥ కిల్లో సురేంద్ర అధ్యక్షత వహించగా, కా॥ డి.రమాదేవి నిర్మాణం – ప్రాధాన్యతలపై పత్రం ప్రవేశపెట్టారు. కా॥ వి.శ్రీనివాసరావు, మూలం రమేష్ ప్యానలిస్టులుగా ఉన్నారు. రెండవరోజు ఉదయం మూడవ సెషన్‌కు కా॥ వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, కా॥ కె.లోకనాథం కమిటీలు – శాఖలపై పత్రాన్ని వివరించారు. కా॥ కె.సుబ్బరావమ్మ, వి.వెంకటేశ్వర్లు ప్యానలిస్టులుగా ఉన్నారు. నాల్గవ సెషన్‌కు కా॥ కె.ప్రభాకరరెడ్డి అధ్యక్షత వహించగా నాయకత్వం – కార్యకర్తలు – హోల్‌టైమర్ల పనిపై కా॥ సిహెచ్.బాబూరావు పత్రాన్ని ప్రవేశపెట్టారు. కా॥ బి.బలరాం ప్యానలిస్టుగా ఉన్నారు. ప్రతి సెషన్‌లోనూ పత్రం ఆధారంగా నిర్దిష్ట కర్తవ్యాలను ప్రతిపాదించారు. ఒక సాధారణ కర్తవ్యాన్ని ముక్కలు ముక్కలుగా విభజించి ఏ ముక్కకు ఆ ముక్క పనిని, ఎవరు చేయాలి? (ఏ స్థాయి కమిటీ, ఏ స్థాయి నాయకులు) ఎప్పటిలోగా చేయాలి? (కాల పరిమితి) ఎలా చేయాలన్న విషయాలపై వివరించారు. ఈ ప్రతిపాదనలపై సభ్యులు చర్చల్లో పాల్గొన్నారు. మూడు నుండి ఐదు నిమిషాల వరకు సభ్యులు సమయం తీసుకున్నారు. చర్చల అనంతరం రాష్ట్ర కార్యదర్శి కొన్ని వివరణలు ఇచ్చారు. సాయంత్రం నాలుగో సెషన్ పూర్తయ్యాక ఆ రెండు రోజుల వర్క్‌షాపులో వ్యక్తమైన అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని కా॥ వాసుకి వర్క్‌షాపు నిర్వహణపై తన అభిప్రాయాన్ని చెప్పారు. ప్రతి అంశంపైనా నిర్దిష్టంగా చర్చించుకొని ఒక ఉమ్మడి అభిప్రాయానికి రావడం మంచి పరిణామమని దీనిని అమలు జరిపేందుకు రాజీపడకుండా పనిచేయాలని సూచించారు. కా॥ బి.వి.రాఘవులు ముగింపు ప్రసంగం చేశారు.

ఈ నాలుగు సెషన్స్‌లో ప్రవేశపెట్టిన పత్రాలను క్రోడీకరించి కేంద్ర కమిటీ కర్తవ్యాలకనుగుణంగా వీటిని ఇమడ్చడం జరిగింది. వీటితోపాటు తక్షణ కర్తవ్యాలను కూడా జోడించి నిర్దిష్ట కర్తవ్యం – నిర్దిష్ట కాలపరిమితితో కూడిన పత్రాన్ని రాష్ట్ర కార్యదర్శి విస్తృత సమావేశంలో ప్రతిపాదించారు. దీనిపై జిల్లాలు, రాష్ట్రకేంద్రం శాఖల నుండి 28 మంది, వివిధ రంగాలకు చెందిన మరో 30 మంది చర్చల్లో పాల్గొన్నారు. కార్యదర్శి సమాధానం అనంతరం నివేదికను విస్తృత సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. చర్చల అనంతరం 19వ తేదీ మధ్యాహ్నం పొలిట్‌బ్యూరో సభ్యులు కా॥ యు.వాసుకి ప్రతినిధులనుద్దేశించి మాట్లాడారు. చివరలో కా॥ బి.వి.రాఘవులు ముగింపు ప్రసంగం చేశారు.

### పెరుగుతున్న హిందూత్వ మతోన్మాద ప్రమాదం

2024 ఎన్నికల తరువాత రాష్ట్రంలో హిందూత్వ మతోన్మాద ప్రమాదం పెరిగింది. కేంద్రంలో ఎన్డీయే కూటమికి నాయకత్వం వహిస్తున్న బిజెపి రాష్ట్రంలో ప్రభుత్వంలో భాగస్వామిగా మారింది. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్‌ను కూడా ఉపయోగించుకొని మత

విద్వేషాలు పెంచి బలపడాలని బిజెపి చూస్తున్నది. వీరి కుతంత్రాలకు జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రత్యక్షంగానూ, తెలుగుదేశం పరోక్షంగానూ సహకరిస్తున్నాయి. ప్రతీ ఘటనకు మతం రంగు పులిమి విద్వేషాలు పెంచుతున్నారు. దీనిని ఎదుర్కొవడానికి మూడు రంగాల్లో కృషి జరగాలని విస్తృత సమావేశం అభిప్రాయ పడింది. ఒకటి : సైద్ధాంతిక రంగంలో, రెండు: సాంస్కృతిక సేవా రంగాల్లో, మూడు: వర్గ పోరాటాలు – ప్రజా ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలి. వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్న ప్రజలు సైద్ధాంతికంగా, మానసికంగా మతోన్మాద భావజాలానికి ఆకర్షితులవుతున్నారు. రాజకీయంగా బూర్జువా పార్టీల వెంట కొట్టుకుపోతున్నారు. విస్తృత ప్రజానీకంలోకి లౌకికవాదంతోపాటు సోషలిస్టు భావజాలాన్ని కూడా జొప్పించాలి. ఆర్ఎస్ఎస్ భావజాలం ఎలా తప్పో దానివల్ల జరిగే అనర్థాలు ఎలా ఉంటాయో ప్రజలతో ఎప్పటికప్పుడు వివరించాలి. ఇందుకవసరమైన సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని రాజకీయ తరగతులు, స్టడీసర్కిల్స్ వర్క్‌షాపుల ద్వారా కార్యకర్తలకు కల్పించాలని విస్తృత సమావేశం నిర్ణయాని కొచ్చింది. సదస్సులు, సెమినార్లు, బహిరంగ స్టడీసర్కిల్స్, రూపంలోనూ, కరపత్రాలు, బుక్‌లెట్స్ ద్వారానూ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి ప్రమాదకరమైన హిందూత్వ భావజాలాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చింది. రాష్ట్రంలో లౌకిక ప్రజాస్వామిక శక్తులను విశాల వేదికపై కూడగట్టి ఒక వేదికపైకి తెచ్చేందుకు లౌకిక శక్తులు, వామపక్ష పార్టీలు, ప్రముఖులతో సంప్రదించాలి.

లౌకిక ప్రజాస్వామిక శక్తులను కూడగట్ట డంలో వామపక్ష పార్టీలు ముఖ్యభూమిక పోషించాలి. తక్షణ ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు, పలు సందర్భాల్లో ఉమ్మడి పిలుపులు ఇస్తున్నాయి. అయినప్పటికీ రాజకీయ సైద్ధాంతిక విబేధాలు కొనసాగుతున్నాయి. వాటితో నిమిత్తం లేకుండా లౌకిక శక్తుల ఐక్యతకు ఉమ్మడిగా ప్రయత్నిం చాలి. ఇందుకోసం సిపిఐ(యం) తనవంతు కృషి చేయాలని నిర్ణయించుకుంది. రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఏర్పడటం ఆలస్యం అయినప్పటికీ లౌకిక శక్తులను ఏకంచేసి బిజెపి మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి ఆలస్యం కాకుండా కృషి జరగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. వామపక్ష ఐక్యత ఇందులో కీలకపాత్ర పోషిస్తుంది.

“ లౌకిక ప్రజాస్వామిక శక్తులను కూడగట్టడంలో వామపక్ష పార్టీలు ముఖ్యభూమిక పోషించాలి. తక్షణ ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు, పలు సందర్భాల్లో ఉమ్మడి పిలుపులు ఇస్తున్నాయి. అయినప్పటికీ రాజకీయ సైద్ధాంతిక విబేధాలు కొనసాగుతున్నాయి. వాటితో నిమిత్తం లేకుండా లౌకిక శక్తుల ఐక్యతకు ఉమ్మడిగా ప్రయత్నించాలి. ఇందుకోసం సిపిఐ(యం) తనవంతు కృషి చేయాలని నిర్ణయించుకుంది. ”



సిపిఐ(ఎం) స్వతంత్ర శక్తిగా ఎదిగితేనే దేశానికి విముక్తి

**స్వతంత్ర శక్తిగా సిపిఐ(యం)**

24వ మహాసభలో సిపిఐ(యం) స్వతంత్ర బలం పెంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. సిపిఐ(యం) బలపడకుండా వామపక్ష శక్తులను కూడగట్టలేము. ఈ వాస్తవికతను అర్థం చేసుకొని పార్టీని స్వతంత్ర రాజకీయ శక్తిగా మల్చేందుకు ప్రయత్నించాలి. వర్గ పోరాటాలు, ప్రజా ఉద్యమాల ద్వారానే అది సాధ్యమవుతుంది. పార్టీ మహాసభ పిలుపునిచ్చినట్లుగా స్థానిక పోరాటాలను ఉధృతం చేయడంలో అన్ని స్థాయిల్లోనూ కృషి జరగాలి. ప్రతి నాయకుడు/నాయకురాలు ఈ బృహత్కర కృషిలో ప్రత్యక్షంగా పాల్గొనాలి. దానికనుగుణంగా ఈ వర్క్‌షాపులో కర్తవ్యాలు నిర్దిష్టంగా రూపొందించుకున్నాము.

**అమలుకోసం నిర్దిష్ట ప్రణాళిక**

ఎంతమంచి నిర్ణయమైనా అమలు జరిపితేనే ఫలితాలు వస్తాయి. గత మూడు మహాసభల్లోనూ, కలకత్తా ప్లీనంలోనూ నిర్ణయించుకున్న అనేక కర్తవ్యాలు నేటికీ అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. అమలులో జాప్యానికి కారణం నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడమేనని గత మహాసభ గుర్తించింది. పొలిట్ బ్యూరో మొదలుకొని శాఖ స్థాయి వరకు అన్ని స్థాయిల్లోనూ ఈ కృషి లోపం ఉంది. దీనిని అధిగమించడానికి పైనుండి క్రింది వరకు పర్యవేక్షణ, అజమాయిషీ పెరగాలని, శాస్త్రీయ పనిపద్ధతులు అమలుచేయాలని, ఫలితాలపై సమీక్ష జరగాలని, లోపాలున్న కమిటీలు, నాయకులను గుర్తించి సరిదిద్దాలని మహాసభ నిర్దేశించింది. సమిష్టి నిర్ణయం, వ్యక్తిగత బాధ్యత అనే సూత్రం మీద ఆధారపడి నిర్ణయాల అమలుపై సమీక్షలు జరగాలి. ఈ క్రమంలో పార్టీలో పెడధోరణులు ఆటంక మవుతున్నాయి. సైద్ధాంతికంగా పార్లమెంటరీ తత్వం (అవకాశవాదం) ప్రధాన ఆటంకంగా ఉంది. ప్రపంచీకరణ ఆలోచనల ప్రభావం, మార్కెట్ సంస్కృతి, అస్థిత్వవాదాలు వివిధ స్థాయిల్లో వ్యక్తమవుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా అంతర్గత పోరాటం సాగాలి. రాజకీయ రంగంతోపాటు సాంస్కృతిక, సేవా రంగాల్లో

> ❝ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగిన శాఖలు, పార్టీ సభ్యుల పనిలో గణనీయమైన మార్పు వస్తేనే పార్టీ రాజకీయ పునాది బల పడుతుందని, ఒక రాజకీయ శక్తిగా ఎదగడానికి మార్గం ఏర్పడు తుందని అనుభవం రుజువు చేస్తున్నది. వివిధ కారణాల చేత ఇటీవల కాలంలో శాఖల ఫంక్షనింగు దెబ్బ తిన్నది. కార్యక్రమాల్లో, పోరాటాల్లో సభ్యుల భాగస్వామ్యం తగ్గింది. సానుభూతిపరులు, శ్రేయోభిలాషు లతో సంబంధా లు కూడా బలహీనపడ్డాయి. ❞

కూడా కృషిని పెంచితేనే భావజాల పోరాటాన్ని సాగించగలం. పార్టీతోపాటు వివిధ ప్రజారంగాల్లో సైతం ఈ పోరాటం సాగాలి. అందుకనుగుణంగా నిర్దిష్ట కర్తవ్యాలను రూపొందించుకోవాలని ఈ సమావేశం నిర్ణయించింది.

### ప్రజలతో కలిసిమెలసి శాఖలు, సభ్యుల్లో పని

ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగిన శాఖలు, పార్టీ సభ్యుల పనిలో గణనీయమైన మార్పు వస్తేనే పార్టీ రాజకీయ పునాది బలపడుతుందని, ఒక రాజకీయ శక్తిగా ఎదగడానికి మార్గం ఏర్పడుతుందని అనుభవం రుజువు చేస్తున్నది. వివిధ కారణాల చేత ఇటీవల కాలంలో శాఖల ఫంక్షనింగు దెబ్బతిన్నది. కార్యక్రమాల్లో, పోరాటాల్లో సభ్యుల భాగస్వామ్యం తగ్గింది. గతంలోలాగా కుటుంబాలు పాలు పంచుకోవడం లేదు. సానుభూతిపరులు, శ్రేయోభిలాషులతో సంబంధాలు కూడా బలహీనపడ్డాయి. పై కమిటీ పిలుపులకే పరిమితమవడం, కార్యక్రమాలను యాంత్రికంగా నిర్వహించడం వంటి పనిపద్ధతులు చొరబడ్డాయి. ఇటీవల నిర్వహించిన ప్రజాచైతన్యయాత్రల సందర్భంగా వచ్చిన అనుభవాలు మన బలహీనతలను ఎత్తిచూపాయి. ఈ యాత్రల సందర్భంగా అనేక సమస్యలను గుర్తించాము. కొన్ని అక్కడికక్కడే పరిష్కారం కూడా అయ్యాయి. కానీ అనేక చోట్ల సమస్యల కొనసాగింపు మధ్యలోనే ఆగిపోయింది. దీనివల్ల మనపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని గుర్తించాము. ఈ సమావేశాల్లో దాని కొనసాగింపుకోసం ప్రధాన నిర్ణయం తీసుకున్నాము. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ధనిక వర్గాల కూటమికి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, కౌలురైతులు, మధ్యతరగతిని కూడగట్టేందుకు పార్టీ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ఆ శాఖలను పనిచేయించే బాధ్యత పై కమిటీ బాధ్యులది. మండల, పట్టణ కమిటీ సభ్యులు, హోల్‌టైమర్ల పనిశైలిలో మార్పు రావాలి. ప్రజా పంథాను ఒక యజ్ఞంలాగా ఆచరించాలి. దీనిని అర్థం చేసుకోవడంలోనూ, అమలు చేయడంలోనూ అనేక లోపాలు కొనసాగుతున్నాయి. ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలోనే రాజకీయ కృషి కూడా జరగాలి. రాజకీయ కృషితోపాటు సాంస్కృతిక, సేవా రంగాల్లో కృషిని జోడించాలి. ఇందుకవసరమైన విశాల వేదికలను ఏర్పాటు చేసి పనిచేయించాలి. ఇందులో ప్రధానంగా మన పార్టీ శ్రేయో భిలాషులు, సాను భూతిపరులను భాగస్వా ములను చేయాలి. ఇలాంటి వేదికల్లో రాజకీయంగా విబేధించేవారిని సైతం కలుపుకొని పోవాలి. హిందూత్వ మతోన్మాదాన్ని వ్యతిరేకించే అభ్యుదయ వాదులను గుర్తించి వారి సహకారం తీసుకోవాలి. ఇందు కనుగుణంగా మన ఆలోచనలను మార్చుకోవాలి.

### ప్రజా రంగాల్లో కృషి

ప్రజారంగాల్లో స్వతంత్ర కృషి చేస్తూనే వివిధ రంగాల మధ్య సమన్వయం, సహకారం, సంఘీభావం ఉండాలి. వివిధ రంగాల్లో పనిచేస్తున్న పార్టీ సభ్యులు, కార్యకర్తలు వారు నివసించే ప్రాంతాల్లోనూ చురుగ్గా ఉండేటట్లు ప్రోత్సహించాలి. స్థానిక సంస్థల్లో చొరవ తీసుకొని పనిచేయాలి. ముఖ్యంగా గ్రామీణ శ్రామికుల్ని ప్రత్యేకంగా కూడగట్టేందుకు పార్టీ శాఖలు కృషి చేయాలని, కార్మిక, వ్యవసాయ కార్మిక రంగాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరింది. తద్వారా వివిధ వర్గాల, తరగతుల ప్రజల మధ్య ఐక్యత బలపడుతుంది. ఆర్థికవాదం, అస్థిత్వ వాదం, ఫ్రంటిజం/ డిపార్టమెంటలిజం ఈ కృషికి ఆటంకంగా మారింది. వ్యక్తిగత ధోరణులు సమిష్టి నిర్ణయాల అమలుకు ఆటంకమవుతున్నాయి. వివిధ కేంద్రాల్లో పనిచేసే నాయకత్వం మధ్య టీమ్‌వర్క్ పెరగాలి.

### 1. హోమ్‌వర్క్ 2. టీమ్ వర్క్ 3. ఫీల్డ్ వర్క్ 4. మాస్ వర్క్

ఈ వర్క్‌షాపు, విస్తృత సమావేశాల్లో రూపొందించుకున్న కార్యాచరణ ప్రణాళిక అమలుకోసం వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలు హోమ్‌వర్క్ చేయడం అత్యంత కీలకమైన అంశం. ప్రణాళిక అమలుకు ముందస్తుగా కసరత్తు చేయకుండా పనిపై స్పష్టత రాదు. సమాచార సేకరణ, పని లక్ష్యంపై స్పష్టత, కార్యకర్తలను, నిధులను సమకూరుచ్కోవడం ఈ హోమ్‌వర్క్‌లో భాగమే. తీసుకున్న నిర్ణయాలు అమలు జరపడంలో క్రిందస్థాయి కార్యకర్తలకు పైస్థాయి నాయకత్వం సహకరించాలి. దానికోసం పైనాయకత్వం ఫీల్డ్‌వర్క్ చేయాలి. ఫీల్డ్ (క్షేత్రం)లో ఉంటూ ప్రజలతో నిరంతరం సంబంధాలు పెట్టుకునే విధంగా కార్యకర్తలను ప్రోత్సహించాలి. బలహీన మైన ప్రాంతాలు, రంగాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సహకరించాలి. మొత్తంమీద ఈ సమావేశాల్లో ప్రతి కార్యకర్త, నాయకులు ఆచరించదగిన నినాదాలను ఈ వర్క్‌షాపు రూపొందించింది.

పై నినాదాలను నిరంతరం గమనంలో పెట్టుకుంటూ మన శైలిలో మార్పుకోసం ఎవరికి వారు అంతర్గతంగా పోరాడాలి. వివిధ స్థాయిల్లో, కమిటీలలో తీసుకున్న నిర్ణయాల అమలుకోసం అంతర్గత పోరాటం సాగాలి. మొహమాటాలకు తావు లేకుండా స్వేచ్ఛగా చర్చలు సాగాలి. ఫలితాలకు ప్రాధాన్య తనివ్వాలి. నాయకులు, కార్యకర్తల జీవితాలు ప్రజా జీవితంలో పారదర్శకంగా ఉండేట్లు చూసుకునే విధంగా ఇతర పార్టీలకు భిన్నంగా సిపిఐ(యం) ప్రత్యేకతను నిలబెట్టుకోవాలి. తద్వారా నూతన రాజకీయ సంస్కృతికి ప్రతినిధిగా సిపిఐ(యం)ను ప్రజలముందు నిలబెట్టాలి. ❋

ఈ మాసం ప్రత్యేకం

# ఎఐ యుగంలో గ్రాడ్యుయేట్ సంక్షోభం



రచయిత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్‌లో ఎకనామిక్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు

సుజయ్ చక్రవర్తి

ఈ శతాబ్దం ఆరంభం నుండీ ప్రపంచ కార్మికశక్తిలో యువతలో నిరుద్యోగ సమస్య అందరినీ కలవర పరుస్తోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనాల ప్రకారం పెద్దవారిలో కన్నా యువతలో మూడు రెట్లు నిరుద్యోగిత ఉంది. ప్రపంచంలో అనేక దశాబ్దాలుగా యువతలో నిరుద్యోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉన్న యువత నిరుద్యోగిత 2012 నాటికి 6.2 శాతానికి పెరిగింది. తరువాత అది మూడు రెట్లు పెరిగిపోయి 2018 నాటికి 18 శాతానికి చేరుకున్నది. 2020 నాటికి 15.1 శాతం ఉన్నది. ఐఎల్ఓ అంచనా ప్రకారం 2023లో 15-25 సంవత్సరాల మధ్య నున్న యువలో నిరుద్యోగం 13 శాతం ఉంది. ఆసియాలో ఇది ధనిక దేశాల్లో కన్నా ఎక్కువగా ఉంది.

ఏ దేశంలో అయితే జనాభాలో యువత అత్యధికంగా ఉంటుందో ఆ దేశానికి యువ జనభా ఒక వరం వంటిది. యువ జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో వారికి ఉద్యోగాలు కల్పిస్తే ఆ దేశం పురోభివృద్ధి సాధిస్తుంది. ఆ లెక్కన చూసుకున్నప్పుడు 2021లో భారత దేశంలోని కార్మిక శక్తిలో 29 ఏళ్లకన్నా తక్కువ వయస్కులు 53 శాతం మంది ఉన్నారు. 2036 నాటికి ఈ వయసువారి సంఖ్య 43 శాతానికి తగ్గిపోతుందని అంచనా.

పనిచేయడానికి సిద్ధంగా ఉండి ఉపాధిలేకపోయిన వారిని నిరుద్యోగులంటాం. నిరుద్యోగ రేటు ఎంతుందో తెలుసుకోడానికి శ్రామికి శక్తి మొత్తం సంఖ్య లేక కార్మిక శక్తి పాల్గనే రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) ముఖ్యమైనది. అయితే ఆయా దేశాల్లో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువతలో నిరుద్యోగాన్ని నిర్ధిష్టంగా కొలవడం సంక్లిష్టంగా మారింది. దానికి కారణం యువతలో చాలా మందికి విద్యగానీ, ఉపాధిగానీ, లేక శిక్షణ గానీ లేకపోవడం. వీరిలో చాలా మంది యువతకు విద్య, నైపుణ్యం తక్కువగా ఉన్నందున స్థిరమైన ఉపాధికోసం ప్రయత్నించరు. అందువల్ల వీళ్లు శ్రామిక శక్తిలో పాల్గనడం లేదు. నిజానికి వీరు సరైన శిక్షణ పొందితే ఉపాధి దొరుకుతుంది. మొత్తం యువతలో ఉద్యోగాల కోసం చూస్తూ కూడా ఉద్యోగం దొరకని వారి శాతాన్నే నిరుద్యోగ రేటు అంటాం.

**నిరుద్యోగాన్ని కొలవడంలో విభిన్న పద్ధతులు**

భారత దేశంలో నిరుద్యోగాన్ని కొలవడానికి విభిన్న పద్ధతులు అనుసరిస్తుండడం వల్ల నిరుద్యోగ రేటుకు సంబంధించిన విభిన్న అంచనాలు వస్తున్నాయి. ఉదాహరణకు, ప్రభుత్వం రెండు రకాలుగా నిరుద్యోగాన్ని అంచనా వేస్తుంది. ఒక అంచనా ప్రకారం ఒక వ్యక్తి జరిగిపోయిన 365 రోజుల్లో (అంటే గడిచిన ఏడాదిలో) 30 రోజులకు తగ్గకుండా ఉపాధి పొంది ఉంటే అతన్ని "ఉద్యోగస్తుడి"గా లెక్కిస్తారు. రెండో పద్ధతి ప్రకారం సంవత్సరంలో మెజారిటీ రోజులు ఉపాధి పొంది ఉంటే అతన్ని ఉద్యోగిగా లెక్కిస్తారు. నిజానికి మొదటి పద్ధతిలో నిరుద్యోగులుగా తేలిన వారు తీవ్రమైన నిరుద్యోగులు (క్రోనికల్లీ అనెంప్లాయిడ్) కింద లెక్క. అలా కాకుండా రెండో పద్ధతిలో నిరుద్యోగ రేటు అంచనా కడితే మనకు విభిన్నమైన నిరుద్యోగ రేటు వస్తుంది.

నిరుద్యోగ రేటు అంచనావేయడానికి మనకు అంతర్జాతీయ కార్మిక సంస్థ పద్ధతి ఒకటి ఉంది. దీని అంచనా ప్రకారం ఏటేటా యువతలో ఉద్యోగిత, కార్మిక శక్తిలో పాల్గనడం తగ్గిపోతున్నది. భారత దేశంలో నిరుద్యోగంపై ఐఎల్ఓ ఇచ్చిన నిరుద్యోగం ప్రకారం మన దేశంలో 15-29 ఏళ్ల మధ్య యువకుల్లో ఉద్యోగిత రెండు దశాబ్దాల్లో బాగా తగ్గిపోయింది. 2000 సంవత్సరంలో యువతలో 52 శాతం ఉన్న ఉద్యోగిత 2022 నాటికి 37 శాతానికి తగ్గిపోయింది. ఈ కాలంలోనే కార్మికశక్తిలో పాల్గొనేవారి సంఖ్య 54 శాతం నుండి 42 శాతానికి తగ్గిపోయింది. మహిళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఐఎల్ఓ తెలిపింది. దాని నివేదిక ప్రకారం 2022 నాటికి కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం 21.7 శాతం మాత్రమే ఉంది.

అదేవిధంగా, సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) 2024లో జరిపిన సర్వే ప్రకారం 20-24 ఏళ్ల మధ్య వయస్కుల్లో నిరుద్యోగం 45 శాతం ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సరేవ (పిఎల్ఎఫ్ఎస్) మాత్రం యువతలో నిరుద్యోగం భరించదగ్గ విధంగా ఉందని పేర్కొంది. 2022లో 15-19 సంవత్సరాల మధ్య యువకుల్లో నిరుద్యోగం 19.2 శాతం ఉందనీ, 20-24 ఏళ్ల మధ్య యువకుల్లో 20.4 శాతం, 25-29 ఏళ్ల మధ్య యువకుల్లో 10.4 శాతం ఉందనీ ఇది భరించదగ్గదేనని పిఎల్ఎఫ్ఎస్ సర్వే పేర్కొంది. అలాగే ఇదే వయో పరిమితుల్లోని యువతుల్లో నిరుద్యోగం వరుసగా 23.0, 32.9, 19.1 శాతాలుగా ఉందని సర్వే తెలిపింది.

ఏ సంఖ్యలను మనం నమ్మినప్పటికీ, ఈ సంఖ్యలు ముఖ్యంగా 15-19, 20-21 వయో గ్రూపుల్లో ఉన్న వారిలో నిరుద్యోగిత పెద్ద ప్రమాదంగా కనిపించదు. ఎందుకంటే ఈ గ్రూపులోని యువత ఉన్నత విద్య చదువుకోవడమో లేక లేబర్ మార్కెట్‌లోకి

> **"ఎక్కువ చదువుకున్న యువతలో ఎక్కువ నిరుద్యోగిత ఉంది. ఉన్నత చదువులు చదివిన యువకుల్లో మూడో వంతుమంది, ఉన్నత చదువులు చదివిన యువతుల్లో 40 శాతానికి పైగా ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారు. లేబర్ మార్కెట్‌లో ఈ విధమైన తిరోగమనం వల్ల ఉత్పాదకత తగ్గి పోతున్నది. ఆర్థికాభివృద్ధి కృశించి పోతున్నది. కార్మికుల నైపుణ్యాలు, ఉద్యోగావసరాల మధ్య ఒకరకమైన అసమ తుల్యత ఏర్పడుతున్నది. ఇది ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం కలిగిస్తోంది."**

రాకపోవడమో జరుగుతుంది. అంతే కాకుండా, భారత దేశంలో ఉద్యోగిత, లేక కార్మికశక్తిలో భాగస్వామిగా ఉన్నారన్నదానికి చాలా తేలికైన నిర్వచనం ఇస్తున్నందున, మన ఉద్యోగిత రేటు సంఖ్యలు మనకు తెలియకుండా ముఖ్యంగా అంసఘటిత రంగంలో కొనసాగుతున్న నిరుద్యోగితను లేక అండర్ ఎంప్లాయిమెంటును కప్పిపుచ్చుతాయి.

### ముఖ్యమైన విషయాలు

– ఎక్కువ చదువుకున్న యువతలో ఎక్కువ నిరుద్యోగిత ఉంది. ఉన్నత చదువులు చదివిన యువకుల్లో మూడో వంతుమంది, ఉన్నత చదువులు చదివిన యువతుల్లో 40 శాతానికి పైగా ఉద్యోగాలు లేక అల్లాడుతు న్నారు. లేబర్ మార్కెట్‌లో ఈ విధమైన తిరోగమనం వల్ల ఉత్పాదకత తగ్గిపోతున్నది. ఆర్థికాభివృద్ధి కృశించిపోతున్నది. కార్మికుల నైపుణ్యాలు, ఉద్యోగావసరాల మధ్య ఒకరకమైన అసమతుల్యత ఏర్పడుతున్నది. ఇది ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం కలిగిస్తోంది.

– ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) వల్ల ఉన్న ఉద్యోగాల సంఖ్య మరింతగా తగ్గిపో తుండడంతో యువతకు ఉద్యోగాలు దొరకడం మరింత కష్టమైపోతున్నది. మన ప్రభుత్వం ఉన్నత చదువులు చదువుకున్న యువతీయువకుల నైపుణ్యాలను తక్షణం ఉన్నతీకరించాలి.

– ఈ విషయాలను మరింత లోతుగా పరిశీలిస్తే, అకాడమిక్ అర్హతలు పెరుగుతున్నా కొద్దీ నిరుద్యోగం పెరుగుతున్న విషయాన్ని గమనించ గలుగుతాము. 2022–23లో పిఎల్ఎఫ్ఎస్ సేకరించిన లెక్కల ప్రకారం 15–59 ఏళ్ల వయో పరిమితిలోని పోస్టుగ్రాడ్యు యేట్లలో యువకుల్లో నిరుద్యోగిత 10.25 ఉంది, యువతుల్లో 20.82 శాతం ఉంది. అదే 15–29 వయో పరిమితిలోని పోస్టుగ్రాడ్యు యేట్లలో పరిశీలిస్తే యువకుల్లో 33.90 శాతం, యువతుల్లో 41.49 శాతం నిరుద్యోగిత ఉంది. దీని వల్ల తెలుస్తున్నదేమంటే ఉన్నత చదువులు చదివిన యువకుల్లో మూడోవంతు, యువతుల్లో 40 శాతం పైన నిరుద్యోగులుగా ఉన్నారు.

తక్కువ చదువుకున్న యువకుల్లో నిరుద్యోగ రేటు సాపేక్షంగా తక్కువగా ఉంది. అంటే మన ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ నైపుణ్యాలు గలవారికి అధికానైపుణ్యం గల ఉద్యోగాలు దొరకడం లేదన్న విషయం అర్ధమవుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు నష్టదాయకం. ఉద్యోగ మార్కెట్‌లో ఈ తిరోగమనం ఇటీవల అనేక రాష్ట్రాల్లో పారిశుధ్య కార్మికులు వంటి తక్కువ నైపుణ్యం గల ఉద్యోగాల కోసం బిటెక్, ఎంటెక్, ఎంబిఎ చదువుకున్న వారు దరఖాస్తులు చేసుకుంటుం డంతో పెద్దగా చర్చలోకి వచ్చింది. యువత జనాభాలో ఎక్కువగా ఉన్నందువల్ల వచ్చే సానుకూలతను ఇది వమ్ము చేస్తుంది.

లేబర్ మార్కెట్‌లో ఈ రకమైన తిరోగమనం వల్ల పెద్ద చదువులు చదివే వారికి ఎక్కువ అవకాశాలు లేకుండా పోతాయి. కాబట్టి ప్రజల్లో ఉన్నత చదువులు చదవడానికి ప్రోత్సాహం లేకుండా పోతుంది. దాని వల్ల అకాడమిక్, వృత్తినిపుణత కలిగిన కార్యక్రమాల్లో ఎన్‌రోల్ చేసుకునేవారి సంఖ్య తగ్గిపోతుంది. ఫలితంగా ఈ కార్యక్రమాలు కునారిల్లిపోతాయి. ఈ శతాబ్దంలో ప్రపంచ వ్యాపితంగా ఉన్నత విద్యనభ్యసించేవారిలో నిరుద్యోగిత పెరగడం అన్న సమస్య తీవ్రమవుతోంది. దీన్ని పరిష్కరించాల్సి ఉంది.

మార్క్ టేలర్ 2011లో నేచర్ పత్రికలో ఒక వ్యాసం రాస్తూ, ఉన్నత విద్యాలయాల్లో ఉన్నత పోస్టుగ్రాడ్యుయేట్లు పొందే క్రమాన్నయినా మనం మార్చాలి లేకుంటే పనికిరాని ఆ కార్యక్రమాలను మూసేయాలి ముఖ్యంగా పిహెచ్‌డి కార్యక్రమాలను. ఎందుకంటే ఈ కార్యక్రమాలు అనేక మంది ఉన్నత గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తున్నాయి, తరువాత వారంతా ఉద్యోగాలు పొందలేక పోతున్నారు అని చెప్పారు. ఆయన నిరాశతో ఇటువంటి ప్రకటన చేసి ఉండొచ్చుగానీ విద్యను కేవలం భోజం పెట్టే సాధనంగా మార్చేస్తే అప్పుడు సమాజంలో విద్య యొక్క లక్ష్యమే దెబ్బతింటుంది. దీని వల్ల లలిత కళలు, మానవ శాస్త్రం, మౌలిక సైన్సు పరిశోధనలు వంటి కార్యక్రమాలు దెబ్బతింటాయి. ఈ రంగాలు ఏవో కొన్ని వస్తువుల ఉత్పత్తి కోసమో లేక సర్వీసులు అందించడం కోసమో నడుస్తున్నవి కావు.

ఉన్నత విద్యార్హతలున్న వారికి ఉద్యోగాలు దొరక్కపోవడంతో గత 50 ఏళ్లుగా మన దేశం నుండి మేధావుల వలసలు పెరిగిపోతున్నాయి. సరైన ఉద్యోగాలు దొరకని నిపుణులైన వ్యక్తులు ఇతర దేశాలకు వెళ్లిపోయి మళ్లీ రావడం లేదు. దీని వల్ల మన దేశంలో మానవ వనరులు తగ్గిపోతున్నాయి. పృధ్వీరాజ్ చౌదరి, ఇతరులు కలిసి 2023లో అధ్యయనం చేసి జర్నల్ ఆఫ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్‌లో ఇచ్చిన వివరాల ప్రకారం 2010 ఐఐటి ఎంట్రన్స్ పరీక్షల్లో మొదటి 1000 ర్యాంకులు సాధించిన వారిలో 36 శాతం మంది విదేశాలకు వలస వెళ్లిపోయారు. మొదటి 100 ర్యాంకులు సాధించిన వారిలో 62 మంది దేశాన్ని విడిచి వెళ్లిపోయారు. ఈ రకమైన మేధో వలస కొనసాగుతూనే ఉంది. 2022లో ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య 7 లక్షల 70 వేలకు చేరుకున్నది. అంతకు ముందు గడచిన ఆరేళ్ల కాలంలో ఇదే అతి పెద్ద సంఖ్య.

### మేధో వలసకు కారణాలు

భారత దేశంలో బాగా చదుకున్న యువతకు ఉద్యోగాలు రాకపోవడానికి కారణం ఏమిటి? ఒక కారణం, నిజంగానే, ఏమిటంటే మన ఉన్నత విద్యా విధానంలోని పాఠ్యాంశాలు కాలం చెల్లిపోయాయి. అవన్నీ బట్టీపెట్టడం ప్రాతిపదికగా ఉన్నాయి. 50 ఏళ్ల క్రితం నాడు అవి పనికొచ్చేవే కావచ్చు కానీ ఈ రోజున అవి పుస్తకాల బయట ఏమీ ఆలోచించలేని కంఠస్తం గాళ్లను తయారు చేస్తున్నాయి. త్వరగా మారిపోతున్న నేటి ప్రపంచీకరణ యుగంలో కావలసిన కొత్త ఆలోచనలు చేయడానికి అవి పనికిరావు. ప్రభుత్వ ప్రయివేటుకు చెందిన మన ఉన్నత విద్యా సంస్థల్లో ప్రాథమిక సదుపాయాలు, నైపుణ్యం పెంచడానికి కావలసిన పెట్టుబడి లేకపోవడం ఆ సంస్థల్లో మేధో చలనశీలత (ఇంటలెక్చువల్ డైనమిజం) లోపించడానికి ఒక కీలకమైన కారణం. ఈ సంస్థలు తరచూ నైపుణ్యం లేని గ్రాడ్యుయేట్లను

సృష్టిస్తున్నాయి. వారు ఉద్యోగ మార్కెట్‌లో పోటీపడలేక పోతున్నారు. ప్రాముఖ్యం పొందిన ప్రభుత్వ విద్యా సంస్థల్లో కూడా ప్రాథమిక సదుపాయాలు కునారిల్లిపోతున్నాయి, ఏళ్లుగా ఫాకల్టీ పోస్టులను నింపడం లేదు, పాఠ్యాంశాలను తాజాపరచడం లేదు.

గత 20 ఏళ్లుగా ప్రభుత్వం జిడిపిలో 5 శాతానికి మించి విద్యపై ఖర్చు చేయడం లేదన్న విషయాన్ని గమనిస్తే పై అంశం మనకు పెద్దగా ఆశ్చర్యపరచదు. ఇదే సమయంలో 2014, 2022 మధ్య ఉన్నత విద్యలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 3.42 కోట్ల నుండి 4.33 కోట్లకు పెరిగింది. కానీ జిడిపిలో ఉన్నత విద్య వాటా మహా అయితే 1 శాతానికి మించి లేదు. ఈ 20 ఏళ్ల కాలంలో ఉన్నత వర్గాలకు చెందిన కొద్దిపాటి యూనివర్శిటీలు నెలకొల్పబడ్డాయి. కానీ వీటిలో చాలా వరకు మధ్య తరగతికి అందుబాటులో లేవు. విద్యకు కేటాయించే బడ్జెట్ జిడిపిలో 6 శాతానికి పెంచాలని ప్రభుత్వం నూతన విద్యా విధానంలో ప్రతిపాదించింది. ఇది ఆహ్వానించదగ్గ సూచన, వెంటనే అమలు పరచాలి.

"గత 20 ఏళ్లుగా ప్రభుత్వం జిడిపిలో 5 శాతానికి మించి విద్యపై ఖర్చు చేయడం లేదన్న విషయాన్ని గమనిస్తే పై అంశం మనకు పెద్దగా ఆశ్చర్యపరచదు. ఇదే సమయంలో 2014, 2022 మధ్య ఉన్నత విద్యలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 3.42 కోట్ల నుండి 4.33 కోట్లకు పెరిగింది. కానీ జిడిపిలో ఉన్నత విద్య వాటా మహా అయితే 1 శాతానికి మించి లేదు. ఈ 20 ఏళ్ల కాలంలో ఉన్నత వర్గాలకు చెందిన కొద్దిపాటి యూనివర్శిటీలు నెలకొల్పబడ్డాయి. కానీ వీటిలో చాలా వరకు మధ్య తరగతికి అందుబాటులో లేవు."



పాట్నాలోని ఒక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి వద్ద రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరిన నిరుద్యోగ యువత

రెండవ విషయం ఏమిటంటే, 21వ శతాబ్దం మూడో దశాబ్దంలో ఆలోచనలు, జ్ఞాన సృష్టి అనేది చాలా వరకు యాంత్రీకరణ, నైపుణ్య వ్యవస్థలు, కృత్రిక మేధ (ఎఐ)తో ముడిపడి ముందుకు పోతున్నాయి. ప్రపంచంలోని ప్రతి సంస్థలోకీ ఇది చొచ్చుకు పోతోంది. దీని ప్రభావం ఉపాధిమీద పడుతోంది. మొత్తం ఉద్యోగాలు తగ్గిపోతు న్నాయి. ఈరకమైన యాంత్రీకరణ ఇంకా శైశవ దశలోనే ఉన్నప్పటికీ గతంలో ఆవిరి యంత్రం, విద్యుత్, కంప్యూటర్ చిప్స్, కంప్యూటర్ ఆధారిత కార్యాలయ పనులు వంటి వాటి మాదిరిగానే ఈ కొత్త యాంత్రీకరణ కూడా కార్మికుల అవసరాన్ని తగ్గించి వేస్తుందని నోబుల్ బహుమతి గ్రహీతలు ఈథర్ డఫ్లో, అభిజిత్ బెనర్జీలు చెప్పారు. డేవిడ్ ఆటర్ చెప్పిన దాని ప్రకారం 1990లో ప్రారంభమైన తొలి ఐటి విప్లవం, రొటీన్‌గా మళ్లీమళ్లీ చేసే పనులకు కార్మికుల అవసరం లేకుండా చేసింది. దీని వల్ల టైపిస్టులు, అసెంబ్లీ లైన్ కార్మికులు, క్లర్కులు, ప్యూన్‌లు వంటి ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్‌లు వ్యవస్థాగతంగా నిరుద్యోగులుగా మారారు.

ఇప్పుడు కంప్యూటర్ వ్యవస్థలు, యంత్రాలు, ఆల్గోరిథమ్స్ వంటివి స్వయంగా అభ్యసించగల, (సెల్ఫ్ లెర్నింగ్), స్వయంగా బలోపేతం కాగల వ్యవస్థలుగా మారుతాయి. ఈ యంత్రాలను నడిపే అల్గోరిథమ్స్ వల్ల ఈ యంత్రాలు గతంలో మళ్లీమళ్లీ అదే పనిచేసే యంత్రాల మాదిరిగా కాకుండా తమంత తాము విశ్లేషించుకొని స్వయంగా నిర్ణయాలు తీసుకోగలవు. అనేక సందర్భాల్లో ఇవి మనుషుల కన్నా వేగంగా, మనుషలతో పోలిస్తేక్లిష్టమైన, బహుముఖమైన సమస్యలను వేగంగా పరిష్కరించగలవు. నిర్ణయం తీసుకోవడంలోనూ, అంచనా వేయడంలోనూ మనుషుల కన్నా నిష్పాక్షపాతంగా ఉండగలవు. అందువల్ల కృత్రిమ మేధ అనేక రంగాల్లో ఉద్యోగాలను తగ్గించేస్తుంది. ఎకౌంటెంట్లు, కన్సల్టెంట్లు, ఫైనాన్షియల్, మీడియా ప్లానర్లు, పారా లీగల్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇప్పటికే ఏదో ఒకరూపంలోని కృత్రిమ మేధతో పోటీపడాల్సి వస్తోంది. దీనికి "రెండవ యంత్ర యుగం" అని మెసాసుచెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్) ప్రొఫెసర్లు ఎరిక్ బ్రింజోల్ఫ్‌సన్, ఆండ్రూ మెక్‌గీ పేరు పెట్టారు. ఈ రెండవ యంత్ర యుగంలో ఉన్నత విద్యా సంస్థల్లో ఉన్నత చదువులు చదువుకునే వారు రోబోట్‌లు, ఆల్గోరిథమ్‌లు నడిపే ఆర్థిక వ్యవస్థకు సేవచేయగలిగే నైపుణ్యాలు సంపాదించుకుంటే సరి లేకుంటే పెద్ద ఎత్తున నిరుద్యోగానికి గురవుతారు. అలాంటి నైపుణ్యాలు లేనివారు తక్కువ జీతాలు ఇచ్చే తక్కువ నైపుణ్య ఉద్యోగాల్లో చేరాల్సి వస్తుంది. దీని వల్ల సమాజంలో అసమానతలు మరింత ఎక్కువగా పెరిగిపోతాయి. ఇటువంటి "పోస్ట్‌క్యాపిటలిస్టు" యుగంలో టెక్నోఫ్యూడలిజం రాజ్యమేలుతుందని ప్రముఖ ఆర్థిక వేత్త, గ్రీస్ మాజీ మంత్రి యానిస్ వరోఫాకిస్ పేర్కొన్నారు. ఇటువంటి సమాజంలో కొద్దిపాటి కార్పొరేషన్లు లేక క్లౌడ్ 'ప్రభువులు' డిజిటలైజేషన్, ఎఐ శక్తిని కలిగి ఉంటారు. తమ వద్ద ఉన్న కొద్దిపాటి కార్మికులతో వారు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తారు అని ఆయన చెప్పారు. అందువల్ల పెద్ద ఎత్తున కార్మిక శక్తి కలిగి ఉన్న మన దేశానికి చెందిన ప్రభుత్వాలు ఉన్నత విద్యనభ్యసించిన యువజనుల నైపుణ్యాలను తక్షణం పెంపొందించాలి. అప్పుడే వాళ్లు వచ్చే దశాబ్దంలోని ప్రపంచ మార్కెట్ ప్రదేశంలో రాణించి నిలబడగలుగుతారు.

ప్రస్తుతం మన దేశంలో కార్మికులకు పున:నైపుణ్యం కల్పించడానికీ, ఎఐ యుగంలో ఉద్యోగాలు పోయిన వారికి పునరావాసం కల్పించడానికీ ఎటువంటి నిర్దిష్ట విధానాలు లేవు. మరోవైపు అనేక దేశాల్లో ఐబిఎం సంస్థ కృత్రిమ మేధను ఉపయోగించడంపై చేసిన సర్వేలో భారత దేశానికి చెందిన 59 శాతం కంపెనీలు తమ వ్యాపార లావాదేవీల్లో కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నామని చెప్పాయి. సర్వే చేసిన అన్ని దేశాల్లోకీ ఇదే అత్యధికం.

మన కార్మికులను రక్షించుకునే విధానాలను అమలు పరచాలని మన ప్రభుత్వాలను ఇదొక పిలుపు. ❋

# అదిగో నవోదయం

**శుభ్రత సేన్ గుప్త**



**రచయిత కళాకారుడు, కళలపై అనేక రచనలు చేశారు. న్యూ ఢిల్లీలోని రాక్స్ మీడియా కలెక్టివ్ 1992లో ఏర్పడినప్పటి నుండీ దానిలో క్యూరేటర్‌గా పనిచేస్తున్నారు**

కొంతకాలం క్రితం (2024 సెప్టెంబర్‌లో) ప్రభుత్వ అనుకూలమైన వార్తా పోర్టల్స్ చాలా శ్రమించి, "ఫ్యాక్ట్ చెకింగ్" పేరుతో, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఒక పోస్ట్‌ను ఖండించాయి. సర్దార్ వల్లభాభాయ్ పటేల్ విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) బీటలు వారిందని, అది త్వరలోనే కూలిపోయే అవకాశం ఉందన్నది ఆ పోస్ట్ సారాంశం, ఆ పోస్ట్ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు కూడా నమోదు చేసినట్లు సమాచారం. వాస్తవానికి 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' బీటలు వాటిందన్నది ప్రస్తుతానికి ఊహే కావచ్చు కానీ, అటువంటి ప్రమాదానికి దారి తీసే పరిస్థితులను పూర్తిగా కొట్టిపారవేయలేం. ఎందుకంటే, ఆ వార్త వైరల్ కావడానికి కొద్ది రోజుల ముందే, మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో ఏర్పాటు చేసిన 35 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం 2024 ఆగస్టు 5న కూలిపోయింది. ఆ సందర్భంలో కూడా పోలీసులు వేగంగా స్పందించి ఆ విగ్రహాన్ని తయారు చేసిన శిల్పిని అరెస్టు చేశారు.

ఈ విధంగా వేల ఎకరాల విస్తీర్ణంలో, రికార్డులు బద్దలు చేసే ఎత్తులో నిర్మాణమైన గొప్పనాయకుల విగ్రహాలు కూలిపోవడం, లేదా కూలిపోవడానికి సిద్ధంగా ఉండటమన్నది భారత రిపబ్లిక్ వ్యవస్థ సంస్కృతి (లేదా రాజ్య సంస్కృతి)కి ఒక ఉపమానంగా చూడవచ్చు. ఈ విగ్రహాల నిర్మాణం భద్రత విషయంలో ఎటువంటి హామీ ఇవ్వదు.

ఇవి రెండు అంశాలను తెలియజేస్తున్నాయి. మన దేశంలో కళా రంగంలోని చాలా మంది పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేస్తున్న డబ్బును ప్రభుత్వాలు సాంస్కృతిక రంగంపై ఖర్చు చేయడం లేదని విమర్శిస్తారు. అయితే, ఆ విమర్శలకు భిన్నంగా ఈ తరహా ప్రాజెక్టులపై ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది.

ఖర్చు సంగతి అలా ఉంచితే, రెండవ అంశం ఈ భారీ విగ్రహాల ఏర్పాటు కోసం చేసే ఖర్చు ఆర్భాటం ఎలా ఉన్నప్పటికీ అంతిమంగా అవి ఏదో ఒక రోజు భూమ్యాకర్షణ శక్తికి లొంగక తప్పదు. స్వార్థంతో నిండిన మనుష్యుల వ్యామోహ, అహంకార ప్రదర్శనలు చివరికి ఎలా అదృశ్యమౌతాయో అదే విధంగా ఈ భారీ విగ్రహాలు కూడా ఏదోరోజు కూలిపోక తప్పదు. ఈ విగ్రహాలే కాదు. వీటిని ప్రతిష్టించిన పాలకవర్గాలు కూడా ఏదోఒక రోజు పతనం కాక తప్పదు. ఎందుకంటే, ఎంత బలమైన ప్రభుత్వమైనా, ఎంత కఠిన చట్టాలున్నా ప్రకృతి నియమాలను, కాల ధర్మాన్ని అడ్డుకునే శక్తి వాటికి లేదు. ఈ మధ్య కాలంలో ఈ విగ్రహాలు పక్షుల మల విసర్జన కేంద్రాలుగా మారుతున్నాయి. విగ్రహాలు పడిపోవడం అనేది వాటిని నిర్మించిన పాలకుల వైపు సంకేతంగా మారుతుంది.

భ్రమలో మునిగిపోయిన భారతదేశంలో ప్రధాన సాంస్కృతిక ప్రవాహం పతనోన్ముఖంగా సాగిపోతుండటం ఇప్పుడు ఎవ్వరూ నిరాకరించలేని నిజంగా మారింది. కేంద్ర సాంస్కృతిక శాఖ ప్రధాని ముఖచిత్రాలను ప్రదర్శించే గుంపుల ప్రదర్శనలను ఘనంగా నిర్వహిస్తూ, లలిత కళా అకాడమీ 'వికసిత్ భారత్' అనే ప్రధాని కలల దృశ్యాన్ని కళాకృతులుగా మలచమని కళాకారులను ప్రోత్సహిస్తూ వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తోంది. మరోవైపు, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్, ఓ ప్రముఖ ప్రైవేట్ మ్యూజియం వ్యవస్థాపకుడి భాగస్వామ్యంతో, దేశవ్యాప్తంగా ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' అనే ప్రధానమంత్రి వ్యక్తిగత రేడియో ప్రసంగాల 100వ ఎపిసోడ్‌ను పురస్కరించుకుని, మొదటి శ్రేణి ఆధునిక కళాకారులతో ప్రదర్శన ఏర్పాటు చేస్తోంది. వ్యక్తి పూజనే 'సాంస్కృతిక సాధన'గా, దాసోహభావాన్ని 'సాంస్కృతిక నిబద్ధత'గా ప్రకటించే ధోరణి పెరుగుతోంది. నటులు, చలనచిత్ర తారలు ప్రధానిని చుట్టుముట్టి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడటాన్ని చూసినప్పుడు, ఆయనే అసలైన నటుడు, మిగతావారు అందరూ కేవలం బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్లు, అనవసర పాత్రధారుల్లా కనిపిస్తారు. ఆ దృశ్యం ఒక్కటే సినీ పరిశ్రమకు కూడా స్వాభిమానమంటూ ఏమి మిగలలేదని, తమ స్థానాన్ని తామే తక్కువ చేసుకున్నారన్న వాస్తవాన్ని సూటిగా చెప్తోంది.

సాంస్కృతిక కార్యక్రమాలకు మద్దతివ్వడం ద్వారా ప్రభుత్వం కళాకారుల నుంచి పాలకులకు, వారి విధానాలకు మద్దతుగా కళారూపాలను డిమాండ్ చేస్తోంది. అదే విధంగా, కళా, సాంస్కృతిక రంగాలలో అధిక వనరులు ఖర్చు చేస్తున్న ప్రైవేట్ దాతలు కూడా తాము ఇచ్చిన మద్దతుకు భారీ మూల్యం వసూలు చేస్తారు. ప్రైవేట్ దాతృత్వం ప్రధానంగా కళను వ్యక్తిగత అహంకారానికి, వైభవ ప్రదర్శనకు వేదికగా మారుస్తుంది. కళాకారులు సంపద

> **"దీర్ఘకాలిక ప్రాసంగికత కోసం ప్రైవేట్ సాంస్కృతిక సంస్థలు, మ్యూజియంలు తాము ఆధునికతను ప్రతిపాదిస్తున్నమని చెప్పుకుంటే అవి క్రియాశీలక ధోరణిని అవలంబించాలి. అంటే కొత్తదానిని, పరీక్షించనిదానిని, ప్రయోగాత్మకమైనదానిని, సున్నిత మైనదానిని ప్రోత్సహించే, పోషించే బాధ్యతను తీసుకోవాలి. మ్యూజియంలు కేవలం ప్రతిపాదనలకు, అధికారిక ధ్రువీకరణలకు వేదికలుగా మాత్రమే పరిమితమన్న ఆలోచన నుంచి బయట పడాలి."**

ముందు తలవంచడం సహజమే అన్న దృష్టితో వారు వ్యవహరిస్తారు. అధికారానికి ఎలా లొంగి ఉంటారో, సంపద ముందు కూడా అలాగే ఉండాలని కోరుకుంటారు. ఈ రోజు భారత్‌లో సంపద, అధికార ధార్మికతలు కలిసి స్వతంత్రంగా ఆలోచించే, వ్యక్తీకరించే హక్కును తక్కువ చేస్తున్నాయి. అధినేతలు లేదా దాతల అహాలను తృప్తిపరిచేలా విశ్వవీధులలో కీర్తనల మెరుపులను నింపడమే భారతీయ సంస్కృతిగా ప్రచారం చేస్తున్నారు. ఈ తరహా వ్యవస్థాపకుల పేరుతో ఏర్పాటయ్యే మ్యూజియంలు, కల్చరల్ సెంటర్‌లపైన ఎంత పెద్ద అక్షరాలు ఉన్నప్పటికీ, స్పష్టమైన కళాదృష్టి లేకపోవడం, దొరికిన వాటిని మేళవించి ప్రదర్శనలు పెట్టడం వంటి వాటిద్వారా దేశీయ కళాసాంస్కృతిక వేదికలకు దక్కే అభివృద్ధి తక్కువే! అదే సమయంలో అంతర్జాతీయంగా గౌరవాన్ని పొందే స్థాయికి అవి చేరలేవు.

దీర్ఘకాలిక ప్రాసంగికత కోసం ప్రైవేట్ సాంస్కృతిక సంస్థలు, మ్యూజియంలు తాము ఆధునికతను ప్రతిపాదిస్తున్నమని చెప్పుకుంటే అవి క్రియాశీలక ధోరణిని అవలంబించాలి. అంటే కొత్తదానిని, పరీక్షించనిదానిని, ప్రయోగాత్మకమైనదానిని, సున్నితమైనదానిని ప్రోత్సహించే, పోషించే బాధ్యతను తీసుకోవాలి. మ్యూజియంలు కేవలం ప్రతిపాదనలకు, అధికారిక ధ్రువీకరణలకు వేదికలుగా మాత్రమే పరిమితమన్న ఆలోచన నుంచి బయట పడాలి. అవి భావాలు, రూపాలతో సాహసం చేసే స్థలాలుగా, సృజనాత్మకతకు ఆశ్రయ కేంద్రాలుగా మారాలి. కానీ, ఇప్పటి వరకు ప్రైవేట్ దాతఅత్వంతో ఏర్పడిన సాంస్కృతిక సంస్థల వేదికల్లో అధికభాగం సన్మానాలు, సత్కారాలు వంటి గత ఘనతల ధృవీకరణ కార్యక్రమాలకే పరిమితమవుతున్నాయి. రేపటి సంస్కృతి ఏమై ఉండబోతోందన్న ప్రశ్నను ఈ సంస్థలు పక్కన బెడుతున్నాయి.

### సంఘటిత వ్యతిరేకత

కొన్ని ఫౌండేషన్లు, లాభాపేక్షలేని కళాసంస్థలు, కళాకారులు నడిపే కార్యక్రమాలు ప్రధాన నగరాల్లో తమ స్వయం నిర్వహణను, స్వతంత్రతను కాపాడుకునేందుకు గట్టిగా పోరాడుతున్నప్పటికీ, అవి విదేశీ నిధుల నియంత్రణ చట్టం నియమావళి వల్ల తీవ్రంగా పరిమితమైపోతున్నాయి. ఆధునిక సంస్కృతి స్వభావరీత్యా అంతర్జాతీయంగా (తరచూ గ్లోబల్ స్థాయిలో) ముడిపడి ఉండగా, ప్రభుత్వం దీనికి విరుద్ధంగా పనిచేస్తోంది. అభివృద్ధిశీలమైన స్థానిక దాతలు లేకపోవడం, ప్రభుత్వ మద్దతు కూడా అందకపోవడంతో భారతదేశంలోని కళా కార్యక్రమాలు సరిహద్దులకు ఆవల జరిగే భాగస్వామ్య కార్యక్రమాలకు విస్తరించడం లేదు. ఎఫ్‌సిఆర్‌ఎ వంటి చట్టపరమైన వ్యవస్థల ద్వారా నిర్మితమైన నిబంధనల వ్యవస్థ స్వతంత్ర కళా, సాంస్కృతిక ప్రయత్నాల ప్రభావాన్ని పరిమితం చేస్తోంది.

ఈ పరిమితులకుపైనా, సెన్సార్ బెదిరింపుల ప్రమాదం ఎప్పుడూ ఉనికిలో ఉంటుంది. ఇవి కేవలం అధికార యంత్రాంగం నుంచే కాకుండా, అధికారంలో ఉన్నవారు ప్రవేశపెట్టిన సంకుచితమైన, పక్షపాత పథకాలతో ప్రేరేపించబడి, సంస్కృతిపై కన్నేసిన రకరకాల గ్రూపుల నుండి కూడా వస్తుంటాయి, ప్రముఖ చిత్రకారుడు ఎం.ఎఫ్. హుసేన్ పై హిందుత్వ మత వాదులు దాఖలు చేసిన కేసుల వలన, ఆయన దశాబ్దకాలం న్యాయపోరాటం చేయాల్సివచ్చింది. ఈ గ్రూపుల ఉనికి అలా వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి సినిమా దర్శకులు, రచయితలు, కార్టూనిస్టులు, స్టాండ్-అప్ హాస్యనటులు, కళాకారులపై ఈ గ్రూపులు దాడులకు దిగుతూ వస్తున్నాయి. ఇవి ప్రదర్శనలు, సినిమా ప్రదర్శనా కేంద్రాలు, కళా జాతాలు వంటి కార్యక్రమాలను అడ్డుకుంటామని బెదిరిస్తాయి. వాటిని రద్దు చేయించేవరకు వెళ్లాయి. ఇటీవలి కాలంలో, పాలస్తీనాలోని వాస్తవ పరిస్థితి లేదా మన


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

> **“ సాంస్కృతిక సమాజం తన అభివృద్ధికి, కళలకు ప్రాణవాయువుగా నిలిచే స్వతంత్ర జీవవ్యవస్థను సృష్టించుకోవాల్సిన అవసరాన్ని గురించి తెలుసుకుంటున్నదనే విషయం ఇప్పుడు స్పష్టంగా కనపడుతోంది. దీంతో ప్రభుత్వం, మార్కెట్, లేదా పెద్ద ప్రైవేట్ సంస్థలకు కళారంగం లొంగిపోవాల్సిన అవసరం లేదని అర్ధమవుతోంది. ”**

దేశంలో చోటుచేసుకుంటున్న వివాదాస్పద అంశాలపై తీసిన సినిమాలు ప్రదర్శించాలనుకున్న ఫిల్మ్ ఫెస్టివల్స్, అధికారిక, అనధికారిక ఆంక్షల మధ్య చిక్కుకుని, షోలను రద్దు చేయడం, కార్యక్రమంలో అనవసర మార్పులు చేయడం వంటి పరిణామాలను చూస్తున్నాము.

వీటన్నింటిని చూస్తే, భారతీయ సమకాలీన కళా–సాంస్కృతిక వాతావరణానికి మిగిలిందేమిటి అన్న ప్రశ్న రావచ్చు. కానీ ఆంక్షలను, బెదిరింపులను అధిగమించి సాంస్కృతిక, కళా ప్రయాణం ముందకు సాగుతూనే ఉంది. ప్రతికూలతలన్నిటికీ మధ్య ఢిల్లీ, ముంబయిలకు దూరంగా ఉన్న కోచ్చి, గోవా, ఇటీవల కోల్‌కత్తా, శాంతినికేతన్‌లలో కూడా, ఉత్సాహంగా, ఆలోచనాపూర్వకంగా, నూతనతతో కూడిన కళాకారులు తళుక్కుమంటున్నారు. దేశీయ, విదేశీయ కళాకారుల సమిష్టి నిర్వహణలో వర్క్‌షాప్‌లు, బోధనా వేదికలు, ప్రచురణ కార్యక్రమాలు, సిమ్పోజియంలు, ప్రదర్శనలతో కూడిన ఉల్లాసభరితమైన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇప్పుడు కొత్త తరం కళాకారులు, నిపుణులు వస్తున్నారు. వీరిలో చాలామంది ఎలైట్ వర్గాల నుంచి, నగర కేంద్రాల నుంచి, కళాశాలల నుంచి కాకుండా, సామాన్య నేపథ్యంలో వచ్చినవారే. వారిలో పెద్దసంఖ్యలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీ వర్గాలకు చెందిన కళాకారులు ఉన్నారు. ఈ కొత్త తరం ‘మనం చెయ్యగలం ... మనమే చేయగలం’ అని సంకల్పించుకుని ముందుకు వెడుతోంది,. వీరికి సమకాలీన సాంస్కృతిక రంగాన్ని పూర్తిగా మార్చేసే శక్తి ఉంది. ఇలాంటి కొత్త తరానికి సంస్థల ఉనికి పట్ల పెద్ద ఆసక్తి లేదు. అవసరమైనప్పుడు వాటిలో చోటు సంపాదించడానికీ, కార్యక్రమాలు నిర్వహించడానికీ వెనకాడరు. అదే సమయంలో వీరు సంస్థల నిర్లక్ష్యాన్ని, అసమర్ధతను పేర్కొంటూ, వాటిపై ఫిర్యాదులు చేస్తూ తమ సమయాన్ని వృథా చేయరు. బదులుగా, తాము సొంతంగా వేదికలను, నెట్‌వర్క్‌లను నిర్మించుకుని, వాటినే కొనసాగిస్తూ వస్తున్నారు.

గత ఐదేళ్లలో వంటగది నుండి బెడ్‌రూమ్ వరకు వివిధ పేర్లతో ఆన్‌లైన్‌లో వచ్చే కార్యక్రమాలు, టెర్రస్ ఎగ్జిబిషన్లు, అపార్ట్‌మెంట్లు కంపెనీ కార్యాలయాల మెట్లు, గేట్ల వద్ద జరిగే సదస్సులు, పార్కుల్లో, చిన్నతరహా ప్రదేశాల్లో ముందస్తు ప్రకటన లేకుండా ప్రదర్శనలు, అలాగే స్వయం ప్రతిపాదిత ప్రచురణలు, వెబ్‌మ్యాగ్‌జైన్ల వంటివి ఈ తరం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఇవన్నీ ప్రస్తుతం భారతదేశ సమకాలీన సాంస్కృతిక రంగానికి కొత్త ఊపును, రూపును ఇస్తున్నాయి.

**మళ్లీ పాత స్థితికేనా...**

సాంస్కృతిక సమాజం తన అభివృద్ధికి, కళలకు ప్రాణవాయువుగా నిలిచే స్వతంత్ర జీవవ్యవస్థను సృష్టించుకోవాల్సిన అవసరాన్ని గురించి తెలుసుకుంటున్నదనే విషయం ఇప్పుడు స్పష్టంగా కనపడుతోంది. దీంతో ప్రభుత్వం, మార్కెట్, లేదా పెద్ద ప్రైవేట్ సంస్థలకు కళారంగం లొంగిపోవాల్సిన అవసరం లేదని అర్ధమవుతోంది. ఏ సమాజంలో అయినా, కళ, సాంస్కృతిక ఆరోగ్యం అనేది కళాకారులు తమ జీవన విధానానికి, తమ సృజనాత్మకతకు తాము సొంతంగా పెట్టుకునే నిబంధనలమీద ఆధారపడి ఉంటుంది. ఆ దిశగా స్వీయచైతన్యం మెల్లగా మేల్కొంటున్న దశ ఇది. ఇది భవిష్యత్ అవకాశాలకు తలుపులు తెరుస్తోంది. ఇప్పుడు కొనసాగుతున్న ఈ నియంత్రిత, గడ్డు సాంస్కృతిక వాతావరణం శాశ్వతం కాదు. అది కూలిపోవడం తథ్యం. అలా జరగాలంటే సమకాలీన ప్రజాసాంస్కృతిక ఉద్యమాలు, చిన్నచిన్న రూపాల్లో సాగుతున్న వినూత్న ప్రయత్నాలు కలిసి కట్టుగా ఎదగాలి. విస్తరించాలి. ఐక్యంగా ప్రస్తుత వ్యవస్థను సవాల్ చేయాలి. అలా చేయగలిగితే ప్రస్తుతం ఉన్న అధికార ప్రధాన సాంస్కృతిక వ్యవస్థ ఏదో ఒకరోజు కూలిపోతుంది. గతంలో పతనమైన భారీ విగ్రహాల లాగే, ఇది కూడా నేలమట్టమవుతుంది. అలాంటప్పుడు మళ్లీ పాత అధికార సాంస్కృతిక, నిష్క్రియతో నిండిన స్థితికి మళ్లీ వెనక్కి వెళ్లాల్సిన అవసరమే లేదు. అప్పుడు కళాకారులు, రచయితలు, విమర్శకులు, ప్రేక్షకులు ఈ తరం వారు, రేపటి తరం వారు పూర్తిగా కొత్త ఆద్యంతాలతో కూడిన సృజనాత్మకా రూపాలను ఊహించుకోవచ్చు. దానికి అనుగుణంగా వారి కలలు, కోరికలు మరింత గొప్పవిగా ఉండాలి. భవిష్యత్తులో ఏదో ఒకరోజు ఎడారి పైన వర్షం పడుతుంది. లక్షల పూలు వికసిస్తాయి. పాత విగ్రహాలు, సంస్కృతి సంప్రదాయాలు నేల కూలుతాయి. సరికొత్త కళా సాంస్కృతిక వికాసం ఆ రోజు మొదలవుతుంది.

(అనువాదం: పొగడదొరువు)

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# నిరసనలతో అట్టుడుకుతున్న అమెరికా

ఎస్ వెంకట్రావు



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

అమెరికా ప్రభుత్వం, ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఒకవైపు యుద్ధాల్లో (వాణిజ్య యుద్ధాలు, ప్రత్యక్ష పరోక్ష దురాక్రమణ యుద్ధాల్లో) మునిగితేలుతుండగా మరోవైపు అమెరికా సమాజం తీవ్రమైన సామాజిక అశాంతితో అల్లకల్లోలంగా మారుతోంది. ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత ఆ దేశంలో ప్రజలు నిరసనలతో రోడ్డుకెక్కని రోజులేదు. యూనివర్శిటీ క్యాంపస్‌లు విద్యార్థుల నిరసనాగ్రహాల వేదికలుగా మారుతున్నాయి. ఫ్యాక్టరీలు, వ్యాపార సంస్థల్లో కార్మికులు రోజురోజుకూ మరింత ఎక్కువగా సమ్మెలు, పోరాటాల్లోకి వస్తున్నారు. సంప్రదాయ రాజకీయ పార్టీలు, సంస్థల పరిధి దాటి సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త కొత్త ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయి.

ఇటీవలి కాలంలో అమెరికాలో జరిగిన నిరసనల్లో ఒక అంశం మీద కాకుండా అనేక సమస్యలపై అనేక సెక్షన్ల ప్రజలు ఉద్యమాల్లోకి వస్తున్నారు. వీటిలో ప్రధానంగా 1. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు అమెరికా మద్దతు (ఇటీవల ఇరాన్‌పై అమెరికా దాడులు 2. ట్రంప్ ప్రభుత్వం నిరంకుశ విధానాలు 3. అక్రమ వలసల పేరుతో ప్రజలపై ట్రంప్ ప్రభుత్వం సాగిస్తున్న ఆగడాలు 4. ట్రంప్ వాణిజ్య యుద్ధాలు, ఇతర నిర్ణయాల వల్ల దేశంలో ఉద్యోగాల కోత, పెరుగుతున్న నిరుద్యోగం. ఈ సమస్యలపై విడివిడిగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ అవన్నీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లోని వివిధ సెక్షన్ల అసంతృప్తి నుండి పుట్టుకు వచ్చినవే. ఈ నిరసనలను అణచివేయ డానికి ప్రభుత్వం నిరంకుశ పద్ధతులకు, దౌర్జన్యకర విధానాలకు దిగుతోంది. పోలీసులు, జైళ్లు చాలక సైన్యాన్ని కూడా రంగంలోకి దించుతోంది. అయినప్పటికీ ప్రజల్లో నిరసనాగ్రహాలు పెరుగుతున్నాయేగానీ తగ్గడం లేదు.

### ట్రంప్ ప్రభుత్వ నియంతృత్వ విధానాలు

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధికారపగ్గాలు చేపట్టిన తరువాత అమెరికా పార్లమెంటును గానీ, రాష్ట్రాలనుగానీ, ప్రజాస్వామిక సంప్రదాయాలను గానీ లెక్క చేయకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆయన దృష్టిలో దేశాధ్యక్ష పదవి నిర్వహణకూ, తన స్వంత వ్యాపారాల నిర్వహణకూ తేడాలేదు. అందుకే ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనను వ్యాపారంగా మార్చేశాడు. ప్రభుత్వ సామర్థ్యం పెంపు పేరుతో అనేక ఉద్యోగాలకు ఎసరు పెట్టారు. అనేక ప్రభుత్వ శాఖలను రద్దు చేశారు. ప్రభుత్వాన్ని వ్యాపారంలా నడపడం కోసం ప్రపంచంలోనే అత్యంత కుబేరుడైన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిసియేన్సీ (డోజ్) అధిపతిగా నియమించారు. వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను కోతకోయడమే డోజ్ పని. అదే సమయంలో ట్రంప్ అధ్యక్షుడైన తరువాత అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన వ్యాపారాలను ఇబ్బిడి ముబ్బిడిగా పెంచుకుంటున్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ – మాగా (అమెరికాను తిరిగి గొప్పదేశంగా మార్చాలి) అనే నినాదంతో ఆయన అధికారంలోకి వచ్చాడు. ట్రంప్ భక్తులకు ఇప్పటికీ ట్రంప్ అంటే 'అమెరికా విజయగాథ'కు ప్రతిరూపం. అందుకని ఆయన అధ్యక్ష పదవిని ఉపయోగించుకుని తన ఆస్తులు పెంచుకున్నా, గోల్ఫ్ క్లబ్‌లు, క్రిప్టో కరెన్సీ, ట్రంప్ మీమ్‌కాయిన్ వగైరాలను ప్రమోట్ చేసుకున్నా అవన్నీ వారి దృష్టిలో అవినీతి కిందకు రావు. అదేవిధంగా ట్రంప్ 'దేశ రక్షణ' పేరుతో చేపట్టిన నిరంకుశ చర్యలు కూడా అంధ భక్తులకు ఆనటం లేదు. కానీ వాటిపై సామాన్య ప్రజల్లో మాత్రం తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అదంతా దేశ వ్యాపిత నిరసనల రూపంలో వ్యక్తమవుతోంది.

ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు పార్లమెంటుతో ప్రమేయం లేని 162 ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీచేశారు. 44 మెమోరాండాలు, 66 ప్రొక్లమేషన్లు జారీ చేశారు. ప్రభుత్వంలోని డజన్లకొద్దీ ఉన్నతాధికారులను తొలగించారు. ట్రంప్ ప్రతిపక్షాల కూడా నిరంకుశంగా అణచివేయడం ప్రారంభించారు. తన విధానాలను వ్యతిరేకించే సెనేటర్లు, పార్లమెంటు సభ్యులు, పాత్రికేయులు, న్యాయవాదులమీద దాడులు ప్రారంభిచారు. జాతీయ ఆరోగ్య సంస్థకు, అనేక యూనివర్శిటీలకు, ఇతర శాస్త్ర పరిశోధనా శాలలకూ నిధుల కోత పెట్టారు. అకాడమిక్ స్వేచ్ఛకూ, భావ ప్రకటనా స్వేచ్ఛకూ సంకెళ్లు వేస్తున్నారు. డోజ్ సిఫార్సుతో అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ ను మూసేశారు. అధికార వికేంద్రీకరణ, రాజ్యాంగ రక్షణలను అటకెక్కిస్తున్నారు. మరోవైపు ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం, అక్రమ వలసలు పేరుతో చేస్తున్న తెలివి మాలిన చేష్టలు అంతర్జాతీయంగా అమెరికా పరువు ప్రతిష్టలను దిగజారుస్తున్నాయి.

### నియంతృత్వానికి ప్రతిఘటన: 'నో కింగ్స్ దే'

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా లక్షల సంఖ్యలో ప్రజలు ప్రతిఘటనకు దిగుతున్నారు. ఈ విషయంలో 2025 జూన్ 14వ తేదీ అమెరికా చరిత్రలో ఒక గొప్ప మైలు రాయిగా మిగులుతుంది. ఆ రోజున దేశ వ్యాపితంగా లక్షలాది మంది ప్రజలు ట్రంప్ ప్రభుత్వ మితవాద విధానాలకు, నియంతృత్వ పద్ధతులకూ వ్యతిరేకంగా దేశంలోని 50 రాష్ట్రాల్లోని 2,000 పైగా ప్రదేశాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో అధ్యక్షుడు ట్రంప్ యుద్ధట్యాంకులు, సైనిక పటాలాలతో బెదిరింపులకు దిగినప్పటికీ నిరసన కారులు ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. మొత్తంగా 50

> **“ ఈ నిరసన దినానికి వాళ్లు 'నో కింగ్స్ డే' అని పేరు పెట్టారు. డొనాల్డ్ ట్రంప్ ప్రజాస్వామికంగా ఎన్నికైన అధ్యక్షుడి మాదిరిగా కాకుండా ఒక రాజులాగా, ఒక నియంతలాగా, ఒక క్రూరుడైన అధిపతిలాగా వ్యవహరిస్తున్నందున ఆయన నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనోద్యమానికి వాళ్లు 'నో కింగ్స్ డే' అని పేరు పెట్టారు. ”**

లక్షల నుండి 1 కోటి 10 లక్షల మంది వరకు ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారని విభిన్న అంచనాలు వచ్చాయి.

ఈ నిరసన దినానికి వాళ్లు 'నో కింగ్స్ డే' అని పేరు పెట్టారు. డొనాల్డ్ ట్రంప్ ప్రజాస్వామికంగా ఎన్నికైన అధ్యక్షుడి మాదిరిగా కాకుండా ఒక రాజులాగా, ఒక నియంతలాగా, ఒక క్రూరుడైన అధిపతిలాగా వ్యవహరిస్తున్నందున ఆయన నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనోద్యమానికి వాళ్లు 'నో కింగ్స్ డే' అని పేరు పెట్టారు.

ప్రదర్శనల్లో ప్రజలు స్వచ్ఛందగా పాల్గొన్నారు. వారిని కదిలించడంలో రాజకీయ పార్టీల పాత్ర పెద్దగా లేదు. అమెరికా పౌరహక్కుల సంఘం వంటి సంప్రదాయ సంస్థలు కొంతవరకు పాల్గొన్నప్పటికీ ఎక్కువగా సోషల్ మీడియా ద్వారా అనుసంధానించబడ్డారు. న్యూయార్క్ నగరం, చికాగో, లాస్ ఏంజెల్స్ ఇతర ప్రధాన మెట్రోపాలిటన్ నగరాల్లో లక్షల మంది సమీకరించబడ్డారు. అమెరికాలో కింగ్ జార్జి –3 కి వ్యతిరేకంగా విప్లవాన్ని ప్రారంభించిన బోస్టన్ నగరంలో 'నో కింగ్స్ డే' ప్రదర్శనల్లో బ్రహ్మాండమైన సంఖ్యలో దాదాపు 10 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. చిన్న చిన్న నగరాలు, పట్టణాల్లో కూడా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. విశేషమేమంటే కొద్ది మాసాల క్రింత డొనాల్డ్ ట్రంప్‌కు భారీగా ఓటు వేసిన నగరాల్లో కూడా అతని విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శనల్లో ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ఈ ప్రదర్శనల్లో పాల్గొన్న నిరసన కారులు పట్టుకున్న ప్లకార్డులు ట్రంప్ నియంతృత్వం పట్ల అమెరికన్ ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రతిబింబించాయి. ట్రంప్ సింహాసనం అధిష్టించి ఏకవ్యక్తి నియంతృత్వాన్ని స్థాపించదలుచుకున్నాడని కొన్ని రకాల ప్లకార్డులు నిరసన తెలియజేయగా మరికొన్ని అమెరికన్ విప్లవ నినాదాలను ప్రదర్శించాయి. ఈ ప్రదర్శనలు అమెరికన్ పాలక వర్గాలకు వెన్నులో ఎంతగా చలిపుట్టించాయంటే కార్పొరేట్ మీడియా ఈ వార్తలను దాదాపుగా ప్రచారం చేయకుండా అడ్డుకున్నది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో మొదటి పేజీలో నో కింగ్స్ డే ప్రదర్శన గురించి ప్రచురించింది. కానీ 24 గంటలు గడవక ముందే కనీవిని ఎరుగని రీతిలో దేశవ్యాపితంగా ప్రదర్శనలు జరిగిన తరువాత ఆ వార్తలను వెబ్ ఎడిషన్ నుండి తొలగించింది. మొత్తం అమెరికన్ కార్పొరేట్ మీడియా అంతా ఇలాగే వ్యవహరించింది.

### ట్రంప్ బలప్రదర్శన

తన నియంతృత్వానికి వ్యతిరేకంగా నిరసనలు మిన్నుముట్టుతున్నాయని తెలుసుకున్న ట్రంప్ అదే రోజున రాజధాని వాషింగ్టన్ డిసిలో సైనిక బలప్రదర్శనకు దిగారు. వందలాది యుద్ధ ట్యాంకులు, సైనిక వాహనాలు, 6,000 మందికి పైగా సైనికులతో ట్రంప్ కవాతు నిర్వహించారు. పేరుకి అమెరికా సైన్యం 250వ వార్షికోత్సవం అని చెప్పారు కానీ తన 79వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కవాతు ఏర్పాటు చేశారు. దీనికి అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున డబ్బు సమకూర్చాయి. కానీ కవాతు ఎంత చప్పగా జరిగిందంటే ట్రంప్‌కు తందానా పాడే మీడియా కూడా ఆయన చేసిన పనిని విమర్శించక తప్పలేదు. ఒకవైపు దేశ వ్యాపితంగా ట్రంప్ విధానాలను నిరసిస్తూ లక్షలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శనలు చేసిన రోజునే రాజధానిలో తన బలాన్ని, తన గొప్పదనాన్ని ప్రదర్శించుకోడానికి ట్రంప్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి 20,000 మంది మాత్రమే హాజరయ్యారు. “ఆయన తన జన్మదినాన్ని పెద్ద సైనిక కవాతుతో జరుపుకోవాలనుకున్నాడు. దాంతో ఆయన మహా శక్తిశాలిగా, అందరికీ ప్రేమపాత్రుడిగా కనబడాలనుకున్నాడు. కానీ అక్కడ పేలవమైన ప్రదర్శన జరిగింది. అదే రోజున దేశ వ్యాపితంగా జరిగిన నిరసన ప్రదర్శనల ముందు అది వెలాతెలాబోయింది. భారీగా జరిగిన ఆ ప్రదర్శనలు ఆరు మాసాల్లోనే ట్రంప్ పాలన పట్ల మొహం మొత్తిందని తెలపడమే కాదు, వాషింగ్టన్ డిసిలో జరిగిన సైనిక కవాతు పరువు తీసేశాయి” అని యుఎస్ఎ టుడే ఎడిటోరియల్ రైటర్ రెక్స్ హుప్కె రాశారు.

మరోవంక ట్రంప్‌కు మద్దతిస్తున్న పచ్చి మితవాద శక్తులు నిరసన ప్రదర్శనలపైనా, వారి మద్దతు దారులపైనా అనేక చోట్ల దాడులకు పాల్పడ్డాయి. మిన్నెసోటాలో అబార్షన్ వ్యతిరేక ఉన్మాది ఒకడు రాష్ట్రానికి చెందిన రాజకీయనాయకురాలినీ, ఆమె భర్తను హత్య చేశారు. మరో రాజకీయకుడు, అతని భార్యపై కాల్పులు జరిపాడు. వర్జీనియా రాష్ట్రంలోని కల్పెపెర్ పట్టణంలో ఒక డ్రైవర్ తన వాహనాన్ని నిరసనకారులపైకి దూసుకు పోనిచ్చాడు.

### 50501 ఉద్యమం

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన తీసుకుంటున్న చర్యలు, విధానాలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ప్రజలను కూడగట్టడం కోసం ఏర్పడిన ఉద్యమమిది. ఇది ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీ నుండి వరుసగా అనేక ప్రజా సమీకరణలకు పిలుపునిచ్చింది. జూన్ 14వ తేదీన 'నో కింగ్స్ డే' ప్రదర్శనలకు పిలుపునిచ్చింది కూడా ఇదే. 50501 ఉద్యమం అంటే 50 రాష్ట్రాలు, 50 నిరసనలు, ఒక ఉద్యమం అని అర్థం. దీనికి 50501 అని పొట్టి పేరు పెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇది ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలతో ఈ ఉద్యమం వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 17న ప్రెసిడెంట్స్ డే సందర్భంగా 'నాట్ మై ప్రెసిడెంట్స్ డే' (అధ్యక్షుని దినోత్సవం కాదు) అనే పేరుతో దేశవ్యాపిత ప్రదర్శనలు నిర్వహించింది. మార్చి 4వ తేదీన మూడవ దఫా ప్రదర్శనలు నిర్వహించింది. ఏప్రిల్ 5న “హాండ్స్ ఆఫ్” (తప్పుకో) పేరుతో దేశవ్యాపిత నిరసనలకు ఈ సంస్థ ఇచ్చిన పిలుపును అందుకుని అనేక రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా జరిగిన అతి పెద్ద నిరసన ప్రదర్శనలు అవి. తరువాత జూన్ 14న జరిగిన 'నో కింగ్స్ డే' ప్రదర్శనలు మరింత పెద్ద ఎత్తున జనసమీకరణకు వేదికలైనాయి.

వాషింగ్టన్‌లో ట్రంప్ పుట్టిన రోజు (సైన్యం 250వ దినోత్సవం) వేడుకలు జరుగుతున్నందున నిర్వాహకులు నిరసన ప్రదర్శనలకు ఆ నగరాన్ని మినహాయించారు. ఆ రోజున అమెరికా చరిత్రలోనే అతిపెద్ద నిరసన ప్రదర్శలను జరిగాయి. 50501 ఉద్యమం ట్రంప్‌తోపాటు, ఆయన అత్యంత సన్నిహిత కార్పొరేట్ మిత్రుడైన ఎలాన్ మస్క్‌ను, ఆయన నాయకత్వం వహిస్తున్న డోజ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కార్పొరేట్ లాభాల దురాపేక్షను వ్యతిరేకిస్తుంది.

**“ఇంత చేస్తున్న ఈ 50501 ఉద్యమం ప్రారంభమై నిండా ఆరుమాసాలు గడవలేదు. ఈ ఏడాది జనవరిలో రెడ్డిట్ వెబ్‌సైట్‌లో “ఇవాల్వ్‌డ్ ఫంగి” అనే పేరుతో వచ్చిన ఒక పోస్టు ఈ ఉద్యమానికి బీజం వేసింది. అందులో వ్యక్తమైన భావాలు వెనువెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ఉద్యమ రూపం తీసుకున్నాయి. ఫిబ్రవరిలో మొదటి దేశవ్యాపిత నిరసన ప్రదర్శనలతో 50501 ఉద్యమం వెలుగులోకి వచ్చింది.”**



డొనాల్డ్ ట్రంప్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కాలిఫోర్నియా కాపిటొల్ భవనాన్ని ముట్టడించిన నిరసన కారులు

వలసదారులపైనా, విదేశీయులపైనా అమెరికా ప్రభుత్వ దాడులను, దేశంలో నిరుద్యోగాన్ని, ద్రవ్యోల్బణాన్ని పెంచే విధానాలను వ్యతిరేకిస్తుంది.

ఇంత చేస్తున్న ఈ 50501 ఉద్యమం ప్రారంభమై నిండా ఆరుమాసాలు గడవలేదు. ఈ ఏడాది జనవరిలో రెడ్డిట్ వెబ్‌సైట్‌లో “ఇవాల్వ్‌డ్ ఫంగి” అనే పేరుతో వచ్చిన ఒక పోస్టు ఈ ఉద్యమానికి బీజం వేసింది. అందులో వ్యక్తమైన భావాలు వెనువెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ఉద్యమ రూపం తీసుకున్నాయి. ఫిబ్రవరిలో మొదటి దేశవ్యాపిత నిరసన ప్రదర్శనలతో 50501 ఉద్యమం వెలుగులోకి వచ్చింది. ఈ మొదటి ప్రయత్నంలో 40 రాష్ట్రాల్లోని 67 చోట్ల జరిగిన నిరసన కార్యక్రమాల్లో 72,000 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ తరువాత ఫిబ్రవరి 17న “నాట్ మై ప్రెసిడెంట్ డే” నిరసన కార్యక్రమం జరిగిన తరువాత ఈ ఉద్యమం “పొలిటికల్ రివల్యూషన్” అనే మరో ఉద్యమంతో జత కలిసింది. ఈ పొలిటికల్ రివల్యూషన్ అనే సంస్థ 2016లో అమెరికన్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఆయనకు మద్దతుగా ప్రచారం చేయడం కోసం ఏర్పడింది. తరువాత 50501 ఉద్యమంలో అనేక మంది వ్యక్తులు, సారూప్యతగల సంస్థలు చేరాయి. పొలిటికల్ రివల్యూషన్ సంస్థ నిరసన కార్యక్రమాల్లో చేరిన వెంటనే 50501 ఉద్యమం తరఫున భవిష్యత్తులో జరగబోయే నిరసన కార్యక్రమాల జాబితాను విడుదల చేసింది. “ఉయ్ (ద పీపుల్) డిసెంట్” (మేము (ప్రజల) అసమ్మతి) అనే మరో సంస్థకు చెందిన కె. స్టార్లింగ్ అనే ఆయన నాలుగు వెబ్ సైట్లలోని నిరసన కార్యక్రమాలన్నిటినీ ఒకచోట చేర్చి 2025 మార్చి 22 నుండి 28 వరకు, ఏప్రిల్ 5 న జరిగే నిరసన కార్యక్రమాల షెడ్యూల్ రూపొందించాడు.

ఏప్రిల్ 5న 'హ్యాండ్స్ ఆఫ్' నిరసన ప్రదర్శనలు రాష్ట్రాల రాజధానులు, ప్రధానమైన నగరాలు, పట్టణాలు కలిపి మొత్తం 1,200 చోట్ల జరిగాయి. ఈ రోజున అమెరికా వ్యాపితంగా 52 లక్షల మంది ప్రజలు రోడ్లమీదకు వచ్చారని అంచనా వేశారు. ఏప్రిల్ 19న మరో దేశవ్యాపిత నిరసన కార్యక్రమం ఉంటుందనీ దేశ వ్యాపితంగా 1 కోటి 10 లక్షల మంది ఇందులో పాల్గొంటారని 50501 ఉద్యమం ప్రకటించింది. అనుకున్నట్లే ఏప్రిల్ 19 వాషింగ్టన్ డిలో మహా ప్రదర్శనతోపాటు దేశ వ్యాపితంగా అనేక చోట్ల ర్యాలీలు జరిగాయి. ఈ సారి ఈ ప్రదర్శనల్లో అమెరికాలోని 'ఉమెన్స్ మార్చ్' అనే సంస్థ మద్దతు ఉద్యమానికి

> "ట్రంప్ అధికారంలోకి రాగానే విదేశీ వలస దారులపై దాడులు ముమ్మరం చేశారు. నిజానికి అక్రమ వలసదారులను గుర్తించి తమతమ దేశాలకు పంపడం ఇదే మొదటిసారి కాదు. ఆ దేశంలో ఇదో నిరంతర ప్రక్రియ. అమెరికా అధ్యక్షులుగా బరాక్ ఒబామా, జోయ్ బైడెన్ ఉన్నప్పుడు కూడా పెద్ద సంఖ్యలోనే అక్రమవలస దారులను వెనక్కి పంపేశారు. కానీ ట్రంప్ ఈ కార్యక్రమాన్ని వలసవాద విద్వేషపు కోణంలో అమలుపరుస్తున్నారు."

లభించింది. ఈ ఉమెన్స్ మార్చ్ అనే సంస్థ 2017లో అమెరికా చరిత్రలోనే కనీవిని ఎరుగని అతి పెద్ద మహిళా ర్యాలీని నిర్వహించడం ద్వారా ప్రఖ్యాతి పొందింది. అమెరికాలో 2025 మేడే కార్మిక దీక్షా దినాల నిర్వహణకు కూడా 50501 ఉద్యమం తోడ్పడింది.

**వలసదారులపై దాడులకు నిరసనగా**

ట్రంప్ అధికారంలోకి రాగానే విదేశీ వలస దారులపై దాడులు ముమ్మరం చేశారు. నిజానికి అక్రమ వలసదారులను గుర్తించి తమతమ దేశాలకు పంపడం ఇదే మొదటిసారి కాదు. ఆ దేశంలో ఇదో నిరంతర ప్రక్రియ. అమెరికా అధ్యక్షులుగా బరాక్ ఒబామా, జోయ్ బైడెన్ ఉన్నప్పుడు కూడా పెద్ద సంఖ్యలోనే అక్రమవలస దారులను వెనక్కి పంపేశారు. కానీ ట్రంప్ ఈ కార్యక్రమాన్ని వలసవాద విద్వేషపు కోణంలో అమలుపరుస్తున్నారు. సరైన పత్రాలు లేని వలసకార్మికులను వెదికి వేటాడి పట్టుకుని అత్యంత అవమానకరమై రీతిలో వెనక్కు పంపుతున్నాడు. ఈ సందర్భంగా మన భారతీయుల చేతులు కాళ్లను గొలుసులతో కట్టేసి అత్యంత అవమానకరమైన రీతిలో సైనిక విమానంలో భారత్‌కు పంపిన వైనాన్ని మనం గుర్తుకు తెచ్చుకోవాలి. దేశభక్తి గురించి నిత్యం ఇల్లెక్కి కూసే మోడీ ప్రభుత్వం, బిజెపి-ఆర్ఎస్ఎస్ ఈ అవమానాన్ని ఖండిచకపోవడం, కనీసం మెక్సికో మాదిరిగా మన విమానాలు పంపి గౌరవంగా వారిని స్వదేశానికి తీసుకు రావడం కూడా చేయకపోవడం పట్ల అన్ని వర్గాలనుండి తీవ్రమైన విమర్శలు వచ్చాయి.

వలసదారులను పట్టుకుని వారి దేశాలకు పంపే విషయంలో ట్రంప్ ప్రభుత్వం కనీస పద్ధతులను కూడా పాటించకపోవడం, వలస చట్టాలను మరింత కఠినతరం చేయడం, వలస దారుల ఆత్మగౌరవాన్ని భంగపరచడం, విద్యార్థి వీసాలు, దీర్ఘకాలిక వీసాలను రద్దు చేయడం వంటివి వలసదారుల నుండే కాకుండా అమెరికన్ ప్రజల నుండి కూడా నిరసనలకు దారితీస్తున్నాయి.

వలసదారుల అరెస్టులకు నిరసనగా దేశ వ్యాపితంగా ముఖ్యంగా డెమోక్రాట్లు అధికారంలో ఉన్న కాలిఫోర్నియా, న్యూయార్క్ వంటి రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. జూన్ ప్రారంభంలో లాస్ ఏంజెల్స్, చికాగో, న్యూ యార్క్ రాష్ట్రాల్లో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) సిబ్బంది పెద్ద ఎత్తున వలసదారులను అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు పెద్ద ఎత్తున ప్రతిఘటన ఎదురైంది. 'ఐసిఇ సిబ్బంది రోజుకు కనీసం 3000 మంది వలస దారులు చొప్పున అరెస్టు చేస్తారు" అని అమెరికా అధ్యక్ష భవన డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫన్ మిల్లర్ ప్రకటించారు. ఇది ప్రస్తుతం జరుగుతున్న అరెస్టులకన్నా మూడు రెట్లు ఎక్కువ.

**'డే వితవుట్ ఇమ్మిగ్రంట్స్'**

వలసదారులపై దాడులకు వ్యతిరేకంగా "డే వితవుట్ ఇమ్మిగ్రంట్స్" అనే పేరుతో నిరసనోద్యమం ప్రారంభమైంది. ఇందులో భగంగా 2025 ఫిబ్రవరి 3వ తేదీన అమెరికాలోని అనేక నగరాలు, పట్టణాల్లో వ్యాపారాలను మూసేశారు. కొలరాడో రాష్ట్రంలోని ఆరోరా, డెన్వర్ నగరాల్లో నిరసన ప్రదర్శనలు జరగ్గా ఉటా నగరంలో వ్యాపారాలు బంద్ చేశారు. టెన్నెసె రాష్ట్రం నాష్‌విల్లెలో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. ఒరెగాన్‌లోని గ్రెషమ్, పోర్ట్‌లాండ్, టెక్సాస్‌లోని డాలస్, హూస్టన్, శాన్ ఆంటో నియో, ఆస్టిన్ నగరాల్లోనూ వాటితోపాటు చికాగో, మిన్నెపోలిస్, సియాటెల్, వాషింగ్టన్ మెట్రోపాలిటన్ ఏరియాల్లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరగడంతోపాటు పలుచోట్ల వ్యాపార సంస్థలను మూసేశారు.

డొనాల్డ్ ట్రంప్ వలసవ్యతిరేక విధానాలకు నిరసన తెలుపుతూ లాస్ ఏంజెల్స్ నగరంలో వేలాది మందితో శాంతియుతంగా ప్రదర్శన జరుపుతున్న వారిని అరెస్టు చేయడానికి జూన్ 6న ఐసిఇ ఏజెంట్లు, లాస్ ఏజెంల్స్ పోలీసులు ప్రయత్నించడంతో వారికీ నిరసన కారులకూ మధ్య నగరంలోని పలు ప్రదేశాల్లో ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు అనేక రోజుల పాటు జరిగాయి. జూన్ 7న అధ్యక్షుడు ట్రంప్ నిరసనలను అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా 2,000 మంది నేషనల్ గార్డులను మోహరించారు. అయినా నిరసనలు తగ్గకపోగా మరింతగా పెరిగాయి. కొత్తకొత్త గ్రూపులు నిరసన ప్రదర్శనల్లో చేరాయి. దాంతో ట్రంప్ ప్రభుత్వం మరో 2,000 మంది నేషనల్ గార్డులతోపాటు, 700 మంది మెరైన్‌లను అణచివేత కోసం నగరంలో దింపింది. ఫెడరల్ ప్రభుత్వ బలగాలను రంగంలోకి దించడం నిరంకుశ చర్య అనీ, రాజకీయ లబ్ధికోసమే ట్రంప్ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని రాజకీయ నాయకులు, ముఖ్యంగా లాస్ ఏంజెల్స్ గవర్నర్ గావిన్ న్యూసమ్ విమర్శించారు. ఈ ఘర్షణల్లో అనేక మంది గాయపడ్డారు. పోలీసులు వందలాది మందిని అరెస్టు చేసి నిర్బంధంలో పెట్టారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత అయనకు దేశంలోపల తగిలిన అతిపెద్ద ఎదురుదెబ్బ ఇది అని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ అరెస్టులు దేశంలో అనేక అంశాలపై, అంటే వలసలు, నిరసనలు, దేశీయ వ్యవహారాల్లో ఫెడరల్ బలగాలను ఉపయోగించడం, అధ్యక్షుని అధికార పరిధులు, భావ ప్రకటనా స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ మొదలైన అనేక అంశాలపై దేశవ్యాపితంగా చర్చకు తావిచ్చాయి. ఐసిఇ ఏజెంట్లు మొఖానికి ముసుగులు ధరించి దాడులకు పాల్పడ్డం బాధ్యతా రాహిత్యమనీ, ప్రజలను వేధించే ఎత్తుగడలనీ విమర్శలు వచ్చాయి. అక్కడక్కడా హింసాత్మక ఘటనలు జరిగినప్పటికీ మొత్తం మీద శాంతియుతంగా జరిగిన నిరసనలపై నేషనల్ గార్డులు విరుచుకు పడ్డం, అది కూడా రాష్ట్ర గవర్నర్ అనుమతి లేకుండా చర్యలకు ఉపక్రమించడం 1965 తరువాత ఇదే ప్రథమం. ఆ విధంగా ట్రంప్ నియంతృత్వ పోకడలను లాస్ ఏంజెల్స్ ఘటనలు ప్రపంచానికి వెల్లడించాయి. లాస్ ఏంజెల్స్ ఘటనలపై ట్రంప్ అనుయాయులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దుష్ప్రచారానికి దిగారు. విదేశీయులు దురాక్రమణకు వచ్చినట్లూ,

ట్రంప్ సైన్యం (నేషనల్ గార్డులు) వారిని తిప్పికొట్టినట్లు తప్పుడు చిత్రాలు, వీడియోలతో ప్రచారం చేశారు. శాంతియుతంగా జరిగిన ప్రదర్శనలను అసలు చూపించకుండా వారం రోజుల పాటు నగరం మొత్తం అల్లర్లు, లూటీలు, దోపిడీల బారిన పడినట్లు ప్రచారం చేశారు. అలీన్స్ (విదేశీయుల) నుండి అమెరికాను రక్షించిన మొనగాడిగా మితవాద శక్తులు ట్రంప్‌ను పొగడ్తల్లో ముంచెత్తాయి.

> **"2023 అక్టోబర్ 7న హమాస్ దాడితో గాజాలో ప్రారంభమైన ఇజ్రాయిల్ నరమేధానికి వ్యతిరేకంగా అమెరికాలో నిరంతరం ర్యాలీలు, క్యాంపెయిన్లు, ధర్నాలు జరుగుతూనే ఉన్నాయి. యూనివర్శిటీ క్యాంపస్‌లలో గాజా వ్యతిరేక ఆందోళ నలను అణచివేయ డానికి ప్రభుత్వం నిరంకుశ పద్ధతులను ఉపయో గిస్తోంది. ఇరాన్‌పై తొలుత ఇజ్రాయిల్, తరువాత అమెరికా ప్రత్యక్ష దాడులతో పశ్చిమాసియాలో తీవ్రమైన యుద్ధ పరిస్థితులు నెలకొన డంతో ఈ యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు మరింత ఉద్ధృతి నందుకున్నాయి."**



పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ మారణ కాండకు నిరసనగా జరుపుతున్న ప్రదర్శనను అడ్డుకుంటున్న పోలీసులు

### గాజా, ఇరాన్ యుద్ధాలకు వ్యతిరేకంగా నిరసనలు

2023 అక్టోబర్ 7న హమాస్ దాడితో గాజాలో ప్రారంభమైన ఇజ్రాయిల్ నరమేధానికి వ్యతిరేకంగా అమెరికాలో నిరంతరం ర్యాలీలు, ప్రదర్శనలు, క్యాంపెయిన్లు, ధర్నాలు జరుగుతూనే ఉన్నాయి. యూనివర్శిటీ క్యాంపస్‌లలో గాజా వ్యతిరేక ఆందోళనలను అణచివేయడానికి ప్రభుత్వం నిరంకుశ పద్ధతులను ఉపయోగిస్తోంది. ఇరాన్‌పై తొలుత ఇజ్రాయిల్, తరువాత అమెరికా ప్రత్యక్ష దాడులకు దారితీయం, పశ్చిమాసియాలో తీవ్రమైన యుద్ధ పరిస్థితులు నెలకొనడంతో ఈ యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు మరింత ఉద్ధృతి నందుకున్నాయి.

యుద్ధం తొలి పది రోజులు ఇజ్రాయిల్‌కు అనుకూలంగా అమెరికా వ్యాపితంగా ప్రదర్శనలు జరిగాయి. హమాస్ ఇజ్రాయిల్ పౌరులపై దాడిచేసి అనేక మందిని చంపివేయం, పలువురిని బంధీలుగా పట్టుకోవడంతో సహజంగానే ఇజ్రాయిల్‌కు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి. కానీ తరువాత పాలస్తీనాపై ముఖ్యంగా గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులు చేస్తూ అక్కడి అమాయక పిల్లలు, స్త్రీపురుషులను వేల సంఖ్యలో వధించడం ప్రారంభించాక ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా అమెరికా అంతటా యుద్ధ వ్యతిరేక, శాంతి ప్రదర్శనలు ప్రారంభమై ఊపందుకున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలు, నగరాల్లో వేలు, లక్షల సంఖ్యలో ప్రజలు రోడ్లమీదకు వచ్చి ఇజ్రాయిల్ మారణకాండకు వ్యతిరేకంగా, దానికి అమెరికా మద్దతివ్వడాన్ని నిరసిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. విశేషమేమంటే రానురాను ఈ ప్రదర్శనల్లో యూదులు, అమెరికా ప్రభుత్వం లోని అధికారులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రారంభించారు. 2024 డిసెంబర్ నాటికి దేశ వ్యాపితంగా 2,600 కార్యక్రమాలు జరిగితే అందులో ఇజ్రాయిల్‌కు మద్దతుగా 442, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనాకు మద్దతుగా సుమారు 2,100 కార్యక్రమాలు జరిగాయి. 2024 ఏప్రిల్ నాటికి అమెరికా లోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనాకు మద్దతుగా విద్యార్థులు ప్రదర్శనల్లోకి రావడం ప్రారంభించారు. అది ఇప్పటికీ కొనసాగుతోంది. పాలస్తీనాపై మారణ కాండను నిరసిస్తూ నలుగురు వ్యక్తులు ఆత్మాహుతి చేసుకున్నారు. దేశంలోని విశ్వవిద్యాలయాలన్నీ ఇజ్రాయిల్ దురాక్రమణ వ్యతిరేక ఆందోళనా కేంద్రాలుగా మారిపో యాయి. పురోగామి శక్తులకు నిలయమైన హార్వర్డ్ యూనివర్శిటీ దీనిలో ముందు పీఠిన నిలబడింది. లాస్ ఏంజెల్స్, చికాగో, ట్రోయ్, మిచిగన్, సెయింట్ లూయిస్, మిస్సోరీ, ఎస్టెరో, ఫ్లోరిడా ఇంకా ఇతర అనేక నగరాల్లో వేలాది మందితో ప్రదర్శనలు జరిగాయి. పాలస్తీనాలో కాల్పుల విరమణ జరగాలనీ, ఇజ్రాయిల్ దురాగతాలకు అమెరికా సహాయం ఆపేయాలన్న నినాదాలు అమెరికా అంతటా మిన్ను ముట్టాయి.

డిసెంబర్ 27న నిరసన కారులు విమానాశ్రయాలను దిగ్బంధనం గావించారు. ఇందులో న్యూ యార్క్‌లోని ప్రఖ్యాతి గాంచిన జాన్ ఎఫ్ కెనడీ విమానాశ్రయం, లాస్ ఏంజెల్స్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు కూడా ఉన్నాయి. ఇజ్రాయిల్‌కు అన్ని విధాలా మద్దతుగా నిలబడిన జోయ్ బైడెన్‌ను 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఓడించాలని నిరసనకారులు పిలుపునిచ్చారు. 2024 మార్చి 31నాడు అమెరికా వైమానిక దళానికి చెందిన లారీ హెబర్ట్ అనే వెటరన్ గాజాలో పసిపిల్లలను ఆకలిమంటలకు గురిచేసి చంపుతున్న ఇజ్రాయిల్ దురాగతాలకు వ్యతిరేకంగాఆమరణ దీక్షకు దిగాడు.

కొలంబియా యూనివర్శిటీలో విద్యార్థులు యుద్ధాన్ని వ్యరేకిస్తూ, గాజాకు సౌహార్ద్రత తెలుపుతూ యూనివర్శిటీ క్యాంపస్‌ను ఆక్రమించారు. 2024 ఏప్రిల్ 18న వారిపై పోలీసులు విరుచుకుపడి పలువురిని అరెస్టు

**"కొలంబియా యూనివర్శిటీతో ప్రారంభ మైన విద్యార్థుల యుద్ధ వ్యతిరేక ఆందోళనలు గత ఏడాది ఏప్రిల్ నాటికి అమెరికా అంతటికీ, చివరికి విదేశీ క్యాంపస్‌లకు కూడా పాకింది. ఈ సందర్భంగా మిట్‌లో ఈ ఏడాది మే 29 నాడు అమెరికన్ తెలుగు విద్యార్థిని మేఘా వేమూరి గాజా నరమే ధానికి వ్యతిరేకంగా చేసిన ప్రసంగం ప్రపంచ వ్యాపితంగా వైరల్ అయింది."**



ఇజ్రాయిల్ దురాగతాలకు వ్యతిరేకంగా మిట్ క్యాంపస్‌లో మాట్లాడుతున్న మేఘా వేమూరి

చేశారు. దాంతో యుద్ధవ్యతిరేక ఆందోళనలు అమెరికాలోని అన్ని క్యాంపస్‌లకు ప్రాకాయి. ప్రతిష్ఠాత్మక మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్), సెంట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్శిటీ, యూనివర్శిటీ ఆఫ్ మేరీలాండ్, టఫ్ట్స్ యూనివర్శిటీ వంటి అనేక యూనివర్శిటీల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున యుద్ధ వ్యతిరేక ఆందోళనలకు దిగారు. అధ్యక్ష ఎన్నికల్లో జోయ్ బైడెన్ ఎక్కడ ప్రసంగిస్తే అక్కడ విద్యార్థులు, యుద్ధ వ్యతిరేక కార్యకర్తలు ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవడం మొదలు పెట్టారు.

### మేఘా వేమూరి

కొలంబియా యూనివర్శిటీతో ప్రారంభ మైన విద్యార్థుల యుద్ధ వ్యతిరేక ఆందోళనలు గత ఏడాది ఏప్రిల్ నాటికి అమెరికా అంతటికీ, చివరికి విదేశీ క్యాంపస్‌లకు కూడా పాకింది. ఈ సందర్భంగా మిట్‌లో ఈ ఏడాది మే 29 నాడు అమెరికన్ తెలుగు విద్యార్థిని మేఘా వేమూరి గాజా నరమేధానికి వ్యతిరేకంగా చేసిన ప్రసంగం ప్రపంచ వ్యాపితంగా వైరల్ అయింది. 2025 క్లాస్ ప్రెసిడెంట్‌గా ఉన్న మేఘా ఆ రోజు ఒక కార్యక్రమంలో 'కెఫియే' ధరించి వచ్చింది. మధ్య ప్రాచ్యంలో తలకు చుట్టుకునే గుడ్డను కెఫియే అంటారు. నలుపు తెలుపు రంగు చెక్స్‌తో ఉండే గుడ్డను పాలస్తీనా విముక్తి పోరాటానికి చిహ్నంగా ధరిస్తుంటారు. అటువంటి కెఫియే ధరించిన మేఘ తన ప్రసంగంలో గాజాలో నరమేధం సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మిట్ సంస్థ సహకారం అందించడాన్ని ఖండించారు. ఈ ప్రసంగం చేసినందుకు గాను ఈ ఏడాది గ్రాడ్యుయేషన్ ఉత్సవంలో మేఘా పాల్గొనకుండా యూని వర్శిటీ అధికారులు నిషేధం విధించారు.

### ఇరాన్‌పై దాడికి నిరసనగా

గత జూన్ 13న ఇజ్రాయిల్ ఆకస్మికంగా ఇరాన్‌పై దాడి చేసి అనేక మంది శాస్త్రవేత్తలనూ, సైనిక జనరల్స్‌నూ వధించడంతో ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధం మధ్య ప్రాచ్యంలో మరింత విస్తరించింది. దీనికి తోడు జూన్ 22న అమెరికా డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌పై దాడులకు తెగబడ్డంతో ఇరాన్ ఈ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతి దాడికి పాల్పడింది. దాంతో యుద్ధం ప్రమాదకర స్థాయి చేరుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి జరిపిన రోజున అమెరికాలోని అన్ని నగరాల్లోనూ ఆ దాడికి నిరసనగా వేలాది మందితో ప్రదర్శనలు జరిగాయి. అమెరికా యుద్ధంలోకి దిగడంతో ఈ ప్రదర్శనలు మరిన్ని నగరాలకు విస్తరించాయి. ప్రస్తుతం ఇరాన్- ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ గాజాలోని పాలస్తీనియన్లమీద మాత్రం ఇజ్రాయిల్ నరమేధం కొనసాగు తోం ది. దీనికి వ్యతిరేకంగా అమెరికాలో నిరసన కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.

అమెరికన్ ప్రజలు ఇటీవలి కాలంలో వివిధ కారణాలతో నిరసన ప్రదర్శనల్లోకి వస్తున్నప్పటికీ వీటి వెనుక దండలో దారంలా ఒక సమస్య ఉంది. అదే అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం. 2008 ద్రవ్య సంక్షోభం తరువాత అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకున్నదే లేదు. అమెరికా కార్పొరేట్‌లు గరిష్ట లాభాలకోసం ఉత్పత్తిని సరిహద్దులు దాటించి విదేశాలకు తరలించారు. దాంతో అమెరికాలో నిరుద్యోగం పెరిగింది. ఆర్థిక అసమానతలు తీవ్రమైనాయి. ద్రవ్యోల్బ ణం పెరగడం, సామాన్యుల జీవన ప్రమాణాలు తగ్గడంతో ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ అసంతృప్తిని ఉపయోగించుకుని "మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్"- "మాగా" (అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మార్చాలి) నినాదంతో ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చారు. అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుండి ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలను అసంతృప్తికి, అశాంతికి గురిచేస్తున్నాయి. ఈ అసంతృప్తిని అణచివేయ డానికి ఆయన అనుసరిస్తున్న నిరంకుశ వైఖరికి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నది. అమెరికాలో నేడు నిత్యం జరుగుతున్న నిరసన కార్యక్రమాలు ఈ అసంతృప్తికీ, ప్రతిఘటనకూ ప్రతిరూపాలే.

# ఘర్షణల కాలం -2

## (క్రీ.శ. 1000-1200)



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

### ఉత్తర భారత ఉపఖండం - తురుష్కుల ఆధిపత్యం

గజనీవాదులు పంజాబ్‌ను జయించిన అనంతరం ముస్లింలకు, హిందువులకు నడుమ సంబంధాలలో రెండు రకాలుగా మార్పులు చోటు చేసుకున్నాయి. గజనీ మహమ్మద్ అనంతరం అతడి వారసులు తరచూ గంగా మైదాన ప్రాంతం మీద, (ప్రస్తుత రాజస్తాన్ ప్రాంతం) మీద దాడులు సాగిస్తూ అక్కడి సంపదలను కొల్లగొట్టుకుని పోయేవారు. ఈ దాడులను రాజపుత్ర రాజ్యాల పాలకులు ప్రతిఘటించేవారు. ఆ క్రమంలో రాజపుత్ర పాలకులు క్రమంగా పైచేయి సాధిస్తూ వచ్చారు. గజనీ సామ్రాజ్యం క్రమంగా బలహీనపడుతూ రావడంతో రాజపుత్ర రాజ్యాల పాలకులలో క్రమంగా ఉదాసీనత చోటు చేసుకోసాగింది. ఇక రెండో మార్పు ముస్లిం వర్తకులను మన భూభాగాల్లో వ్యాపారం నిమిత్తం అనుమతించడం. దీని ఫలితంగా మధ్య, పశ్చిమ ఆసియా ప్రాంతాలతో మన వ్యాపారం పెరిగి, దాని ఫలితంగా ప్రభుత్వాలకు ఆదాయాలు కూడా పెరుగుతూవచ్చాయి. ఈ క్రమంలో ఉత్తర భారతంలోని పలు పట్టణాలలో ముస్లిం వర్తకుల కాలనీలు కూడా ఏర్పడ్డాయి. వాటితోపాటు సూఫీలు అని పిలిచే ఆధ్యాత్మిక ప్రచారకులు అనేకమంది వచ్చారు. ఉన్నది ఒకే దైవం అన్న భావనను వీళ్ళు ప్రధానంగా ప్రచారం చేసేవారు. వాళ్ళు ముఖ్యంగా ఇక్కడ స్థిరపడిన ముస్లిం ప్రజానీకం మధ్య తమ ప్రచారాన్ని ప్రారంభించారు. ఐతే క్రమంగా హిందువులను కూడా ప్రభావితం చేయగలిగారు. ఆ విధంగా ఇస్లాం, హిందూ మతాల నడుమ పరస్పర సంబంధాలు పెరుగుతూ వచ్చాయి. లాహోర్ పట్టణం ఒక సాహితీ కేంద్రంగా పెంపొందింది. అరబిక్. పర్షియన్ భాషా సాహిత్యాలకు అది కేంద్రంగా రూపొందింది.

గజనీ సామ్రాజ్య సైన్యం లోకి హిందూ సైనికులను నియమించడమే గాక, తిలక్ అనే యోధుడు సేనాధిపతిగా కూడా వ్యవహరించాడు.

ఈ రెండు రకాల మార్పులూ కొనసాగడుతూండగానే మధ్య ఆసియా ప్రాంతంలో తురుష్కులలోని ఒక తెగకు చెందినవారు ఆఫ్ఘనిస్తాన్‌కు వాయవ్యంగా ఉన్న ప్రాంతంలో ఘురిద్ రాజ్యాన్ని స్థాపించారు. ఘురిద్‌లు అంతవరకూ గజనీ సామ్రాజ్యానికి సామంతులుగా ఉండేవారు. అది బలహీన పడుతున్న దశలో ఘురిద్‌లు తిరుగుబాటు ప్రకటించి తమ స్వంత సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారు. సుల్తాన్ అల్లావుద్దీన్ కాలంలో ఘురిద్‌ల ప్రాబల్యం పెరిగింది. ఐతే అక్కడినుంచి ఘురిద్‌లు మధ్య ఆసియా దిశగా విస్తరించడానికి పెద్ద ఆటంకంగా ఖ్వారిజ్‌మీ సామ్రాజ్యం ఉంది. దానిని ఎదిరించగల శక్తి ఘురిద్‌లకు లేదు. దాంతో వాళ్ళు అనివార్యంగా భారత ఉపఖండం వైపు విస్తరించడానికి సన్నద్ధం అయ్యారు.

### 1173 నుండి 1206 వరకూ గజనీ రాజ్యాన్ని పాలించిన ముయిజ్జుద్దీన్ మహమ్మద్

(ఇతడిని మహమ్మద్ గోరీ అని కూడా చరిత్రకారులు ప్రస్తావిస్తారు) ఇతను ముల్తాన్ ప్రాంతాన్ని జయించాడు. (ఇది సింధునదీ తీరంలో ఉన్న ఒక పట్టణం. ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉంది) అక్కడినుండి గోమల్ కనుమ గుండా గుజరాత్ ప్రాంతాన్ని ఆక్రమించడానికి పూనుకున్నాడు. కానీ మౌంట్ అబు (అబు పర్వతం) దగ్గర గుజరాత్ ప్రాంత పాలకుల చేతుల్లో చావుదెబ్బతిని ప్రాణాలు దక్కించుకుని పారిపోయాడు. ఐతే భారత ఉపఖండాన్ని ఆక్రమించుకోవాలన్న కాంక్ష మాత్రం అలానే ఉండిపోయింది. అందులో జయప్రదం కావాలంటే ముందు పంజాబ్ ప్రాంతం మీద పట్టు సాధించడం అవసరం అని గ్రహించిన ముయిజ్జుద్దీన్ మహమ్మద్ 1190 నాటికి పెషావర్, లాహోర్, సియాల్‌కోట్ ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. అక్కడినుండి డిల్లీ, గంగా డెల్టా ప్రాంతాలవైపు విస్తరించాలన్నది అతడి ఆలోచనగా ఉంది.

ఐతే ముయిజ్జుద్దీన్ మహమ్మద్ ముల్తాన్‌ను ఆక్రమించుకున్న సమయంలోనే అజ్మీర్‌లో 14 ఏళ్ళ పృధ్వీరాజ్ అనే చౌహాన్ తెగకు చెందిన రాజపుత్ర యువకుడు సింహాసనాన్ని ఎక్కాడు. మొదట రాజస్తాన్‌లోని తక్కిన చిన్న చిన్న సంస్థానాలన్నింటినీ ఓడించి తన ఆధీనం లోకి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత గుజరాత్ దిశగా విస్తరించాలని ప్రయత్నించాడు. కానీ అప్పటికే ముయిజ్జుద్దీన్ మహమ్మద్‌ను తరిమికొట్టిన గుజరాత్ పాలకుడు ( రెండవ భీముడు అని ఇతడి పేరు) పృధ్వీరాజ్‌ను కూడా ఓడించి వెనక్కి పంపాడు. దాంతో పృధ్వీరాజ్ తన విస్తరణ కాంక్ష నెరవేరాలంటే పంజాబ్ వైపు, గంగా డెల్టా ప్రాంతం వైపు మళ్ళాలని గ్రహించాడు. ముందు డిల్లీ ప్రాంతాన్ని పాలిస్తున్న తోమార్‌లను ఓడించి డిల్లీని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు.

### చరిత్రాత్మక తరైన్ యుద్ధం

అటు పశ్చిమ-వాయవ్యం వైపు నుండి ముయిజ్జుద్దీన్ మహమ్మద్, ఇటు రాజస్తాన్ వైపు నుండి పృధ్వీరాజ్ చౌహాన్ కీలక పంజాబ్ ప్రాంతం మీద ఆధిపత్యం కోసం తలపడ్డారు. 1191లో తరైన్ వద్ద ఈ రెండు సేనల నడుమ గట్టి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ముయిజ్జుద్దీన్ మహమ్మద్ చిత్తుగా ఓడిపోయాడు.

> **“ 1192 నుంచి 1206 మధ్య కాలంలో గంగా-యమున డెల్టాప్రాంతం, దాని పరిసరాలు, బెంగాల్, బీహార్ కూడా తురుష్కుల ఆధీనంలోకి వచ్చేశాయి. ఈ ప్రాంతం మీద ఆధిపత్యం కోసం ముందు కనూజ్‌ను పాలిస్తున్న గహడ్‌వాలా రాజ్య పాలకుడు జయచంద్రుడిని ఓడించడం ప్రధానం అయింది. రెండు దశాబ్దాలుగా ఆ ప్రాంతాన్ని శాంతియుతంగా పాలిస్తున్న ఒక పాలకుడుగా జయచంద్రుడు ఉన్నాడు. ”**

ప్రాణాలు దక్కించుకుని పారిపోయాడు. ఆ యుద్ధంలో గెలిచిన పృధ్వీరాజ్ అక్కడినుండి పశ్చిమ దిశగా ముందుకు సాగి భటిండాను ఆక్రమించు కున్నాడు. ఐతే పంజాబ్ ప్రాంతంలో ఘురిద్‌ల ఉనికి లేకుండా చేయాలనే దిశగా పృధ్వీరాజ్ ప్రయత్నించలేదు. వాళ్ళు అప్పుడప్పుడూ వచ్చిపడి కొల్లగొట్టే దోపిడిదారులుగానే వ్యవహరిస్తారని పృధ్వీరాజ్ భావించాడు. ఇది ముయిజ్జుద్దీన్ మహమ్మద్‌కు కూడదీసుకోడానికి కావలసిన అవకాశాన్ని ఇచ్చింది. తరైన్ వద్ద 1192లో ముయిజ్జుద్దీన్ మహమ్మద్ సేనలకు, పృధ్వీరాజ్ చౌహాన్ సేనలకు మధ్య జరిగిన భీకర యుద్ధం భారతదేశ చరిత్రలో ఒక ముఖ్య మలుపుగా చెప్పవచ్చు. ముయిజ్జుద్దీన్ మహమ్మద్ 1,20,000 మంది సైన్యంతో సన్నద్ధం అయ్యాడు. అందులో ఉక్కు కవచాలు ధరించిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 10,000 మంది అశ్వారోధకులు అయిన విలుకాళ్ళు ఉన్నారు. పంజాబ్ వైపు విస్తరించే ఆలోచన మానుకోమని, రెండు రాజ్యాలూ పరస్పర సహకారంతో మైత్రీసంబంధాలు నెలకొల్పుకోవాలని పృధ్వీరాజ్ ముయిజ్జుద్దీన్ మహమ్మద్‌కు వర్తమానం పంపాడు. కానీ ముయిజ్జుద్దీన్ దానిని తిరస్కరించాడు. దాంతో పృధ్వీరాజ్ కూడా యుద్ధానికి సమాయత్తం అయ్యాడు. 3 లక్షల సైన్యాన్ని, 300 ఏనుగులను, అశ్వికులను దింపాడు. యావత్తు ఉత్తర భారత దేశంలోనూ ఉన్న రాజులందరికీ వర్తమానం పంపి వారందరూ కలిసిరావాలని కోరాడు. కనూజ్ పాలకుడుగా ఉన్న జయచంద్రుడు తప్ప అందరూ కలిసివచ్చారు.

తర్వాత చాలా కాలానికి చాంద్ బర్దాయ్ అనే కవి ఒక ప్రేమకథ రచించి అందులో పృధ్వీరాజ్‌కు, కనూజ్ రాజకుమారి, జయచంద్రుడి కుమార్తె అయిన సంయుక్తకు నడుమ ప్రేమ ఏర్పడినట్టు, వారి ప్రేమను జయచంద్రుడు నిరాకరించడంతో పృధ్వీరాజ్ సంయుక్తను ఎత్తుకుపోయి వివాహం ఆడినట్టు, ఆ కోపంతోటే జయచంద్రుడు యుద్ధంలో పృధ్వీరాజ్‌కు తోడుగా నిలవడానికి నిరాకరించినట్టు వర్ణించాడు. ఇది చాలా ప్రసిద్ధి చెందిన గాథ. ఐతే చరిత్రకారులు మాత్రం ఇది వొట్టి కల్పన గానే పరిగణిస్తున్నారు. కనూజ్‌కు, ఆజ్మీర్‌కు నడుమ దీర్ఘకాల వైరం ఉండిన కారణంగానే జయచంద్రుడు యుద్ధంలో పాల్గొనలేదన్నది అసలు విషయం.

యుద్ధంలో పాల్గొన్న సైన్యాల సంఖ్యను కొంత అతిగానే ప్రచారం చేశారు. ఐనప్పటికీ, భారీ మోహరింపు ఇరువైపులా జరిగిందన్నది వాస్తవం. ఈ రెండో దఫా యుద్ధంలో ముందస్తుగా పక్కా సన్నాహాలతో తలపడిన ముయిజ్జుద్దీన్ మహమ్మద్ సేనలదే పైచేయి అయింది. తురుష్కుల అశ్విక దళాల వేగవంతమైన కదలికలు కీలకం అయ్యాయి. పృధ్వీరాజ్ సేనలలో చాలామంది మరణించారు. పృధ్వీరాజ్ తప్పించుకున్నా, తర్వాత పట్టుబడ్డాడు. ఆ తర్వాత కొంత కాలం వరకూ పృధ్వీరాజ్‌ను ఆజ్మీర్ వరకు పాలించుకోడానికి ముయిజ్జుద్దీన్ మహమ్మద్ అనుమతించాడు. కాని కొద్దికాలానికే కుట్రలకు పూనుకుంటున్నాడనే ఆరోపణతో పృధ్వీరాజ్‌ను అంతం చేశారు. అతడి కుమారుడు ఆజ్మీర్ పాలకుడయ్యాడు. డిల్లీని కూడా తోమార్‌లకు మళ్ళీ కట్టబెట్టారు.

ఐతే, కొద్దికాలానికే, గంగా డెల్టా ప్రాంతంలోకి విస్తరించడానికి డిల్లీ కీలకం అని గ్రహించిన ముయిజ్జుద్దీన్ మహమ్మద్ డిల్లీని, దానితోబాటు ఆజ్మీర్‌ని కూడా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. పృధ్వీరాజ్ కుమారుడు ఆజ్మీర్ నుండి రణతంభోర్‌కు మారి అక్కడ కాలక్రమంలో బలమైన చౌహాన్ రాజ్యాన్ని నిర్మించాడు.

ఆ విధంగా చరిత్రాత్మక తరైన్ ప్రాంతంలో రెండు సార్లు జరిగిన యుద్ధం అంతిమంగా డిల్లీ, రాజస్తాన్ ప్రాంతాల మీద తురుష్కుల ఆధిపత్యం నెలకొనడానికి దారి తీసింది.

### గంగా మైదానం, బీహార్ బెంగాల్ ప్రాంతాలపై ఆధిత్యం

1192 నుంచి 1206 మధ్య కాలంలో గంగా-యమున డెల్టా ప్రాంతం, దాని పరిసరాలు, బెంగాల్, బీహార్ కూడా తురుష్కుల ఆధీనంలోకి వచ్చేశాయి. ఈ ప్రాంతం మీద ఆధిపత్యం కోసం ముందు కనూజ్‌ను పాలిస్తున్న గహడ్‌వాలా రాజ్య పాలకుడు జయచంద్రుడిని ఓడించడం ప్రధానం అయింది. రెండు దశాబ్దాలుగా ఆ ప్రాంతాన్ని శాంతియుతంగా పాలిస్తున్న ఒక పాలకుడుగా జయచంద్రుడు ఉన్నాడు. తరైన్ యుద్ధాల అనంతరం భారత ఉపఖండంలోని పాలనా బాధ్యతలను తన నమ్మకస్తుడైన బానిస కుతుబుద్దీన్ ఐబక్‌కు అప్పజెప్పి తన రాజధాని గజనీకి మరలాడు ముయిజ్జుద్దీన్. ఆ తర్వాత రెండేళ్ళలో కుతుబుద్దీన్ నాయకత్వంలో ఎగువ గంగా డెల్టాలోని అత్యధిక ప్రాంతాన్ని తురుష్కులు ఆక్రమించారు. కనూజ్ రాజు జయచంద్రుడిని ఓడించడానికి 1194లో మళ్ళీ ముయిజ్జుద్దీన్ 50 వేలమంది సైన్యంతో యమునను దాటి కనూజ్ పైకి వచ్చాడు. చందావార్ దగ్గర జరిగిన ఆ యుద్ధంలో జయచంద్రుడిని చంపి కనూజ్‌ను స్వాధీనం చేసుకున్నాడు ముయిజ్జుద్దీన్. అక్కడినుంచి వారణాసి పైకి వచ్చి దానిని కూడా ఆక్రమించాడు. దాదాపు బీహార్ హద్దులదాకా ఇప్పుడు తురుష్కుల వశం అయింది. తరైన్, చందావార్ యుద్ధాల విజయాలు ఉత్తర భారతంలో తురుష్కుల పాలనకు పునాదులు వేశాయి.

ముయిజ్జుద్దీన్ 1206 వరకూ జీవించాడు. దక్షిణాన గ్వాలియర్ దాకా విస్తరించాడు. గంగా డెల్టాను తమ వశం చేసుకున్నాక కుతుబుద్దీన్ ఐబక్ గుజరాత్ పాలకుడు రెండవ భీముడిని ఓడించాడు. ఆ తర్వాత తూర్పు దిశగా వారి ఆధిపత్య విస్తరణ సాగింది. భక్తియార్ ఖల్జీ అనే సేనాని నాయకత్వంలో వారణాసిని దాటి తూర్పు దిశగా విస్తరించడానికి సైన్యాన్ని సిద్ధం చేసుకున్నారు. ఆ కాలంలో బీహార్ ప్రాంతంలో వారికి గట్టి ప్రతిఘటన ఇవ్వగల రాజ్యం అంటూ ఏదీ లేకపోవడం వారికి దోహదపడింది. వారి దాడుల క్రమంలో తురుష్కులు ఉత్తర భారతంలో పలు దేవాలయాలను ధ్వంసం చేశారు. నలంద, విక్రమశిల బౌద్ధ కేంద్రాలను కొల్లగొట్టారు.

అక్కడ చేజిక్కించుకున్న అపార సంపదను ఉపయోగించి తన సైన్యాన్ని, అనుచరులను మరింతగా పెంచుకుని బెంగాల్‌ను నాదియా కేంద్రంగా పాలిస్తున్న సేన వంశపు రాజు లక్ష్మణసేనుడిపై దాడి చేశాడు భక్తియార్ ఖల్జీ. 1204లో జరిగిన ఈ దాడిలో బెంగాల్ ప్రాంతం తేలికగానే తురుష్కుల ఆధీనంలోకి వచ్చింది. అక్కడినుంచి తప్పించుకుని దక్షిణ బెంగాల్ ప్రాంతానికి చేరిన లక్ష్మణసేనుడు అక్కడ తన రాజ్యాన్ని నిర్మించాడు. బెంగాల్ ప్రాంతం దక్షిణాన పెద్ద నదులు ఉండడతో వాటిని దాటుకుని విస్తరించడం భక్తియార్‌కు సాధ్యం కాలేదు. లక్ష్మణసేనుడు, అతడి వారసులు సోనార్ గావ్ రాజధానిగా తమ పాలనను కొనసాగించారు. భక్తియార్ ఉత్తర బెంగాల్ మీద ఆధిపత్యం నెరుపుతూ లఖ్‌నౌని కేంద్రంగా చేసుకుని ఆ ప్రాంతానికి ముయిజ్జుద్దీన్ తరఫున పాలకుడిగా వ్యవహరించాడు.

దాదాపు స్వతంత్ర రాజుగానే భక్తియార్ ఖల్జీ బెంగాల్ ప్రాంతాన్ని పాలించాడు. అక్కడినుంచి ఈశాన్య దిశగా విస్తరించాలని బ్రహ్మపుత్ర లోయ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించాడు. అస్సాం ప్రాంతాన్ని పాలిస్తున్న మాఘ్ వంశపు పాలకులు భక్తియార్ సేనలను లోపలిదాకా రానిచ్చి, ఆ సేనలకు ఆహారం లభించని పరిస్థితులు కల్పించి అలసిపోయిన తురుష్క సేనలపై దాడి చేసి పూర్తిగా ఓడించాయి. పూర్తిగా అనారోగ్యం పాలైన భక్తియార్ ఖల్జీ తన అనుచరుడి చేతిలోనే మరణించాడు.

ఉత్తర భారత ప్రాంత వ్యవహారాలను కుతుబుద్దీన్ ఐబక్‌కు అప్పజెప్పిన ముయిజ్జుద్దీన్ మహమ్మద్ తన సోదరుడితో కలిసి తన ఘురిద్ సామ్రాజ్యాన్ని పశ్చిమ దిశగా మధ్య ఆసియాలోకి విస్తరించాలని ప్రయత్నించాడు. కాని అక్కడ ఉన్న శక్తివంతమైన ఖ్వారిజమీ సామ్రాజ్యంతో తలపడలేక 1203లో దారుణంగా ఓటమిపాలయ్యాడు. ఆ తర్వాత ఇక తురుష్కులు పూర్తిగా తమ కేంద్రీకరణను ఉత్తర భారత ఉపఖండం మీదనే పెట్టారు.

ఉత్తర భారతం పైకి దాడులకు మొదట వచ్చిన గజనీ మహమ్మద్ కాని, తర్వాత వచ్చి చాలా భాగాన్ని స్వాధీనం చేసుకుని తన పాలనను నెలకొల్పిన ముయిజ్జుద్దీన్ మహమ్మద్ కానీ ఇస్లాం మత వ్యాప్తిని తమ లక్ష్యంగా ఎన్నడూ చేసుకోలేదు. తమకు లొంగిపోయిన రాజులను వారి వారి ప్రాంతాలను పాలించుకోడానికి అనుమతించారు. తమ

**“ దాదాపు స్వతంత్ర రాజుగానే భక్తియార్ ఖల్జీ బెంగాల్ ప్రాంతాన్ని పాలించాడు. అక్కడినుంచి ఈశాన్య దిశగా విస్తరించాలని బ్రహ్మపుత్ర లోయ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించాడు. అస్సాం ప్రాంతాన్ని పాలిస్తున్న మాఘ్ వంశపు పాలకులు భక్తియార్ సేనలను లోపలిదాకా రానిచ్చి, ఆ సేనలకు ఆహారం లభించని పరిస్థితులు కల్పించి అలసిపోయిన తురుష్క సేనలపై దాడి చేసి పూర్తిగా ఓడించాయి. పూర్తిగా అనారోగ్యం పాలైన భక్తియార్ ఖల్జీ తన అనుచరుడి చేతిలోనే మరణించాడు. ”**

సేనలలోకి హిందువులను కూడా చేర్చుకున్నారు. భారతీయ నగరాలను, దేవాలయాలను కొల్లగొట్టిన సందర్భాలలో వారు ఇస్లాం మత నినాదాలను ఉపయోగించలేదు.

కేవలం 15 సంవత్సరాల వ్యవధిలోపునే విశాలమైన ఉత్తర భారత భూఖండం తురుష్కుల ఆధీనంలోకి వెళ్ళిపోయిందంటే ప్రతిఘటన ఎంత పరిమితమో తెలుస్తోంది. నిజానికి తురుష్క సేనల వద్ద భారతీయ సేనల వద్ద ఉండే ఆయుధాల కన్నా మెరుగైనవి ఏవీ లేవు. వాస్తవానికి భారతీయుల ఖడ్గాలు ప్రపంచంలోనే శక్తివంతమైనవిగా పేరు పొందాయి. భారతీయ విలుకాళ్ళు విలువిద్యా నైపుణ్యంలో పేరు పొందినవాళ్ళు. వారి బాణాల అంచులకు విషం పూసి ఉపయోగించేవారు. ఏనుగుల దళాలు భారతీయులకు అదనపు బలం. ఐనప్పటికీ తురుష్క సేనల ముందు ఓడిపోయారు. ప్రధాన కారణం ఇక్కడ పాలకులు అమలు చేసిన భూస్వామ్య విధానం. భూమి మీద పెత్తనాన్ని ఎక్కడికక్కడ స్థానిక పాలకులమీద విడిచిపెట్టడం, యుద్ధాల సమయంలో సేనల సమీకరణకు కూడా రాజు వారిమీదనే ఆధారపడడం జరిగింది. ఆ స్థానిక పాలకులు పరస్పరం కీచులాటల్లోనో, ప్రజలను పీడించడంలోనో ఎప్పుడూ మునిగి తేలేవారు. తురుష్క సేనల పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. వారు తెగల సంఘనిర్మాణంలోనే కొనసాగారు. నిరంతరం ఇతర ప్రాంతాలపై దాడులు చేసి కొల్లగొట్టి దోచుకోవడం ప్రధాన వ్యాపకంగా ఉన్నందున వారివద్ద పెద్ద సంఖ్యలో సైన్యం ఉండేది. భారతీయ పాలకుల పరిపాలనా వ్యవస్థలో ఉన్న బలహీనత వల్లనే ఇక్కడ తురుష్కుల ఆధిపత్యం సాధ్యపడింది.

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

# జాతీయోద్యమంలో జాడలేని ఆర్‌ఎస్‌ఎస్

**(26వ పేజీ తరువాయి)**

సందేహం లేదు’ అని పటేల్ ప్రధానమంత్రి నెహ్రూకు చెప్పారు. (సర్దార్ పటేల్, దుర్గాదాస్ మధ్య జరిగిన ఉత్తర, ప్రత్యుత్తరాలు).


ఈ ఘటనలో తమ పాత్ర లేదని హిందూ మహాసభ చేస్తున్న వాదనకు ప్రతిగా 1948, మే 6వ తేదీన హిందూ మహాసభ నాయకుడైన శ్యామ ప్రసాద్ ముఖర్జీకి రాసిన లేఖలో సర్దార్ పటేల్ ఈ విధంగా పేర్కొన్నారు: “హిందు మహాసభ సభ్యులలో అత్యధికులు ఈ విషాదకరమైన ఘటన పట్ల ఆనందాతిరేకాలతో మిఠాయిలు పంచి పెట్టిన అంశంపై మేం కళ్ళు మూసుకొనిలేం. హిందు మహాసభ ప్రధాన నాయకులతో పాటు మహంత్ దిగ్విజయనాథ్, ప్రొఫెసర్ రామ్‌సింగ్, దేశ్‌పాండేలు కొద్ది నెలల క్రితం వరకు హింసను ప్రేరేపించారు. వారు సమాజంలో శాంతి భద్రతలకు ప్రమాదంగా పరిణమించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. మిలిటరీ, అర్ధ మిలిటరీ పద్ధతులలో రహస్యంగా నడుస్తున్న సంస్థ నుండి అదనపు ప్రమాదాలు ఎదురౌతాయి” (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూం 6, పేజి 66).

తర్వాత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి పటేల్ ఈ విధంగా చెప్పారు:“ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలు ప్రభుత్వానికీ, రాజ్యానికి ప్రమాదకరంగా ఉన్నాయని స్పష్టమౌతున్నది” (1948,జులై 18న సర్దార్ పటేల్ రాసిన లేఖలు, వాల్యూం 6, పేజి 323).

సర్దార్ పటేల్ ఈ మాటలు ఈ రోజే చెప్పాడా అని ఆశ్చర్యపోయే పరిస్థితులలో మనం ఉన్నాం! **(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

మతతత్వం

# ఆపరేషన్ సింధూర్:
# ముస్లింలపై నేరస్తుల ముద్రవేస్తున్న బిజెపి



రచయిత ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం 'సామానిక్' అనే సామాజిక శాస్త్రాల పత్రికను నడుపుతున్నారు.

అపూర్వానంద

మెజారిటీ మతానికి చెందిన ప్రజలను రెచ్చగొట్టటం ద్వారా తమ రాజకీయ విధానాలను ముందుకు తీసుకుపోవటానికి బిజెపి నాయకత్వం జాతీయ భద్రత అంశాలను ఉపయోగించుకుంటున్నది. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ మధ్య చేస్తున్న ప్రకటనలు దీనిని స్పష్టం చేస్తున్నాయి.

ముస్లింలను బుజ్జగించటం కోసం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీ ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకించారని కోల్‌కతాలో జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. "ముస్లిం ఓటుబ్యాంక్‌ను సంతృప్తి పరచటం కోసమే మీరు ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకించారు. ఈ విధమైన బుజ్జగింపులను కొనసాగించటాన్ని అనుమతించాలా?" అని ఆయన ప్రశ్నించారు. వాస్తవాలకు విరుద్ధమైన ఈ ప్రకటన విద్వేషాలను రెచ్చగొడుతుందని, ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని అనేకమంది విమర్శించారు. వాస్తవంగా తృణమూల్ కాంగ్రెస్ ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకించలేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఏ విధానాలను వ్యతిరేకించినా దానిని ముస్లింలను బుజ్జగించటంగా ప్రచారం చేయటం, ఒక సమూహాన్ని మొత్తంగా జాతి వ్యతిరేకులుగా ముద్ర వేయటం ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీస్తుంది.

అయినప్పటికీ ప్రస్తుతం ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఒకవైపున హోంమంత్రి అమిత్‌షా దేశంలో తన విచ్ఛిన్నకర ప్రచారాన్ని కొనసాగిస్తుండగా, మరోవైపున మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ముఖ్య నాయకుడైన అభిషేక్ బెనర్జీ ఆపరేషన్ సింధూర్‌ను సమర్థిస్తూ విదేశాలలో ప్రచారం చేస్తున్నారు. ఇండోనేషియాతో పాటు వివిధ దేశాలకు ప్రభుత్వం పంపిన భారత ఎంపీల ప్రతినిధి బృందాలలోని ఒక బృందంలో సభ్యునిగా ఉన్న ఆయన, ఆపరేషన్ సింధూర్‌ను దేశ సరిహద్దులకు ఆవతల జరపవలసిన అవసరాన్ని గురించి అంతర్జాతీయ సమాజానికి వివరిస్తున్నారు.

### ఇచ్చి పుచ్చుకోవటంలో విఫలమౌతున్న బిజెపి

ఆపరేషన్ సింధూర్‌ను టిఎంసి అధినేత వ్యతిరేకిస్తుండగా, దానిని సమర్థించటం కోసం ఆ పార్టీ ఎంపీని విదేశాలకు పంపటంలో ఉన్న అసంబద్ధతను అమిత్‌షా వివరించగలరా? వాస్తవంగా అమిత్‌షా ఆరోపణలకు నిరసనగా టిఎంసి ఆ ప్రతినిధి వర్గాల నుండి తన ఎంపిలను ఉపసంహరించుకొని ఉండాల్సింది. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కన్నా జాతీయ ప్రయోజనాలే మిన్నగా వ్యవహరించాలనే దృక్పథం బిజెపికి లేదని ఇది స్పష్టం చేస్తున్నది. ఐక్యంగా ఉన్నామనే స్ఫూర్తిని ప్రదర్శించటంలో ఇచ్చిపుచ్చుకొనేలా వ్యవహరించటానికి బిజెపి సిద్ధంగా లేదు.

భారతదేశం వ్యవహరించిన తీరులోని ఔచిత్యాన్ని గురించి ప్రతిపక్ష పార్టీల నాయకులు విదేశాలలో ప్రచారం చేస్తుండగా, వారికి వ్యతిరేకంగా బిజెపి దేశంలో నిరంతరం ప్రచారం చేస్తున్నది. ఈ సమయంలో దేశమంతా ఐక్యంగా ఉండాలని ప్రచారం చేస్తున్న, తన వాదనలను విదేశాలలో శక్తివంతంగా వినిపించటం కోసం సమర్థులైన ప్రతిపక్ష నాయకులను విదేశాలకు పంపిన అధికార పార్టీ మరోవైపున వారిని అప్రతిష్ఠ పాలు చేయటానికి పచ్చి అబద్ధాలను దేశంలో ప్రచారం చేస్తున్నది. వారు పాకిస్తాన్ కోసం పనిచేస్తున్నారని నిరంతరం ఆరోపిస్తున్నది.

రాహుల్ గాంధీ పాకిస్తాన్‌ను సంతృప్తి పరిచే విధంగా వ్యవహరిస్తున్నాడని బిజెపి నాయకులు తరచుగా ప్రచారం చేస్తున్నారు. కాని మరోవైపున ఆయన పార్టీ ఎంపిలు ప్రభుత్వ విధానాన్ని శక్తివంతంగా వివరిస్తూ, విదేశాలలో బిజెపి ప్రతినిధులలాగ వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను దుర్మార్గులుగా చిత్రిస్తూ, వారి పార్టీలను దెయ్యాలుగా వర్ణిస్తున్నప్పటికీ, తాము జాతీయ బాధ్యతగా భావించిన దానిని వారు నెరవేరుస్తున్నారు. వారి పార్టీలకున్న గౌరవాన్ని దేశం కోసం బలి చేస్తున్నారు.

హోంమంత్రి ప్రకటనను మనం తిరిగి పరిశీలిద్దాం. ఆయన చెప్పినది వాస్తవాలకు విరుద్ధమైనది మాత్రమే కాక, అనేక విధాలుగా ప్రమాదకరమైనది. మొదటిది, తృణమూల్ కాంగ్రెస్ ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకించిందనేది అబద్ధం. రెండవది, ఆ అబద్ధాన్ని జోడించి, ఇటువంటి ప్రతిపక్ష పార్టీలు కేవలం ముస్లింలను జోకొట్టటానికే ఉన్నాయని, ముస్లింలందరూ సహజంగానే జాతి వ్యతిరేకులనీ, వారంతా ఆపరేషన్ సింధూర్‌కు వ్యతిరేకంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నాడు. ప్రభుత్వానికి, సైన్యానికి ప్రతినిధులుగా జరుగుతున్న సంఘటనలను మీడియాకు వివరించిన వారిలో ఒక ముస్లిం మహిళా అధికారి కూడా ఉన్నదన్నది వాస్తవం అయినప్పటికీ హోంమంత్రి ఈ విధంగా ప్రచారం చేస్తున్నారు.

### కుతంత్రాలకు పాల్పడుతున్న బిజెపి

బిజెపికి బాగా అలవాటైన కుతంత్రాలతో ప్రజలను మోసం చేసే ఆటను హోం మంత్రి ఆడుతున్నారు. ముస్లింలు ఎల్లప్పుడూ పాకిస్తాన్‌కు విధేయులుగానే ఉన్నట్లుగా మోసపూరిత ప్రచారం చేస్తున్నారు. పాకిస్తాన్ పట్ల వారు నిరంతరం వ్యతిరేకతను వ్యక్తం చేసేలా వత్తిడి చేసే కుయుక్తులలో ఇదొక భాగం. తమ దేశభక్తిని నిరూపించుకోవటానికి నిరంతరం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం అవసరంగా మార్చేశారు.

దురదృష్టవశాత్తూ ఇది ప్రతి భారతీయునికి, ముఖ్యంగా ముస్లింలకు తప్పనిసరి అవసరంగా మారింది.

ఈ పూర్వరంగంలో కాంగ్రెస్ ప్రముఖ నాయకులలో ఒకడైన సల్మాన్ ఖుర్షీద్ చేసిన వ్యాఖ్యలను పరిశీలించాల్సి ఉంది. "దేశభక్తునిగా ఉండటం ఇంత కష్టమా?'' అని ఆయన ప్రశ్నించాడు. ఈ ప్రశ్న హోం మంత్రిని, లేదా బిజెపిని అడుగుతున్నాడని కొందరు భావిస్తుండగా, వాస్తవంగా కాంగ్రెస్ సహచరులు, సానుభూతిపరుల ప్రశ్నలకు ఆయన స్పందించాడు. ఆర్టికల్ 370 రద్దుకు ఆయన మద్దతు ఇవ్వటాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఇది పాకిస్తాన్‌కు ఇష్టం లేదని, కానీ ఈ చర్య కాశ్మీరీయులను సంతోషపరిచిందనే అభిప్రాయాన్ని సల్మాన్ ఖుర్షీద్ వ్యక్తం చేశాడు.

ఇది ఆయన పార్టీ అభిప్రాయమేనా అన్న ప్రశ్నను ఎవరైనా అడగవచ్చు. ఆర్టికల్ 370 రద్దుపై తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పనప్పటికీ, దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "మేం సుప్రీంకోర్టును గౌరవిస్తూనే, ప్రాథమికంగా ఆర్టికల్ 370 రద్దు చేసిన తీరుపై ఇచ్చిన తీర్పుకు మా అసమ్మతిని వ్యక్తం చేస్తున్నాం" అని చెప్పారు.

జనతాదళ్ (యునైటెడ్) ఎంపి సంజయ్‌కుమార్ నాయకత్వంలో జూన్ 2వ తేదీన కౌలాలంపూర్ వెళ్ళిన ఎంపిల బృందంలో కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ సభ్యునిగా ఉన్నాడు. బిజెపి ప్రతిపక్ష నాయకులను అపఖ్యాతి పాలు చేస్తున్నది. వారి పార్టీలను దెయ్యాల వలె చిత్రిస్తున్నది. కానీ తాము జాతీయ కర్తవ్యాలని భావించిన వాటిని వారు అమలు చేస్తున్నారు. దేశం కోసం తమ పార్టీల గౌరవాన్ని బలి చేస్తున్నారు.

కాశ్మీరీయులు సంతోషంగా ఉన్నారన్న అంశంపై తాను వాస్తవాలు చెప్పటం లేదని సల్మాన్ ఖుర్షీద్‌కు బాగా తెలుసు. రాష్ట్రహోదా రద్దు చేయటం, భారత సైన్యం తమను అణచివేస్తున్నదని, నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని కాశ్మీరీయులు భావిస్తున్నారని వారితో నిజాయితీగా చర్చలు జరిపితే అర్థం అవుతుంది. ఆర్టికల్ 370 రద్దు విడిగా తీసుకున్న చర్య కాదు. అదొక భారీ ప్యాకేజీలో భాగం. జమ్ముకాశ్మీర్‌కున్న పూర్తి రాష్ట్రహోదాను రద్దు చేసి, దానిని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించటం అందులో భాగంగా ఉన్నాయి.

జమ్ముకాశ్మీర్ ప్రజలకున్న అధికారాలను హరించి, వారిని అవమానించటం కోసం ఈచర్య తీసుకున్నారు. కాబట్టి కాశ్మీర్ ప్రజల ప్రేమను పొందటం కోసం దీనిని ఉద్దేశించలేదని స్పష్టమౌతున్నది. ఇది మరొక భయానకమైన సందేశాన్ని కూడా పంపు తున్నది. భారతదేశంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న ఏ ప్రాంతం అయినా పూర్తి రాష్ట్రంగా ఉండటానికి అంగీకరించబోమనేది కూడా దీనిలో ఉన్నది. జమ్ముకాశ్మీర్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన వెంటనే ముస్లిం ఓట్లను చెల్లాచెదరు చేయటం లక్ష్యంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చారు.

**"జమ్ముకాశ్మీర్ ప్రజలకున్న అధికారాలను హరించి, వారిని అవమానించటం కోసం ఈచర్య తీసుకున్నారే కాని కాశ్మీర్ ప్రజల ప్రేమను పొందటం కోసం కాదని స్పష్టమౌతున్నది. ఇది మరొక భయానక సందేశాన్ని కూడా పంపుతున్నది. భారతదేశంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న ఏ ప్రాంతం అయినా పూర్తి రాష్ట్రంగా ఉండటానికి అంగీకరించబోమనేది కూడా దీనిలో ఉన్నది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన వెంటనే ముస్లిం ఓట్లను చెల్లా చెదరు చేయటం లక్ష్యంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చారు."**

అందువలన ఆపరేషన్ సింధూర్‌ను బలపరచటం కోసం కాశ్మీర్ అంశంపై బిజెపి వ్యవహరించిన తీరును సమర్థించటం సల్మాన్ ఖుర్షిద్‌కు ఏ మాత్రం సరైనది కాదు. ఆయన, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపిలను మరొక ప్రశ్న అడగవచ్చు. హిందు జాతీయవాదుల ఎజెండాను బలపరచకుండా దేశభక్తునిగా ఉండటం అంత కష్టంగా ఉందా?

సల్మాన్ ఖుర్షిద్‌కు ఎదురైన ప్రశ్నను భారతీయ ముస్లింలు ఆపరేషన్ సింధూర్‌ను సమర్థించారని ప్రచారం చేస్తున్న అమిత్‌షాకు సంధించాల్సింది. ముస్లింలను దుర్భాషలాడకుండా భారతదేశంలో దేశభక్తులుగా ఉండటం సాధ్యం కాదా? హిందుమత క్రతువులలో ప్రముఖంగా ఉండే పేరును ఒక సైనిక చర్యకు ఎందుకు పెట్టారని ప్రభుత్వాన్ని అడగటం కష్టంగా ఉందా?

### ఆపరేషన్ సింధూర్‌కు రాజకీయ రంగు పులుముతున్నారు

తమ దేశం, ప్రజల పట్ల ఉండే ప్రేమ, నిజమైన దేశభక్తి ప్రభుత్వం పొరపాటు వ్యూహాలు రూపొందిస్తున్నపుడు, తప్పుడు విధానాలు అనుసరిస్తున్నపుడు ప్రభుత్వాన్ని విమర్శించటం తప్పనిసరి చేస్తుంది. పహల్గాంలో యాత్రీకులపై టెర్రరిస్టులు దాడి చేసినపుడు రక్షణ వ్యవహారాలలో నిపుణులైన ప్రవీణ్ సాహ్ని, అజయ్ సాహ్ని, సుశాంత్ సింగ్ లాంటి వారు బిజెపి ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రశ్నించటాన్ని అనేకమంది బలపరిచారు. బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఈ ప్రాంతంలో శాశ్వతమైన అస్థిరతకు దారి తీస్తుందని, అది దేశ ప్రయోజనాలకు మంచిది కాదని గుర్తించిన వారు ఈ విమర్శలు చేశారు. దేశీయంగా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న వారిని సంతృప్తి పరచటం కోసం హడావిడిగా ఈ ఆపరేషన్ నిర్వహించారని వీరు, ఇతర నిపుణులు భావిస్తున్నారు. మరోవైపున ప్రతిపక్ష పార్టీల ఎంపిలు ప్రభుత్వ విధానాన్ని చిలుక పలుకుల లాగా వల్లిస్తుండగా, ఈ సమస్యపై ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించాలన్న న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరిస్తున్న అసంబద్ధత కొనసాగుతున్నది.

టెర్రరిస్టులు, విదేశాల నుండి ఎదురౌతున్న ప్రమాదాలను ఎదుర్కోవటానికి కాకుండా, దేశంలోని ప్రజలు, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవటానికి అధికార పార్టీ నాయకులు ఆపరేషన్ సింధూర్‌ను ఉపయోగించుకొంటున్నారు. బిజెపి, దాని సహచరులు ఆపరేషన్ సింధూర్‌ను గొప్పగా ప్రచారం చేయటం కోసం "తిరంగా" (జాతీయ జెండాతో) యాత్రలు జరుపుతున్నారు. టెర్రరిస్టు స్థావరాలపై దాడులు చేసే పనిని సైన్యం ఇంతకు ముందే పూర్తి చేయగా, దేశ ప్రజలలో జాతీయ భావనలను పెంపొందించటానికి ఇపుడు ప్రదర్శనలు నిర్వహించటం ఆందోళన కలిగిస్తున్నది. సైనికదళాలను చిన్నచూపు చూడటానికి, "బలమైన నాయకుడు" అని పేరు పడ్డ ప్రధాని ప్రభ క్షీణించటాన్ని అరికట్టి, ఆయన గొప్పతనాన్ని పెంచి చూయించటం కోసం దీనిని ఉద్దేశించారని స్పష్టమౌతున్నది.

ముస్లింలపై వ్యతిరేకతను పెంచటానికి ఆపరేషన్ సింధూర్‌ను ఉపయోగించుకోవటంఏ మాత్రం దేశభక్తి కాదు. ఆపరేషన్ సింధూర్‌ను విమర్శించటాన్ని దేశాన్ని విమర్శించటంగా చూయించటం కూడా దేశభక్తి కాదు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

## బ్రిటిష్ వారితో దోస్తీ, ఉద్యమానికి ద్రోహం

# జాతీయోద్యమంలో జాడలేని ఆర్‌ఎస్‌ఎస్



రచయిత ప్రముఖ చరిత్రకారిణి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. నెహ్రూ స్మారక మ్యూజియమ్, లైబ్రరీ డైరెక్టరుగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

మృదులా ముఖర్జీ

**75**వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటున్న సమయంలో వలస పాలన నుండి స్వేచ్ఛను పొందటం కోసం చేసిన అనేక కష్టతరమైన పోరాటాలపైకి మన ఆలోచనలు మళ్ళటం అనివార్యం.

బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 1857లో జరిగిన మహత్తరమైన తిరుగుబాటు, భారతదేశ సంపదను బ్రిటీష్‌వారు కొల్లగొట్టుకెళుతున్నారన్న విశ్లేషణలతో ఆర్థిక సిద్ధాంతాన్ని రూపొందించి, జాతీయవాదానికి పునాదులు వేసిన దాదాభాయ్ నౌరోజీ, ఆయన సమకాలికులు, స్వాతంత్ర్యం పోరాటానికి కేంద్రంగా భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు కావటం, బెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్ ప్రజలను వీధులలోకి తీసుకొచ్చిన స్వదేశీ ఉద్యమం, మహాత్మాగాంధి రాకతో నాటకీయంగా జరిగిన మార్పులు, జలియన్ వాలాబాగ్ ఉద్యమంపై జరిగిన భయానక హింసాకాండ, గురు కా బాగ్ మోర్చాలో జరిగిన హింసను మౌనంగా భరించిన అకాలీల అహింసాయుత ఉద్యమం, బార్డోలి రైతులు నిశ్శబ్దంగా ప్రదర్శించిన హీరోయిజం, బ్రిటిష్ పాలనను ధిక్కరిస్తూ జరిగిన ఉప్పు సత్యాగ్రహం, బ్రిటీష్ వారిని క్షమాభిక్ష అడగటానికి తిరస్కరించి ఉరికంభమెక్కిన భగత్‌సింగ్, ఆయన సహచరులు, దేశాన్ని కుదిపేసిన క్విట్ ఇండియా ఉద్యమం, ఎర్రకోటలో ఆజాద్ హింద్ ఫౌజ్‌పై జరిపిన విచారణ, 1947, ఆగస్టు 15 అర్ధరాత్రి స్వాతంత్ర్యాన్ని సాధించుకోవటం తదితరాలు మన స్మృతిపథంలో మెదులుతాయి.

ఇంత విస్తారంగా జరిగిన పోరాటాలలో ఈరోజు జాతీయవాదులమని గొప్పలు చెప్పుకుంటున్న వారి పాత్ర ఎక్కడా కనపడదు. జాతీయోద్యమంలో వారు భాగస్వాములు కాదని స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నవారు ఇంటింటికీ త్రివర్ణ పతాకం పేరుతో 75వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరుపుకొంటున్నామని ప్రచారం చేస్తున్నారు. కానీ వారి దృక్పథానికి భిన్నమైన భావజాలంతో ఉత్తేజం పొందిన కోట్లాది ప్రజలు చేసిన పోరాటాల ఫలితంగానే స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామనే వాస్తవాన్ని వారు ఏ మాత్రం అంగీకరించరు. ఆత్మ శోధన చేసుకోవటం ద్వారానో లేదా స్వాతంత్ర్యోద్యమానికి దూరంగా ఉన్న తమ తప్పిదాన్ని అంగీకరించటం ద్వారానో దీనిలో మార్పురాదు. అంతిమంగా మహాత్మాగాంధి హత్యకు దారితీసిన మత భావనలను విస్తృతం చేసే వాతావరణాన్ని వారు పెంపొందించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 52 సంవత్సరాల పాటు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయటానికి ఆర్‌ఎస్‌ఎస్ తిరస్కరించింది. 1998లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలు బిజెపిని మరింత ఆందోళనకు గురి చేశాయి.

వాస్తవాలు ఈ దిగువ విధంగా ఉన్నాయి. బిజెపికి సైద్ధాంతికంగానూ, నిర్మాణపరంగానూ పునాదిగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్‌ను కెబి హెడ్గెవార్ 1925లో ఏర్పాటు చేశారు. 1925 నుండి 1947 వరకు గడిచిన కాలంలో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు, గ్రూపులు ప్రారంభించిన ఏ ఉద్యమంలోనూ, పోరాటంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాముగా ఏ పోరాటాన్ని ప్రారంభించ లేదు. మతం ప్రాతిపదికగా జాతీయవాదాన్ని ప్రచారం చేసే సంస్థకు ఇది అసాధారణమైనది. అది ప్రచారం చేసేది భారత జాతీయవాదం కాదని, దాని జాతీయవాదానికి మతమే ప్రాతిపదిక అనే విషయాన్ని మనం అర్థం చేసుకున్నట్లైతే ఈ మిష్టరీని తేలికగా ఛేదించవచ్చు. హిందూ జాతీయవాదమే ఎల్లప్పుడూ దాని మతంగా ఉన్నది. కాబట్టి ఊహాజనితమైన ముస్లిం ప్రమాదాన్ని ప్రచారం చేస్తూ, వారికి వ్యతిరేకంగా హిందువులను సమీకరించటమే దాని ప్రధాన లక్ష్యంగా ఉన్నది.

ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన హెడ్గెవార్ నాగపూర్‌లో కాంగ్రెస్ పార్టీలో మధ్యస్థాయి నాయకుడుగా ఉండేవాడు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్ళాడు. కాని ఆయన హిందు మహాసభ నాయకుడైన బిఎస్ మూంజికి గట్టి అనుచరుడు. మూంజి ఇటలీ వెళ్ళి ముస్సోలినిని కలిశాడు. ఇటలీలోని ఫాసిస్టు సంస్థల కార్యకలాపాలను అధ్యయనం చేసి, వాటి నుండి ఉత్తేజం పొందాడు. అంతకు ముందు నుండి ప్రచారంలో ఉండి, 1923లో ప్రచురించిన విడి సావర్కర్ రచన 'హిందుత్వ' కూడా ఆయనపై ప్రభావం చూపిందని భావిస్తున్నారు. ఆ పుస్తకంలో సావర్కర్ హిందుత్వ సిద్ధాంతానికి సంబంధించిన ముఖ్యాంశాలను ప్రతిపాదించాడు. భారతదేశం హిందువులకు చెందినదని, వారికి పితృభూమి, పుణ్యభూమి ఇదేనని ప్రతిపాదించి, ముస్లింలు, క్రైస్తవులతో పాటు ఇతరులందరినీ భారతీయుల నుండి మినహాయించాడు.

హెడ్గేవార్ కేవలం నిర్మాణానికి సంబంధించిన వ్యవహారాలే చూసేవాడని, సైద్ధాంతిక, మేధోపరమైన అంశాలు, నిర్దేశాలన్నీ వాస్తవంగా సావర్కర్ నుంచే వచ్చేవనే ప్రచారం కూడా జరిగింది. రత్నగిరిని దాటి బయటికి వెళ్ళకూడదని, రాజకీయాలలో పాల్గొకూడదనే షరతులతో అండమాన్ జైలు నుండి విడుదలైనందున సావర్కర్ తెర వెనుక

నుండి ఆర్ఎస్ఎస్‌ను నడిపించాడు.

ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేయటం కోసం 1925లో నాగపూర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఐదుగురిలో సావర్కర్ చిన్న సోదరుడైన బాబూరావు సావర్కర్ కూడా ఒకరు. ఆయన నడుపుతున్న తరుణ్ భారత్ సంస్థను తర్వాత కాలంలో ఆర్ఎస్ఎస్‌లో విలీనం చేయటంతో ఈ అనుమానం మరింత బలపడింది.

"సైన్యంలో చేరమని ఆయన హిందువు లకు పిలుపు ఇచ్చాడు. సైన్యంలో ఎక్కువ మంది ముస్లింలు ఉండటం సరైనది కాదనీ, కాబట్టి వారి సంఖ్యను తగ్గించాలనీ, "హిందు వులను సైనికీకరించాలనీ" ఆయన ఇస్తున్న నినాదాలకు ఇవి అనుగుణంగానే ఉన్నాయి. ఈ విధానానికి అనుగుణంగా ముస్లింలీగుతో కలిసి మంత్రివర్గాలను ఏర్పాటు చేయటానికి హిందు మహాసభ సిద్ధమైంది."

ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల తర్వాత సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటాలు దేశాన్ని కుదిపివేశాయి. కానీ ఆర్ఎస్ఎస్ ఈ పోరాటాలలో పాల్గొనలేదు. ఆ తర్వాత కొద్దికాలానికి, –1929, డిసెంబర్ లో– లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశంలో అధ్యక్షునిగా ఎన్నికైన జవహర్ లాల్ నెహ్రూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సంపూర్ణ స్వాతంత్రమే లక్ష్యంగా ప్రకటించాడు. (సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం మొదట ప్రతిపాదన చేసింది కమ్యూనిస్టులు...సం॥) 1930, జనవరి 26వ తేదీన సాతంత్ర్య దినోత్సవంగా జరపాలనీ, ఆ రోజు ప్రతి పట్టణం, గ్రామంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలనీ, అక్కడ ఉన్న వారందరూ జాతీయ ప్రతిజ్ఞ చేయాలని కాంగ్రెస్ నిర్ణయిం చింది. ఆర్ఎస్ఎస్ కూడా సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని భావిస్తున్నదని, కాబట్టి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పాటిస్తామని, కానీ తాము త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయబోమని, కాషాయ జెండాను మాత్రమే ఎగుర వేస్తామని హెడ్గెవార్ ప్రకటించాడు. తాము కూడా జాతీయవాదులమేనని ప్రచారం చేసుకొంటూ, నిజమైన జాతీయోద్యమానికి దూరంగా ఉంటున్న ఆర్ఎస్ఎస్ విధానానికి ఇది అసలైన ఉదాహరణగా నిలుస్తుంది.

ఒక సంవత్సరం తర్వాత ప్రారంభించిన శాసనోల్లంఘనోద్యమంలో తాను వ్యక్తిగతంగా పాల్గొంటాననీ, కాని ఒక సంస్థగా ఆర్ఎస్ఎస్ ఉద్యమానికి దూరంగా ఉంటుందని హెడ్గెవార్ ప్రకటించాడు. జాతీయ వాదిననే తన ప్రతిష్ఠకు భంగం కలుగకుండా చూసుకోవటంతో పాటు, జైలులో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను ఆర్ఎస్ ఎస్‌లోకి ఆకర్షించటం కోసమే ఆయన జైలుకు వెళ్ళాడని ఆయన అధికారిక జీవిత చరిత్ర రచయిత పేర్కొన్నాడు. 1930వ దశాబ్దంలో ఆర్ఎస్ఎస్ నిర్మాణంపై కేంద్రీకరించారు. హిందు మహాసభ రాజకీయంగా, ముఖ్యంగా ఎన్నికలలో చురుకుగా వ్యవహరించటానికి ప్రయత్నిం చటంతో సావర్కర్ బయటికి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్, హిందు మహాసభ మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. కాని సైద్ధాంతికంగా వారి సంబంధాలు బలంగానే ఉన్నాయి. ఆర్ఎస్ఎస్ సమావేశాలలో హిందు మహాసభ నాయకులు పాల్గొని ప్రసంగిస్తుండేవారు. హిందు మహాసభ, ఆర్ఎస్ఎస్ సభ్యులలో ఎక్కువ మంది రెండు సంస్థలలోనూ సభ్యులుగా చేరేవారని స్వాతంత్ర్యానికి ముందు నాటి ఇంటెలిజెన్స్ నివేదికలు, గాంధీజీ హత్య తర్వాత జరిగిన దర్యాప్తులోనూ వెల్లడైంది.

జైలునుండి విడుదలైన తర్వాత తనపై ప్రభుత్వ నిఘా కొనసాగుతుండటంతో సావర్కర్ తెర వెనుకనే ఉంటూ రాజకీయంగా చురుకైన పాత్ర పోషించాడు. 1937లో ఆయనపై ఆంక్షలు తొలగించిన తర్వాత ఆరు సంవత్సరాలు హిందు మహాసభ అధ్యక్షునిగా ఉన్నాడు. సావర్కర్ ఆరోగ్యం దెబ్బతిన్న తర్వా త, తప్పనిసరి పరిస్థితులలో ఆ బాధ్యతల నుండి తప్పుకున్నాడు. తనకు క్షమాభిక్ష పెట్టమని ప్రభుత్వానికి పిటీషన్ పెట్టుకున్న తర్వాత బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఎటువంటి కార్యకలాపాలలో పాల్గొనరాదనే షరతుతో అండమాన్, ఎరవాడ జైళ్ళ నుండి సావర్కర్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయన ఆ షరతుకు కట్టుబడి ఉన్నాడు. అందుకుగానూ ప్రభుత్వం ఆయనకు అలవెన్స్ కూడా ఇచ్చింది. హిందు మహాసభ అధ్యక్షు డైన తర్వాత రెండు జాతుల సిద్ధాంతాన్ని ముందుకు తీసుకురావటంలో ఆయన ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతులని ఆయన ప్రకటించిన తర్వాత జిన్నా కూడా అదే సిద్ధాంతాన్ని పట్టుకున్నాడు. హిందూ మహాసభ అధ్యక్షునిగా ఆయన చేసిన ప్రసంగాలు గాంధీ, కాంగ్రెస్, ముస్లిం వ్యతిరేకతతో నిండి ఉండేవి.

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైన తర్వాత హిందు మహాసభ, ఆర్ఎస్ఎస్‌లు నిర్వహించిన పాత్ర చర్చనీయంగా మారింది. దేశంలోని రాజకీయ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా భారతదేశాన్ని యుద్ధంలో భాగంగా చేయటానికి నిరసనగా వివిధ ప్రావిన్స్‌లలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. ఈ శూన్యాన్ని భర్తీ చేయటానికి మత శక్తులు వెంటనే రంగంలోకి దిగాయి. ప్రభుత్వానికి లొంగి ఉంటున్న తన స్వభావాన్ని బహిర్గతం చేస్తూ, ప్రావిన్స్‌లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేయటానికి ముస్లిం లీగ్ మద్దతు ప్రకటించింది. హిందువులు, బ్రిటిష్ వారు మిత్రులనీ, కాంగ్రెస్ మంత్రి వర్గాలు రాజీనామా చేస్తే కాంగ్రెస్ స్థానాన్ని హిందు మహాసభ భర్తీ చేస్తుందని అపుడు హిందు మహాసభ అధ్యక్షునిగా ఉన్న సావర్కర్ 1939, అక్టోబరులో వైస్రాయికి చెప్పాడు (లిన్‌లిత్‌గ్రో, వైస్రాయి, టు జెట్‌లాండ్, సెక్రెటరి ఆఫ్ స్టేట్, 7, అక్టోబర్, 1939, జెట్‌లాండ్ పేపర్స్, వాల్యూం 18, రీల్ నం.6).

సైన్యంలో చేరమని ఆయన హిందువు లకు పిలుపు ఇచ్చాడు. సైన్యంలో ఎక్కువ మంది ముస్లింలు ఉండటం సరైనది కాదనీ, కాబట్టి వారి సంఖ్యను తగ్గించాలనీ, "హిందు వులను సైనికీకరించాలనీ" ఆయన ఇస్తున్న నినాదాలకు ఇవి అనుగుణంగానే ఉన్నాయి. ఈ విధానానికి అనుగుణంగా ముస్లింలీగుతో కలిసి మంత్రివర్గాలను ఏర్పాటు చేయటానికి హిందు మహాసభ సిద్ధమైంది. 1942లో కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించినపుడు దానిని అణచివేయటానికి ప్రభుత్వం కాంగ్రెస్‌పై క్రూరంగా దాడి చేసింది. అపుడు హిందు మహాసభ నాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బెంగాల్ మంత్రివర్గంలో ఉన్నాడు. పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయటమే తమ లక్ష్యం అని 1940లోనే ముస్లింలీగ్ ప్రకటించినప్పటికీ, యుద్ధం జరుగుతున్నపుడు

**"కాంగ్రెస్‌ను ప్రధాన శత్రువుగా చూడటం, బ్రిటిష్ వారితో స్నేహంగా వ్యవహరించటం, తమను తాము జాతీయ వాదులుగా ప్రచారం చేసుకోవటం-హిందు మహాసభ హిందు జాతీయ వాదాన్ని, ముస్లింలీగ్ ముస్లిం జాతీయ వాదాన్ని ప్రచారం చేయటం -ఆసక్తికరమైన విషయం! వారి వాదనలు ఏమైనప్పటికీ వలస దేశంగా ఉన్న భారతదేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రధాన పోరాటంలో భారతీయు లందరూ ఉన్నారనీ, కానీ హిందు మహాసభ మతవాదంతో బ్రిటిష్ వారికి విధేయంగా ఉన్నది."**

సింధ్, వాయవ్య ప్రావిన్స్‌లలో ముస్లింలీగ్‌తో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేయటానికి హిందు మహాసభకు ఎటువంటి అభ్యంతరం లేకపోయింది.

రెండూ కాంగ్రెస్‌ను తమ ప్రధాన శత్రువుగా చూడటం, బ్రిటిష్ వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించటం, అదే సమయంలో తమను తాము జాతీయ వాదులుగా ప్రచారం చేసుకోవటం-హిందు మహాసభ హిందు జాతీయవాదాన్ని, ముస్లింలీగ్ ముస్లిం జాతీయవాదాన్ని ప్రచారం చేయటం-ఆసక్తికరమైన విషయం! వారి వాదనలు ఏమైనప్పటికీ వలస దేశంగా ఉన్న భారతదేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రధాన పోరాటంలో భారతీయులందరూ ఉన్నారనీ, కానీ హిందు మహాసభ మతవాదంతో బ్రిటిష్ వారికి విధేయంగా ఉన్నది. ఇది వాస్తవం.

అంతకు ముందు 1930-32లో జరిగిన పెద్ద ప్రజా పోరాటమైన శాసన ధిక్కార ఉద్యమం, నిజమైన జాతీయ పోరాటమైన క్విట్ ఇండియా ఉద్యమాల నుండి ఆర్ఎస్ఎస్ దూరంగానే ఉంది. జాతీయవాద భావాలతో ఆర్ఎస్ఎస్‌లో చేరి, కార్యకర్తలుగా ఉన్న అనేకమంది ఉత్సాహవంతులైన యువతకు తమ శక్తియుక్తులను రానున్న కాలంలో జరుగనున్న పెద్ద పోరాటాల కోసం దాచుకోవాలని వారు సలహా ఇచ్చారు. ఆర్ఎస్ఎస్‌ను గురించి హోం డిపార్ట్‌మెంట్ పంపిన ఒక నివేదికలో ఈ విధంగా పేర్కొన్నారు,''కాంగ్రెస్ ఆందోళనలు చేస్తున్న 1942లో సభలలో ప్రసంగించిన సంఘ్ నాయకులు కాంగ్రెస్ చేస్తున్న ఉద్యమానికి దూరంగా ఉండాలని తమ కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చారు. వాటిని అమలు చేశారు". 1925 నుండి 1947 వరకు జరిగిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలు వేటిలోనూ ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదని మనం స్పష్టంగా చెప్పవచ్చు.

1946లో మతపరంగా వాతావరణం పూర్తిగా దిగజారిపోయిన తర్వాత హఠాత్తుగా ఆర్ఎస్ఎస్‌కు జీవం వచ్చింది. వారు వేచిచూస్తున్న నిజమైన పోరాటం ఇదే. మతపరమైన హింసాకాండ విస్తరిస్తున్నపుడు హిందువులకు "రక్షకులు"గా ఫోజు పెట్టటం సులభం. స్వాతంత్ర్య సాధన, దేశ విభజన జరగటానికి ముందు, తర్వాత ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ నాయకులు సభలలో చేసిన విషపూరితమైన ప్రసంగాలు, వారి అనుయాయులు వార్తా పత్రికలలో రాసిన విషపు రాతలకు కావలసినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయి. ముస్లింలను దువ్వే వ్యక్తిగా ముద్రవేసి, మహాత్మాగాంధీని తమ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. మువ్వన్నెల జెండాను భారత జాతీయ పతాకంగా తిరస్కరిస్తూ కాషాయ జెండా మాత్రమే హిందువులు గౌరవించే నిజమైన జెండా అని, హిందు సాంప్రదాయంలో మూడు సంఖ్యను అశుభానికి సంకేతంగా చూస్తారని, అందువలన మూడు రంగుల జెండా వలన దేశానికి కీడు జరుగుతుందని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీతో పాటు అనేక మంది రాసిన వ్యాసాలు 1947 మధ్యకాలంలో ఆర్గనైజర్‌లో వచ్చాయి. అదే నమ్మకంతో 2002 వరకు ఆర్ఎస్ఎస్ త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయలేదు. అప్పుడు బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండటంతో పెరిగిన ఒత్తిడితో ఆ విధానాన్ని కొనసాగించటం వారికి కష్టమైంది.

గాంధీజీ హత్యకు ముందు మాసాలైన 1947 సెప్టెంబరులో ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలో విస్తారంగా మతపరమైన హింసాకాండ జరిగింది. ఆర్ఎస్ఎస్‌తో పాటు ఇతర మత సంస్థల పాత్రను గురించి తీవ్రమైన సందేహాలు వ్యక్తమైనాయి. ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు కూడా ఇదే అంశాన్ని ఎత్తి చూపాయి. గాంధీజీ హత్యకు మూడు రోజుల ముందు జరిగిన సభలలో సంఘ్ నాయకులు ప్రభుత్వానికీ, గాంధీజీకీ వ్యతిరేకంగా హింసను రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారు. హిందు మహాసభకు చెందిన మహంత్ దిగ్విజయ్‌నాథ్ ఢిల్లీలో జరిగిన సభలో ప్రసంగిస్తూ మహాత్మాగాంధీతో పాటు హిందు వ్యతిరేకులందరినీ పాకిస్తాన్ పంపాలని పేర్కొన్నాడు. 1947, డిసెంబరు 18వ తేదీన ఢిల్లీలో 50,000 మంది వలంటీర్లు పాల్గొన సభలో ఆర్ఎస్ఎస్ నాయకుడు గోల్వాల్కర్ ప్రసంగిస్తూ ప్రభుత్వ దృక్పధం "భారతీయ వ్యతిరేకం, పైశాచికం'' అని చెప్పాడు. ''తక్షణమే తమ వ్యతిరేకుల నోళ్ళు మూయించటానికి అవసరమైన సాధనాలు తమ వద్ద ఉన్నాయని" సంఘ్ నాయకులు బెదిరింపులకు పూనుకున్నారు.

జనవరి 30న వారు చేస్తున్న బెదిరింపులను అమలుచేశారు. నెహ్రూ చెప్పినట్లుగా మన జీవితాలలో నుండి వెలుగు పోయింది. గాంధీజీ హత్య జరిగిన వెంటనే ఉప ప్రధాని, హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించి, ఆ సంస్థ సభ్యులు 25,000 మందిని జైలులో పెట్టాడు. గాంధీజీ హత్యతో సంబంధాలున్నాయన్న మచ్చపడిన హిందూ మహాసభ తనను కూడా నిషేధిస్తారని తెలుసుకుని, ఎత్తుగడల రీత్యా వెనక్కుతగ్గి దీని నుండి విడగొట్టుకుంది. ఆ సంస్థ ప్రధాన నాయకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించాడు. అప్పటి నుండి 1977లో జనతా పార్టీలో విలీనమయే వరకూ మతపరమైన భావజాలాన్ని వ్యాప్తి చేయటానికి, తమ రాజకీయ విధానాలను ముందుకు తీసుకుపోవటానికి ప్రధాన సాధనంగా జనసంఘ్‌ను ఉపయోగించుకున్నారు. 1980లో దాని స్థానంలో బిజెపిని ఏర్పాటు చేశారు.

1948లో గాంధీజీ హత్య జరిగిన తర్వాత ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన వ్యక్తి సావర్కర్ అనే అనుమానంతో ఆయనను అరెస్టు చేశారు. ప్రముఖ క్రిమినల్ లాయర్ అయిన హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హోంమంత్రి హోదాలో ఈ కేసు విచారణను పర్యవేక్షించారు. సావర్కర్ నేరస్తుడని ఆయన నిర్ధారణకు వచ్చారు. అటువంటి నిర్ధారణకు రాకపోయివుంటే ఆయనపై విచారణ జరపటానికి అంగీకరించేవాడు కాదు. 'ప్రత్యక్షంగా సావర్కర్ పర్యవేక్షణలో ఉన్న హిందూ మహాసభకు చెందిన మతోన్మాద విభాగం ఈ కుట్రకు పథకం రూపొందించి, అమలు చేసిందనటంలో ఎటువంటి

(మిగతా 21వ పేజీలో)

**రాజకీయ పరిణామాలు**

# ఏడాది పాలనలో సాధించింది శూన్యం

**ఎ.కోటిరెడ్డి**

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం, కేంద్రంలో మోడి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయింది. ఈ కాలంలో చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలపై ప్రజలలో అసంతృప్తి పెరుగుతున్నది. కేంద్రంలోని మోడి ప్రభుత్వం ముస్లింలపై ద్వేషాన్ని పెంచటం ద్వారా తమ హిందుత్వ ఎజెండాను, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించటాన్ని మరింత వేగంగా అమలు చేయటం లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎపిలో చంద్రబాబునాయుడు అభివృద్ధి పేరుతో మభ్యపెడుతూ, ప్రజలపై అదనపు భారాలు వేస్తున్నారు. రైతుల నుండి బలవంతంగా భూములను లాక్కొని కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు.

చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రయోజనాలను వదిలివేసి అదాని, అంబానిలతో బాటు బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చటమే లక్ష్యంగా పని చేస్తున్నారు. రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ఉక్కుఫ్యాక్టరి ప్రైవేటీకరణ అంశంపై నోరు మెదపటం లేదు. తామంతా కృషి చేసి, కేంద్రం నుండి 11,440 కోట్ల రూపాయల ప్యాకేజి తెచ్చామని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఆ ప్యాకేజి ప్రజలను మభ్య పెట్టటానికి మినహా ఉక్కు ఫ్యాక్టరిలో ఉత్పత్తిని పెంచటం, కార్మికులకు జీతాలు చెల్లించటానికి ఉపయోగపడదని తేలిపోయింది. బడా పెట్టుబడిదారుల యాజమాన్యంలోని పరిశ్రమలు బ్యాంకులకు, ప్రభుత్వాలకు పన్నుల రూపంలోనూ లక్షల కోట్ల రూపాయల బకాయిలున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. కానీ విశాఖ ఉక్కుఫ్యాక్టరీ రుణాలు, పన్నులు తదితర బకాయిలు ఉన్నదనే సాకుతో ఇచ్చిన ప్యాకేజి నుండి దాదాపు 9,000 కోట్ల రూపాయలను తిరిగి తీసుకున్నదంటే ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటో స్పష్టమౌతున్నది. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించటం, ఉక్కు ఫ్యాక్టరి ప్రైవేటీకరణను నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటం తదితరాలలో చంద్రబాబు ప్రభుత్వం నోరు మెదపటం లేదు. జనసేనాని పేరుకే సేనాని గాని వాస్తవంగా సేవకుడన్న సత్యాన్ని రుజువు చేసుకుంటున్నారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పరిశ్రమలను ఏర్పాటు చేయటం పేరుతో లక్షలాది ఎకరాల భూములను లాక్కోవటానికి ప్రభుత్వం పూనుకున్నది. రాజధాని అమరావతి విస్తరణ పేరుతో అదనంగా 44 వేల ఎకరాలను తీసుకుంటామని ప్రకటించారు. వివిధ ప్రాంతాలలో పెట్టుబడిదారులకు ఒక్కొక్క చోట వేలాది ఎకరాలను కట్టబెట్టటానికి చర్యలు తీసుకుంటున్నారు. చివరకు గిరిజన ప్రాంతాలలో కూడా విద్యుత్ కేంద్రాలు, ఇతర ప్రాజెక్టుల పేర్లతో వేలాది ఎకరాల భూములు లాక్కొంటున్నారు. జగన్ హయాంలో విశాఖలో భూములు పంపకం చేశారు. ఆనాడు దానిని వ్యతిరేకించిన తెలుగుదేశం ఇపుడు అంతకు మించి పంపకాలు చేస్తున్నది. ఎకరం 99 పైసల ధరతో పెట్టుబడిదారులకు వేల ఎకరాలు అప్పగిస్తున్నది. వివిధ ప్రాంతాలలో పరిశ్రమల పేరుతో భూములు బలవంతంగా లాక్కొంటుంటే ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వబోమని నెల్లూరు జిల్లా కరేడు రైతులు ప్రతిఘటిస్తున్నారు. ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కోవటంపై రైతులలో వస్తున్న వ్యతిరేకతకు ఇది అద్దం పడుతున్నది.

రాష్ట్రాభివృద్ధిని టిడిపి పట్టించుకోవటం లేదని ఆ పార్టీ కేంద్రంతో వ్యవహరించే తీరు తెలుపుతున్నది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కీలకమైనది. గతంలో టిడిపి, జనసేనలు కూడా ప్రత్యేక హోదాను గురించి ప్రచారం చేశారు. కాని వారి దృష్టిలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంటే వారి పార్టీలు అధికారంలోకి రావటానికి అది సాధనం మినహా, హోదా సాధన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామనే దృక్పథం ఆ పార్టీలకు లేదు. అందువలననే



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

మోడి భజన మినహా ప్రత్యేక హోదా సాధించటానికి వారే మాత్రం ప్రయత్నం చేయటం లేదు.

రాజధాని అమరావతిని అభివృద్ధి చేయటంలో కూడా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏ మాత్రం నిజాయితీని చూయించటం లేదు. రాజధాని నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో రూపాయి కూడా ఇవ్వలేదు. కాని ప్రపంచబ్యాంకు ఇస్తామన్న 13,500 కోట్ల రూపాయల రుణాన్ని కేంద్రం ఉచితంగా ఇస్తున్నదని టిడిపి ప్రభుత్వం ప్రచారం చేస్తూ, రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నది. రాజధాని కోసం కేంద్రం వేలకోట్ల రూపాయలు ఇస్తున్నదని ప్రచారం చేసిన తర్వాత కేంద్రాన్ని నిధులు అడగటానికి అవకాశం ఉంటుందా? మోడి, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తోడుదొంగల లాగా రాజధాని నిర్మాణంపై మాటలతో మభ్యపెడుతున్నారు.

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూడా టిడిపి ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరిస్తున్నది. పోలవరం కేంద్ర ప్రాజెక్టు. దాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు ఖర్చు చేయాలి. ప్రాజెక్టులో భాగమైన నిర్వాసితులకు పునరావాసం కూడా కల్పించాలి. కానీ కేంద్రం నిర్మాణానికి నిధులు విదిలించి, పునరావాసం విషయంలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తుంటే టిడిపి ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయటం లేదు. నిర్మాణ పనులను నత్తనడకన జరుగుతున్నా పట్టించుకోవటం లేదు. నిర్వాసితులను ముంచటానికి కేంద్రం పూనుకుంటే దానిని వ్యతిరేకించటం లేదు. పైగా ఇపుడు పోలవరం కన్నా బనకచర్లను ముందుకు తీసుకువస్తున్నారు. 80 వేలకోట్ల రూపాయలకు పైగా

**" వైసిపి, టిడిపి పాలన మధ్య వ్యత్యాసమేమిటని ప్రజలలో చర్చ జరుగుతున్నది. ఇద్దరు బద్ధ శత్రువులుగా కనిపిస్తున్నప్పటికీ వాస్త వానికి వారి విధానాల్లో తేడా లేదు. అందువలననే తమ పాలన గురించి చెప్పటానికి ఏమీ లేకపోవటంతో ఎదుటి వారిని విమ ర్శించటానికి, వ్యక్తిగతంగా వారు పనికిరాని వారని ముద్ర వేయ టం కోసం ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రానికి సాగిలపడటం, తమ స్వప్రయో జనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిచేయ టంలో జగన్, చంద్రబాబు, ఒకరితో మరొకరు పోటీపడుతున్నారు. "**

ఖర్చుచేసి, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా కరువు ప్రాంతాలకు నీళ్ళిస్తామని ప్రచారం ప్రారంభించారు. పోలవరం నిర్మాణాన్ని, వెనుకబడిన ప్రాంతాలకు నీళ్ళందించటానికి ఉపయోగపడే మిగతా ప్రాజెక్టులను పక్కన పెట్టటానికి బనకచర్లను ముందుకు తెస్తున్నారా అన్న సందేహం కలుగుతున్నది. గోదావరి లోని మిగులు జలాలను వినియోగించుకోవా లంటే నది పరివాహక ప్రాంతంలోని మిగతా రాష్ట్రాలతో వివాదాలు వస్తాయి. ఆ విధంగా బనకచర్ల పేరుతో తెలంగాణాతో పాటు ఇతర రాష్ట్రాలతో వివాదాలను రెచ్చగొట్టి, ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించటానికి చంద్రబాబు బనకచర్ల పాచిక వేస్తున్నాడా అన్న సందేహం కూడా కలుగుతున్నది. ఇతర రాష్ట్రాలతో వివాదాలకు దారితీసే అంశాలపై జాగ్రత్తగా వ్యవహరిస్తూ, పోలవరం, ఇతర ప్రాజెక్టులపై కేంద్రీకరించ టం రాష్ట్రానికి ఉపయోగకరంగా ఉంటుంది.

వేలకోట్ల రూపాయల విద్యుత్ బిల్లులు, స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. వినియోగదారులు ఎంత విద్యుత్‌ను వినియోగించారో తెలుసుకోవటానికి స్మార్ట్ మీటర్లు బిగించాల్సిన అవసరం ఏమిటి? ప్రైవేటు వారు గంటల వారీగా విద్యుత్ రేట్లు పెంచి, వినియోగదారులకు అమ్మటానికి బిగించే మీటర్లకు ప్రజలెందుకు డబ్బు చెల్లించాలి? స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత వేల రూపాయల అదనపు బిల్లులు వస్తున్నాయని చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. వైసిపి అధికారంలో ఉన్నపుడు యూనిట్‌కు 2.60 రూపాయలు చెల్లించేలా సోలార్ విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటే టిడిపి ఆ ఒప్పందాన్ని విమర్శిం చింది. కానీ ఇపుడు సోలార్ విద్యుత్‌ను యూనిట్ 4.60 రూపాయల చొప్పున కొనుగోలు చేయటానికి టిడిపి ప్రభుత్వం యాక్సిస్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది! వైసిపి హయాంలో అదాని కంపెని అధిక ధరలకు ఒప్పందాన్ని చేసుకోవటం కోసం లంచాలు చెల్లించిందని రుజువైనప్పటికీ ఆ ఒప్పందాన్ని రద్దు చేయలేదు. ఒప్పందాన్ని రద్దు చేస్తే అదనంగా డబ్బు చెల్లించాల్సి వస్తుందని తప్పుడు ప్రచారం చేస్తూ చంద్ర బాబు, టిడిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారు. అదాని లంచాల బాగో తాన్ని బట్టబయలు చేయటానికి ప్రయత్నం చేయటం లేదు.

టిడిపి సంవత్సరం పాలించిన తర్వాత వైసిపి, టిడిపి పాలన మధ్య వ్యత్యాసమేమిటని ప్రజలలో చర్చ జరుగుతున్నది. ఇద్దరు బద్ధ శత్రువులుగా కనిపిస్తున్నప్పటికీ వాస్తవానికి వారి విధానాల్లో తేడా లేదు. అందువలననే తమ పాలన గురించి చెప్పటానికి ఏమీ లేకపోవటంతో ఎదుటి వారిని విమర్శించ టానికి, వ్యక్తిగతంగా వారు పనికిరాని వారని ముద్ర వేయటం కోసం ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రానికి సాగిలపడటం, తమ స్వప్రయో జనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిచేయటంలో జగన్, చంద్రబాబు, ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు. దీనిలో పవన్ కల్యాణ్ కూడా తన వంతు పాత్ర పోషిస్తు న్నారు. తమ వలన రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరగదని ఈ నాయకులు రుజువు చేసుకుంటున్నారు.

టిడిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను ఏ మాత్రం కాపాడలేదని స్పష్టమౌతున్నది. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్టని నాయకుల్ని పక్కన పెట్టటానికి, ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న భారాలు, భూములు లాక్కోవటం, ఇతర అక్రమ చర్యలను ప్రతిఘటించటానికి వామపక్ష పార్టీలు, ప్రజల సంక్షేమం కోరే సంస్థలు, ప్రజలు సన్నద్ధం కావాలి.

**బలవంతపు హిందీని తిప్పికొట్టిన మహారాష్ట్ర ప్రజలు**

కేంద్ర ప్రభుత్వం హిందియేతర భాషలు మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్న రాష్ట్రాలపై హిందీని రుద్దటానికి చేస్తున్న ప్రయత్నాలను మహారాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారు. హిందీని అమలు చేయటం కోసం జారీ చేసిన రెండు సర్కులర్‌లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు భాషా విధానానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు తీవ్రమైన ఆందోళనలు చేశారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పార్టీలతో పాటు మరాఠీ భాష అభివృద్ధిని కాంక్షిస్తున్న ప్రజలు కూడా ఈ పోరాటంలో పాల్గొన్నారు.

హిందీ భాషను దేశంపై రుద్దటం ద్వారా దేశప్రజలందరిపైనా భాషాపరమైన ఆధిపత్యాన్ని సాధిద్దామని బిజెపి భావిస్తున్నది. దేశంలో అనేక జాతులు, భాషలకు చెందిన ప్రజలున్నారు. అన్ని భాషలకు చెందిన ప్రజలు స్వతంత్రంగా అభివృద్ధి కావటానికి ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో ఆయా ప్రజలు మాట్లాడే భాషలు, వారి సంస్కృతి కూడా అభివృద్ధి చెందుతాయి. మాతృభాష ద్వారానే ఏ ప్రజలైనా అభివృద్ధిని సాధించటం సులభమౌతుంది. తమ మాతృభాషను నేర్చుకోవటం ద్వారా ప్రజలు అభివృద్ధిని సాధించటంతో పాటు తమ మాతృభాషను కూడా అభివృద్ధి చేసుకుంటారు. ఈ క్రమంలో ఆ ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని కూడా సాధిస్తారు. అభివృద్ధి క్రమంలో మాతృభాషతో పాటు తమ వృత్తులు, ఉపాధి, సామాజిక అభివృద్ధికి అవసరమైన ఇతర భాషలను కూడా నేర్చుకుంటారు. ఒక భాషకు చెందిన ప్రజలు తమ మాతృభాషతో పాటు ఏ ఇతర భాషలు నేర్చుకుంటారనేది ఆయా ప్రజల అవసరాలు, అంగీకారంపై ఆధారపడి ఉండాలి. దానిని వదిలివేసి కేవలం ఇతర భాషలు మాట్లాడే ప్రజలపై ఆధిపత్యం సంపాదించటం కోసం హిందిని రుద్దటానికి ప్రయత్నం చేస్తే అది వికటించటం ఖాయం. గతంలోనే తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాలు త్రిభాషా సూత్రం పేరుతో హిందిని బలవంతంగా రుద్దటాన్ని వ్యతిరేకించాయి. ఇపుడు మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వమే ప్రజాందోళనకు తలొగ్గి హిందిని రుద్దటాన్ని రద్దు చేయాల్సివచ్చింది.

దీని నుండి కేంద్ర ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలి. హిందీని బలవంతంగా రుద్దటం ద్వారా దేశ ప్రజల మధ్య ఐక్యతను సాధించలేమని, ఆయా జాతుల, సమూహాల ప్రజలు మాట్లాడే భాషలను అభివృద్ధి చేయటం ద్వారానే ప్రజలు అభివృద్ధి చెందుతారని, ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలి. ❋

# ప్రజాసైన్స్ ఉద్యమం అనుభవాలు, సవాళ్లు



రచయిత ప్రజాసైన్సు ఉద్యమ నాయకులు, ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి మాజీ సభ్యులు

**వి బాలసుబ్రమణ్యం**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాసైన్సు ఉద్యమం తన 35 ఏళ్ల ప్రస్థానంలో అనేక అనుభవాల్ని చవి చూసింది. వాటిలో తీపివీ, చేదువీ రెండూ వున్నాయి. కొన్ని సవాళ్లను ఎదుర్కొని, వాటిని సమర్ధవంతంగా అధిగమించింది. కొన్నిటిని పరిష్కరించుకునే క్రమంలో ఉంది. ఒక సజీవ ప్రజా ఉద్యమ సంస్థకు ఇవన్నీ సహజం. అట్లనే వీటిని ఉదాసీనంగా కూడా వదిలెయ్యలేము.

1. జెవివికి ఎక్కడా నిలబడకపోవడం, సూటిదనం కన్పించకపోవడం, సైన్సుకు సమాజానికి మధ్య గల సంబంధం దృష్ట్యా సమాజంలోని ప్రతి దాన్నీ తన కార్య రంగాలుగా ఎంచుకోవడంపై అంతర్గతంగా ఇప్పటికీ చర్చ జరుగుతూనే వుంది. "సైన్సు, శాస్త్రీయ దృక్పథం కేంద్రంగా మన కృషి ఉండాలి. జనవిజ్ఞాన వేదిక అనగానే సైన్స్ గుర్తుకు రావాలి కదా" అనేది చాలా కాలం నుంచి జరుగుతున్న చర్చ. ఏ సంస్థకైనా ఒక నిర్దిష్ట ప్రత్యేక కార్యరంగం వుంటుంది. లక్ష్యం ఉంటుంది. దాన్ని విస్మరించడం వల్ల ఆ సంస్థ తన స్వభావాన్నే కోల్పోయే ప్రమాదం వుంది.దీని పట్ల అప్రమత్తత అవసరం.

2. క్రమంగా డాక్టర్లు, శాస్త్రవేత్తలు, మేధావులు రావడం తగ్గతోంది. టీచర్లు వివిధ సామాజిక కార్యకర్తలు ఒక మేరకు వస్తున్నారు. ఒక దార్శనికతతో, అధ్యయనంతో, సృజనాత్మకంగా నూతన ఆలోచనలను అందించగలిగిన వారు తగ్గిపోవడంతో జెవివి తోచిన కార్యక్రమాల్లోకి దిగిపోతున్నది. ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాలు మన ఉన్నత మధ్యతరగతినే కాదు, మధ్యతరగతిని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. తమను దాటి ప్రపంచాన్ని తేరిపార చూడ నిరాకరించేట్టు చేస్తున్నాయి. కానీ దీన్ని వీలున్నంత మేర అధిగమించేందుకు ప్రణాళిక సైన్సు ఉద్యమం వద్ద ఉండాలి.

3. సైన్స్ పై దాడి కేవలం మతతత్వ ఛాందస వాదుల నుంచి ,సంప్రదాయ వాదుల నుంచి మాత్రమే జరగడం లేదు. అలా ఉంటే దాన్ని నేరుగానే ఎదుర్కోవచ్చు.అస్తిత్వ వాదుల నుంచి, దారి తప్పిన మేధావుల నుంచి కూడా ఈ దాడిజరుగుతోంది. ఉదాహరణకు "చేపమందు" శాస్త్రీయతపై సైన్సు ఉద్యమం ప్రశ్నలు లేవనెత్తి, ఒక సర్వే, సమీకరణ చేసినప్పుడు" వెనకబడిన కులాల వైద్యంపైనే ఎందుకు దాడి చేస్తున్నారు" అదే వాదాన్ని ముందుకు తెచ్చారు. ఇందులో ఏ పదార్థాలు ఉన్నాయెూ చెప్పమని నిలదీసినప్పుడు పారిశ్రామిక వర్గాల కొమ్ము కాస్తున్నారని ఎదురు దాడికి దిగారు. పూర్వీకుల తపస్సుతో, అన్వేషణతో సాధించుకున్న విజ్ఞానాన్ని లోకానికి అంతటికి వెల్లడించాల్సిన అవసరం ఏముందని వాదించి "ప్రజల కోసం సైన్సు" అన్న మూల సూత్రంతోనే విభేదించారు. అడ్డదుడ్డపు దాడులకు కూడా దిగారు.

రామన్ పిళ్ళై ఆకురసంతో నీళ్ళను పెట్రోలుగా మారుస్తానంటూ ప్రదర్శనలిస్తున్నప్పుడు "ఆ రసం ఏమిటో చెప్పమని, తయారైన పెట్రోలు పరీక్షకు పంపా" లని సైన్సు ఉద్యమం డిమాండ్ చేసింది. కానీ ఆ రోజుల్లో దాన్ని విచిత్రంగా అమాయక ప్రజానీకమే కాదు మధ్యతరగతీ, రాజకీయ వర్గాల వారు కూడా గొప్ప అన్వేషణ కింద నమ్మారు. దాంతో ఆగలేదు. ఒక ప్రముఖ మేధావి, సీనియర్ జర్నలిస్టు ఒక దినపత్రిక సంపాదకీయంలో ఈ పెట్రోలు తయారీని సమర్థించాడు .ప్రతి సైన్స్ అన్వేషణా చరిత్రలో ఇలాంటి ప్రశ్నలకు కుతర్కాలకు గురైందని, రామన్ పిళ్ళై వంటి సామాన్యుడి ఆవిష్కరణలను జనవిజ్ఞాన వేదిక లాంటి సైన్స్ పేరు చెప్పుకుని పని చేసే సంస్థలు అర్థం చేసుకోవడం కష్టమని రాశాడు. సైన్స్ చరిత్రలోకి వెళ్లి ఇవన్నీ గతంలోనూ సైన్స్ ఎదుర్కొన్న కష్టాలే నంటూ దీన్ని సమర్థించ ప్రయత్నం చేశాడు. ఆయనకు మద్దతుగా అందరం నిలబడాలని పిలుపునిచ్చాడు.

అశాస్త్రీయ అంశాలపై మానవ సమాజంలో ఎన్ని రకాల భ్రమలు ఉన్నాయెూ, వాటికి ఎన్ని కోణాలనుంచి సమర్ధనలు వుంటాయెూ, ప్రజా సైన్స్ ఉద్యమం దీనిని ఎంత జాగ్రత్తగా అర్థం చేసుకోవాలో, ఎలాంటి మెలకువలు పాటించాలో ఈ సందర్భాల్లో తెలిసి వచ్చింది.

4. ఇక సాక్షరతా ఉద్యమం కూడా సైన్సు ఉద్యమంలో కొన్ని చర్చలకు తెర లేపింది. ఇలాంటి సర్కారు వారి కార్యక్రమాల్లోఎంత దూరం, ఏ జాగ్రత్తలతో పని చేయాలనే సిద్ధాంత చర్చ జాతీయ స్థాయిలో కూడా జరిగింది. ప్రజలు అక్షరాస్యులు కావడం ప్రభుత్వాలకు ఎంత ఇష్టం లేకపోయినా అది వాటి అవసరం. దానికే గాదు ప్రజాస్వామ్యానికి కూడా అంతే అవసరం. కానీ ప్రభుత్వ స్వభావం పట్ల స్పషత వుండాలి. దానితో కలిసి పనిచేసేపుడు సొంత స్వభావాన్ని కోల్పోకుండా చూసుకోవాలి. ఇలా ఒక నిర్ణయానికి రావడం జరిగింది. ఇలాంటి కొత్త పరిస్థితులు తలెత్తినప్పుడు ఈ చర్చలు జరగడం సహజమే. కానీ ఒక వర్గం సైన్స్ నే అంటిపెట్టుకొని సాక్షరతా ఉద్యమానికి దూరంగా వుండిపోయింది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్న వారు వీరిలో ముఖ్యులు. రాష్ట్రంలో జెవివి ఈ సందర్భంగా తన ప్రధాన కార్య రంగాన్ని వదలకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఒకటి రెండు సంవత్సరాలు సైన్సు ఉద్యమానికి వయెూజనవిద్యే ప్రధానమై పోయింది.

5. సారా వ్యతిరేక ఉద్యమంతో ఈ చర్చ మరింత విస్తృతమైంది. అసలు జరిగిందేమంటే జెవివితో సంబంధం లేకుండానే మహిళలు

"మూఢనమ్మకాలపై పోరాటంలో జెవివి దేశంలోనే ముందుంది .మ్యాజిక్ షోలు. దయ్యాల లాంటి వాటి గుట్టు విప్పడాలు, చేప మందు పై పోరాటం, విజయవాడలో దొంగ బాబా బండారం బయట పెట్టడం, వినాయకుడు పాలు తాగడం లాంటివి ఎదురైనప్పుడు వెంటనే దానిలోని మర్మాన్ని బట్టబయలు చేయడం లాంటివి జెవివి కార్యక్రమాల్లో ముందుండేవి. జెవివి అనగానే గుర్తుకొచ్చేవి కూడా ఇవే."

సారా ఉద్యమాన్ని ప్రారంభించారు. దీనికి వయోజన వాచకాలు కొంత స్ఫూర్తినిచ్చిన మాట వాస్తవం కానీ వాటిని ఉద్యమం కోసం పనిగట్టుకుని ఏమీ రాయలేదు. దాదాపు 150 గ్రామాలలో సారాషాపులను మహిళలు మూసివేసిన తర్వాతనే జిల్లా నాయకత్వం ఒక నిర్ణయం తీసుకొని తప్పనిసరై అందులోకి దిగింది. కానీ గ్రామాల్లో వాలంటీర్లు, టీచర్లు, కార్యకర్తలు అప్పటికే ఉద్యమంలోకి వెళ్లిపోయారు. జెవివి ఒక కాటలిస్టుగా వీలున్నంత మందిని సమీకరించి జాగ్రత్తగా వ్యవహరించాలనుకొంది. కానీ కొద్ది రోజుల్లోనే ఒకవైపు సారా కాంట్రాక్టర్లు, మరొకవైపు పోలీసులు దాడులకు దిగడంతో సహజంగానే అది మిలిటెంటు రూపం తీసుకుంది. దీంతో ప్రభుత్వం వయోజన విద్య నుంచి సైన్సు ఉద్యమ కార్యకర్తలను దూరం పెట్టింది. వాచకాలపై కన్నెర్ర చేసింది. ఆన్ డ్యూటీలు రద్దయ్యాయి. ఈ ప్రభావం ఇతర జిల్లాలపై కూడా పడింది .కలెక్టర్లకు హెచ్చరికలు వెళ్లాయి. ఫలితంగా మొత్తం సాక్షరతా ఉద్యమమే నామ మాత్ర కార్యక్రమంగా మారిపోయింది. ప్రభుత్వంతో జెవివికి గల లింకు తెగిపోయింది. ప్రభుత్వం సారాను నిషేధించడంతో జెవివి విజయవంతంగా బయటపడింది. కాదని నిర్దాక్షిణ్యంగా అణిచివేసి ఉంటే సైన్సు ఉద్యమం కూడా దేశంలో ఎక్కడా లేనట్టు తీవ్ర ఒత్తిడికి లోనయ్యేది. నిజానికి ముందే మనం చెప్పుకున్నట్టు ఇందులో జెవివిది కాటలిస్టు పాత్ర మాత్రమే. ఇదే సందర్భంలో ఇదే సమస్తంగా, దీంతో సమాజాన్నీ, రాజకీయాల్నీ మార్చి వేయవచ్చునన్నట్టుగా కూడా ఒక ధోరణి పొటమరించింది.

6. సాక్షరతా ఉద్యమంలో, సారావ్యతిరేక ఉద్యమంలో ఉవ్వెత్తున ముందుకు వచ్చిన మహిళలని ఆ తర్వాత ఏం చేయాలి అనే ప్రశ్న వచ్చింది. మహిళలనే కాదు వాలంటీర్లను కూడా ఏం చేయాలనేది సమస్య. టీచర్ల సంగతి వేరు. వారు జెవివిలో సులభంగానే ఇమడగలిగారు. మహిళలను సంఘటితం చేసుకోవడం సాధ్యం కాలేదు. అసలు ఏం చేయాలో కూడా అర్థం కాలేదు. ఇంత విస్తృతంగా మారుమూల గ్రామాల్లో ఉన్న వారిని మహిళా సంఘాలు కూడా తమ సంస్థల్లోకి ఇముడ్చుకో లేకపోయాయి. వీరంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చార్జ్ అయి వున్నారు. దీన్ని గుర్తించిన నెల్లూరు జిల్లా కలెక్టర్ వీరందరినీ పొదుపు గ్రూపుల్లోకి సంఘటితం చేసే ఆలోచన చేశారు. ఒక రకంగా చూస్తే ఇది ప్రభుత్వ వ్యతిరేకులుగా ఉన్న మహిళలని ప్రభుత్వ ఒడిలోకి తీసుకెళ్లడమే. ఇప్పుడు ఏం చేయాలి అనే ప్రశ్న వచ్చింది. ఇది పూర్తి ప్రభుత్వ కార్యక్రమమని దూరంగా వుండిపోవడంతో ఈ మహిళలకు జెవివికి గల లింకు దాదాపు తెగిపోయింది .వీరిని మరో మెట్టు ఎక్కించడం సాధ్యం కాలేదు.

7. మూఢనమ్మకాలపై పోరాటంలో జెవివి దేశంలోనే ముందుంది .మ్యాజిక్ షోలు. దయ్యాల లాంటి వాటి గుట్టు విప్పడాలు, చేప మందు పై పోరాటం, విజయవాడలో దొంగ బాబా బండారం బయట పెట్టడం, వినాయకుడు పాలు తాగడం లాంటివి ఎదురైనప్పుడు వెంటనే దానిలోని మర్మాన్ని బట్టబయలు చేయడం లాంటివి జెవివి కార్యక్రమాల్లో ముందుండేవి.జెవివి అనగానే గుర్తుకొచ్చేవి కూడా ఇవే. సహజంగానే ఒక హద్దు దాటి మతం మీదా, వ్యక్తిగత విశ్వాసాల మీద దాడులుగా కూడా ఇవి మారేవి. నాస్తిక వాద సంస్థగా జెవివి మారుతోందా అనేదొక చర్చనీయాంశంగా ఉండేది. ఈ కార్యక్రమాలలో కొంత ఆవేశం, కొంత సాహసం ఉంటాయి. వీటికి గుర్తింపు కూడా ఎక్కువే.

కానీ KSSP, TNSF, PBVM లాంటి ప్రజాసైన్స్ సంస్థలకు దీనిపై ఖచ్చితమైన భిన్నాభిప్రాయాలు వుండేవి. ఇలాంటి కార్యక్రమాలు జోలికి వారిప్పటికీ వెళ్లలేదు. జనం విజ్ఞానవంతులవుతూ, భౌతిక పరిస్థితుల్లో మార్పులు వచ్చేకొద్దీ మూఢనమ్మకాలు మెల్లగా పలుచబడి పోతాయని వాటితో నేరుగా పోరాడ్డం నీడతో పోరాడ్డమేనని నమ్మేవి. సాధారణ ప్రజల సున్నిత భావాలను గాయపరచకుండా, ఒంటరి వాళ్ళై పోకుండా జాగ్రత్తలు పాటించడంతోపాటు నమ్మకాలు విశ్వాసాలపై ఒక సైద్ధాంతిక స్పష్టత కూడా జెవికి ఇంకా అవసరం.

8. మరొక నిర్మాణపరమైన అంశం నిలకడ లేకపోవడం. దీర్ఘకాలం కొన్ని అంశాలపై, కొన్ని ఏరియాల్లో కృషి చేయడం ద్వారా విలువైన అనుభవాల నేర్చుకోవడం, స్పష్టమైన ఫలితాలు సాధించడం, గుర్తింపు తెచ్చుకోవడం అవసరం. దీనికోసం కొన్ని వ్యవస్థలను నిర్మించుకోవాలి. ఎప్పటికి తోచింది అప్పుడు చెయ్యడం, ఏది ముందుకు వస్తే దాన్ని చేయడం, కన్సాలిడేషన్ లేకుండా చేసుకుంటూ పోవడం, తనకంటూ ఏ రకమైన వ్యవస్థలు లేకుండా మిగిలిపోవడం జెవివి బలహీనతలు. లక్షల మందికి చెకుముకి టెస్టులు నిర్వహిస్తున్నప్పటికీ ఇది వ్యవస్థాగత రూపం తీసుకోలేదు. ప్రచురణల విభాగం కూడా అంతే. సోషల్ మీడియాని వాడుకోవడం కూడా అంతంత మాత్రమే. విలువైన అధ్యయనాలు చేసి ఒక సాధికార సంస్థగా గుర్తింపు పొందలేకపోవడంతో నిపుణులు, మేధావులు దగ్గరకు రాలేకపోతున్నారు.

9. రచయితల్ని ఆకర్షించలేకపోవడం మరో బలహీనత. సైన్సు ఉద్యమ కార్యకర్తలే, నాయకులే ఈ పని చేయడం వల్ల ప్రచురణలో పెద్ద నాణ్యత ఉండడం లేదు. సంస్థగా గొప్ప గుర్తింపు ఉండి కూడా రచయితలతో అనువాదకులతో సంబంధం లేకపోవడం పెద్ద బలహీనతగా ఉంది.

చివరగా, ముఖ్యంగా ప్రస్తుత ప్రపంచీకరణ యుగం ఉన్నత, మధ్యతరగతి వర్గాల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రజా ఉద్యమాలపై వీరు విశ్వాసాన్ని కోల్పోతున్నారు. స్వచ్ఛంద సంస్థల వైపు ఒరిగిపోతున్నారు. ఒక తిరోగామి సంస్కృతి రాజ్యమేలుతున్న కాలమిది. దీంతో ఒక సురక్షిత జోన్‌లోకి వీరు జారిపోతున్నారు. పాలకవర్గాలతో కో ఆప్షన్‌కు సిద్ధమవుతున్నారు. స్వచ్ఛంద సంస్థల వైపు చూస్తున్నారు. ఒక చట్రంలో ఇమడ్డానికి, ఒక విస్పష్ట ప్రాపంచిక దృక్పథానికి కట్టుబడ్డానికి, ఘర్షణ పడ్డానికి సిద్ధ పడ్డం లేదు. ఈ ధోరణి పెద్ద పెద్ద మేధావుల్లో సైతం వ్యక్తమవుతోంది. నిరంతర అధ్యయనం,

సైద్ధాంతిక అవగాహన, మేధోకృషి, అట్టడుగు జనంలో పని చెయ్యడం వల్ల మాత్రమే వీటిని అధిగమించగలరు. ఇదొక నిరంతర ప్రక్రియ, జాగరూకతతో కూడిన ప్రక్రియ. ప్రజా సైన్స్ ఉద్యమం ఒంటరిది కాకూడదు. ప్రజా సంస్కృతిని, ప్రగతి శీల భావజాలాన్ని, హేతుతత్వాన్ని ఇష్ట పడ్డే వారినందరిని కలుపుకోగలగాలి. ఒక విస్తృత వేదికగా వ్యవహరించగలగాలి. ఇదే సందర్భంలో దాని తాత్వికతను అది గట్టిగా నిలుపుకోవాలి. ప్రభుత్వాలే పనిగట్టుకుని సైన్సు వ్యతిరేకతను పెంచి పోషిస్తున్న సమయంలో, ప్రతి దాన్నీ సున్నితంగా మార్చి రెచ్చగొడుతున్న సందర్భంలో సైన్సు ఉద్యమం ఏకాకి కాకూడదు. అలాగే దాని భాషలో, కార్యక్రమాల్లో, పనితీరులో కూడా వీలైనంత అంగీకార యోగ్యత వుండేలా మెలకువ పాటించాలి.

### ప్రజాసైన్స్ ఉద్యమం ప్రత్యేకత

ప్రజా సైన్సు ఉద్యమ ప్రచారాలు ఒక శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిస్తాయి. సహజంగానే ఇవి మితవాద వ్యతిరేకతనూ, చాందసవాద వ్యతిరేకతనూ కలిగి ఉంటాయి. ప్రజాస్వామిక లౌకిక భావాల్ని వీలున్నంత మందిలో కలిగించడం ఒక గొప్ప విలువ, గొప్ప అవసరం కూడా. ఇలా ప్రజల అవగాహనను పెంచడం ద్వారా వారి స్థాయిని పెంచడం, వారిని భాగస్వామ్యుల్ని చేయడం, ప్రశ్నించేలా చేయడం అభ్యుదయ శక్తులకే కాదు ప్రజాస్వామ్యానికి కూడా ఎంతో అవసరం.

స్వావలంబనను ముందుకు తేవడం సామ్రాజ్యవాద శక్తులను ఎదుర్కొనడమే. ఎల్ పి జి విధానాలను వ్యతిరేకించడంతోపాటు సైన్సు ఉద్యమం ప్రత్యామ్నాయాలని కూడా చూపగలిగింది. ఈ కృషి చాలా విలువైంది. స్థానిక ప్రణాళికలు, పేదలకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం, పేదలను కదిలించడం, అట్టడుగు మహిళల్ని కదిలించడం, గ్రామీణ వాలెంటీర్లను సమీకరించడం కూడా ఎంతో ప్రయోజ నకరమైనవి

అలాగే సైన్సు ఉద్యమం నిర్మించిన ప్లాట్ ఫారాలలో "సమత" (మహిళా వేదిక) ఎంతో కీలకమైంది.

శాస్త్ర కళా జాతా, సాక్షరతా ఉద్యమం లాంటి వాటి పట్ల ఎందుకు ప్రజలు ఊహించనంతగా స్పందించారు? ప్రజల జ్ఞాన దాహం వల్లా, దాన్ని తీర్చడంలో పాలక వర్గాల వైఫల్యం వల్లా ఇలా జరిగింది. నిజానికి నిరక్షరాస్యత పాలకులకూ ప్రమాదకరం. అసలు అందరికీ చదువన్నది ఒక పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యపు అవసరం. కానీ మన లాంటి ఫ్యూడల్ వాసనల్ని వదిలించుకోలేని పాలకులు అందరికీ న్యాయమైన విద్య నేర్పరు. అదే సందర్భంలో నేర్పకుండా తప్పించుకోనూలేరు. దీంతో పాలకవర్గానికి స్వచ్ఛంద సంస్థలు అవసరమవుతాయి. ఒకానొక సందర్భంలో ఈ జ్ఞానం ప్రమాదకరం అనిపించినప్పుడు నిర్దాక్షిణ్యంగా ఇలాంటి కార్యక్రమాల్ని అటకెక్కిస్తారు. కేరళలో యు.డి.యఫ్ అధికారంలోకి రాగానే ఇలాగే జరిగింది. సారా వ్యతిరేక ఉద్యమం తర్వాత మన రాష్ట్రంలోనూ ఇలాగే అయింది. పాలకవర్గాల స్వభావాన్ని అంచనా వేయడంలో పొరపడి భ్రమల్లో కూరుకు పోరాదు. స్వచ్ఛంద సంస్థలతో, యువకులతో చదువు నేర్పడం ప్రభుత్వానికి లాభదాయ కంగానే వుంటుంది. బలమైన వ్యవస్థలు, ఉపాధ్యాయులు లేకుండా అరకొర ఖర్చుతో పని పూర్తి చేయవచ్చు. అయితే ప్రజా సైన్సు ఉద్యమం లాంటివి ఎందుకు ఇంత తెలిసీ ఇందులోకి ప్రవేశించాలి? ఎందుకంటే నిరాక్షరాస్యత సైన్స్ కూ నష్టం. అట్టడుగు ప్రజానీకంలోకి ఏ రూపంలో నైనా వెళ్ళగలడం ప్రయోజనకరమే. ఏ మేరకు ఆలోచనల్ని మార్చినా మేలే. ఈ స్పృహ, స్పష్టత, ప్రజల పట్ల గాఢమైన బాధ్యత వుండడమే సైన్సు ఉద్యమ ప్రత్యేకత. లేకుంటే అదీ ఇతర స్వచ్ఛంద సంస్థల కోవలోకి చేరిపోయేది.

ప్రజాసైన్స్ ఉద్యమం సాంప్రదాయక విమర్శకు పరిమితం కాదు. ఇది నిర్మాణాత్మక, పరిశోధనాత్మక, మేధోకృషిని కూడా చేస్తుంది. అదే దాని ప్రత్యేకత.

దేశవ్యాప్తంగా చూస్తే పలు స్వభావాలు గల సంస్థలు సైన్సు ఉద్యమంలో భాగంగా పని చేస్తున్నాయి. వాటిల్లో గాంధీ వాదుల నుంచి రాడికల్స్ దాకా ఏ పార్టీ రాజకీయాలతో నిమిత్తం లేని వారితో సహా పని చేస్తున్నారు. అందరినీ కలుపుకొని పోవాలి. ఒక స్పష్టమైన లక్ష్యం కార్యాచరణ ఉండాలి. విస్తృత వేదికగా ఉంటూనే ప్రజల్ని చైతన్యవంతులని చేస్తూ ప్రజాస్వామ్య భావజాలం విస్తృతపరచడం అనే లక్ష్యంతో ఈ పని చేయాలి. సైన్స్ వీటి కార్యక్రమాలకు కేంద్రంగా ఉండాలి. ఈ అవగాహన, అనుభవం కూడా ప్రజా సైన్సు ఉద్యమానికి పుష్కలంగా వుంది. అంటే Science based Social Activism అన్నమాట. ఈ స్పష్టత కూడా ప్రజాసైన్స్ ఉద్యమానికి వుంది. అయినా ఇది నిరంతరం ఉండాల్సిన మెలకువ. ఇన్ని జాగ్రత్తలు తీసుకోబట్టే వివిధ రాష్ట్రాల్లో, వివిధ రూపాల్లో పని చేస్తున్న సైన్స్ సంస్థలన్నీ ఒక తాటి మీదికి రాగలిగాయి. దేశంలో కొద్దికాలంలోనే గొప్ప సంస్థగా మారగల్గింది.

ప్రభుత్వంతో కలిసి పని చేస్తూ ప్రభుత్వాన్ని విమర్శించడం సాధ్యమా? సాధ్యమనీ, ఆ లక్షణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదని కూడా సైన్సుఉద్యమం నమ్మింది, అచరించింది.

వివిధ సంస్థల్లో పనిచేస్తున్నవారు, పెద్దగా ఇతర బాధ్యతలు లేనివారు, ఉద్యోగులు, వివిధ రంగాల్లోని పలువురు బుద్ధి జీవులు సైన్సు ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. వారు కూడా జనంలో ఎంతో గొప్పగా ఇమిడిపోయారు.

**"ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ ప్రభుత్వాన్ని విమర్శించడం సాధ్యమా? సాధ్యమనీ, ఆ లక్షణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదని కూడా సైన్సుఉద్యమం నమ్మింది, అచరించింది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వారు, పెద్దగా ఇతర బాధ్యతలు లేనివారు, ఉద్యోగులు, వివిధ రంగాల్లోని పలువురు బుద్ధి జీవులు సైన్సు ఉద్యమం పట్ల ఆకర్షితుల య్యారు.వారు కూడా జనంలో ఎంతో గొప్పగా ఇమిడిపోయారు."**

సోవియట్ రష్యా పతనం అయ్యాక, నూతన ఆర్థిక విధానాలు తోసుకొచ్చాక సమాజంలో ముఖ్యంగా మధ్యతరగతి వర్గంలో చాలా మార్పులు వచ్చాయి. తిరోగామి ధోరణులు సమాజంలో ఎక్కువయ్యాయి. బహుళజాతి సంస్థలు మనలాంటి దేశాల్లోకి జొరబడ్డాయి. కొత్త కొత్త స్వచ్ఛంద సంస్థలను ప్రారంభించాయి. ఇవి కొత్త కొత్త "అధ్యయనాలు" చేయడం మొదలుపెట్టాయి. సమాజ గతి గురించి కొత్త పాఠాలు చెప్పసాగాయి. మంచి అలవెన్సులు కూడా ఇస్తున్నాయి. రాజకీయాలు లేకుండా రాజకీయాలకు దూరంగా పనిచేయడాన్ని ముందు తెస్తున్నాయి. సైన్సు ఉద్యమం దీనిపట్ల మరింత

> **"గతం కంటే ప్రజాసైన్స్ ఉద్యమ ఆవశ్యకత ఇప్పుడు ఎక్కువైంది. విస్తృత ప్రజానీకంలో శాస్త్రీయభావజాలం విస్తరించడం, వారు ప్రజాస్వామిక ప్రక్రియలో భాగస్వాములు కావడం, ప్రశ్నించడం ఇప్పుడు మరీ అవసర మైనవి. క్రమక్రమంగా దేశంలో ప్రజాస్వామ్యం కుంచించుకపోతోంది. దేశంలోనే కాదు ప్రపంచ మంతా కనిపిస్తున్న ధోరణి ఇది. దీన్ని అరికట్టాలంటే రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు పౌరసమాజంలో ప్రజా స్వామిక విలువ లను మనం పటిష్టం చేసుకోవల్సి వుంటుంది."**

అప్రమత్తంగా వుండాల్సి వస్తోంది.

**ప్రజాసైన్స్ ఉద్యమం - ప్రస్తుతం**

గతం కంటే ప్రజాసైన్స్ ఉద్యమ ఆవశ్యకత ఇప్పుడు ఎక్కువైంది. విస్తృత ప్రజానీకంలో శాస్త్రీయభావజాలం విస్తరించడం, వారు ప్రజాస్వామిక ప్రక్రియలో భాగస్వాములు కావడం, ప్రశ్నించడం ఇప్పుడు మరీ అవసర మైనవి. క్రమక్రమంగా దేశంలో ప్రజాస్వామ్యం కుంచించుకపోతోంది. దేశంలోనే కాదు ప్రపంచమంతా కనిపిస్తున్న ధోరణి ఇది. దీన్ని అరికట్టాలంటే రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు పౌరసమాజంలో ప్రజా స్వామిక విలువలను (నాన్ స్టేట్ డెమోక్రసీని) మనం పటిష్టం చేసుకోవల్సి వుంటుంది. ట్రేడ్ యూనియన్లు, మీడియాలతో పాటు సమాజంలో ప్రజాస్వామిక సంస్కృతి, సహనం ఇప్పుడు బలపడాల్సి వుంది. ప్రజాసైన్స్ ఉద్యమం ఇందుకోసం చేయవలసింది ఎంతైనా వుంది.

ప్రజాసైన్సు ఉద్యమం ఒక కర్తవ్యాన్ని దీర్ఘ దృష్టితో దీర్ఘ కాలపు కార్యాచరణను దీనికోసం చేపట్టాల్సి ఉంది. దీనికి తగ్గ శక్తి సామర్థ్యాలను, నైపుణ్యాల్ని సంపాదించుకోవాల్సి ఉంది. వ్యవస్థల్ని నిర్మించుకోవలసి ఉంది. స్నేహితులను సమకూర్చుకోవలసి ఉంది. పాఠశాల విద్యార్థుల దగ్గర నుంచి, ఉన్నత మధ్యతరగతి వర్గాల దాకా చొచ్చుకొని పోవలసి ఉంది. ఒక ఛాంపియన్ గా ముందుకు రావాల్సి ఉంది.

**ఒప్పించగల్గడం ముఖ్యం**

ఛాందసవాదులు, మతతత్వశక్తులు సామాజిక మాధ్యమాలు వేదికగా పచ్చి అబద్దాలు వండి వారుస్తున్నారు. అబద్ధాలు చెబుతూ పోతే ఒక శక్తిగా అవి మారతాయని వారి నమ్మకం. సంప్రదాయాలు, మత భావనలు, సాంస్కృతికాంశాలతో కూడిన, సున్నితమైన విషయాలతో విశ్వాసాలతో కూడుకున్న వాటిని వారు బాణాలుగా ఎక్కుపెడుతున్నారు. పైన చెప్పుకున్న వాతావరణంలో వున్న మధ్యతరగతి ఈ వలలో పడుతోంది. సంస్కృతీకరణ పెద్దఎత్తున జరుగుతున్న కాలం కూడా ఇది. ఫలితంగా దిగువ మధ్యతరగతి, పేద సామాజిక వర్గాల వారు కూడా వీటిపట్ల ఆకర్షితులవుతున్నారు. ఆధునిక దృక్పథానికి వ్యతిరేకులుగా మారుతున్నారు.

ఈ సందర్భంలో ప్రజాసైన్స్ ఉద్యమం వీటన్నిటికీ జవాబులు చెప్పుకునే పనిలో పడిపోకూడదు. వెంటనే స్పందించి తీరాలని వారి అజెండాలోకి పడిపోకూడదు. కరుకుగా ఉండడం ఎంత అవసరమో మెలకువగా ఉండటం కూడా అంతే అవసరం .మనం వాస్తవం ఏదో చెప్పాలి. న్యాయం ఏదో చెప్పాలి. కానీ సాధికారికంగానూ, సృజనా త్మకంగానూ చెప్పాలి. వీలైనంతమందిని ఒప్పించ గలిగేలా చెప్పాలి. ప్రజాసైన్స్ ఉద్యమం భాషా, చెప్పే విధానం వేరుగా ఉండాలి.

**భౌతిక వాదానిదే విజయం**

ఛాందసవాదులు ఎంత మొత్తుకున్నా సైన్స్ ను కాదని ప్రస్తుతం ఎవ్వరూ జీవించలేరు. భౌతిక అవసరాలే అన్నిటికన్నా గొప్పవి. వాటిని వదులుకోవడానికీ, వ్యతిరేకించడానికీ జనం సిద్ధపడరు. ఇది మతతత్వ వాదులకు కూడా తెలియనిది కాదు. కానీ స్వభావరీత్యా వారు తిరోగామి వాదులు. వారిది కరుడుకట్టిన మూఢత్వం. ఇదేమీ కొత్తది కూడా కాదు. చరిత్ర నిండా వున్నదే.

ఇప్పుడు ఏ అభివృద్ధి చెందిన దేశంలో చూచినా 30 శాతానికి తగ్గకుండా ఏ మతానికీ చెందని ప్రజానీకం ఉన్నారు. మరో 100 ఏళ్లకిది మెజారిటీగా కూడా మారుతుంది. ఆయా దేశాల్లోనే పెరిగిన శాస్త్ర విజ్ఞానం, తీరిన ఈతిబాధలు, పెరిగిన ఆరోగ్యం, ఆయుర్దాయం లాంటివి ప్రజల్ని మతానికి దూరం చేశాయి. దీనిని మనం గుర్తుంచుకో వాలి. కాకుంటే మనం దీన్ని మనం వేగిరం చేయాలి. వెనక పట్టు పడుతున్నప్పుడు ఘర్షణపడి నిలవరించాలి. భారతదేశంలో మనం ఇప్పుడీ స్థితిలో ఉన్నాం.

ప్రజాసైన్స్ ఉద్యమం కూడా కొన్ని వ్యవస్థల్ని నిర్మించుకోవాలి. సైన్స్ క్లబ్బులు, సైన్స్ కేంద్రాలు, సైన్స్ టీచర్ల గ్రూపులు ఇలాంటి ఏర్పాటు చేయవచ్చు. చెకుముకి చుట్టూ రచయితల్ని, సైన్సు ప్రియుల్ని సమీకరించవచ్చు. కొన్ని విద్యాసంస్థల్ని ఎంపిక చేసుకొని శాస్త్రీయదృక్పథంతో పాటు అభ్యసన ప్రమాణాల్నీ నైపుణ్యాల్ని పెంచేందుకు పూనుకోవచ్చు. గ్రంథాలయాలు నడపొచ్చు.

సోషల్ మీడియా శక్తివంతమైన మాధ్యమంగా ఈ రోజుల్లో మారింది. అశాస్త్రీయ,మతతత్వ, తిరోగామి భావాలనే కాదు పచ్చి ఫ్యూడల్ దుర్మార్గ భావజాలానికి కూడా ఇది వేదిక అవుతోంది. హింసాత్మక దాడులను కూడా పిలుపునిస్తోంది. దీన్ని పకడ్బందీగా తిరోగామి శక్తులు వాడుకుంటు న్నాయి. దీనికి తగ్గ వ్యవస్థల్ని నిర్మించుకుంటు న్నాయి. ప్రజాసైన్స్ ఉద్యమం కూడా దీన్ని సవాలుగా తీసుకోవాలి. తనదైన శైలిలో సృజనాత్మకంగా క్రియాశీలంగా ఈ రంగంలో పనిచేయాలి.

**మిత్రుల్ని కూడ గట్టు కోవాలి**

కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి ప్రభుత్వ విద్యారంగం బలహీనపడటం పెద్ద సమస్య. ఇప్పుడు ఏ విద్యాసంస్థలోనూ విద్యార్థులకు తీరిక సమయం అంటూ ఉండడం లేదు. విద్యచుట్టూ అల్లుకున్న మార్కులు గ్రేడులు పోటీల సంస్కృతి విద్యార్థుల్ని డొల్లగా మారుస్తోంది. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, పక్కవారిని గురించి సైతం ఆలోచించడం, ఆధునిక దృక్పథాన్ని సంతరించుకోవడం లాంటివి ఈ కాలపు పిల్లలకు విద్యాసంస్థల్లో దూరమైపోయాయి. అయినప్పటికీ తమ పిల్లలు అందరికంటే ముందుండాలనే ఆకాంక్ష కూడా తల్లిదండ్రుల్లో తీవ్రంగా వ్యక్తమవుతోంది. పిల్లలు కూడా అంతే. చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఐదు లక్షల మంది హాజరు కావడం ఎలాజరిగింది? నెల్లూరులోని మన సైన్సు సెంటర్‌కు ప్రైవేట్ స్కూళ్ళు బస్సుల్లో పిల్లల్ని ఎందుకు పంపుతున్నారు? ఇలాంటి అవకాశాల్ని అందిపుచ్చుకునే మెళకువా, దీనికి తగ్గ సామర్థ్యాలూ మనకుండాలి.

మరో ప్రధానాంశం ప్రజా సంఘాలతో స్నేహం సమన్వయం. అందర్నీ కలుపుకొని పోవాలనే ధోరణిలో పడి భావసారూప్యం గల సంస్థలకు దూరం కాకూడదు. ఒక లక్ష్యం ఒక నిర్మాణం, ఒక సైద్ధాంతిక పునాది గలది

(మిగతా 34వ పేజీలో)

# సత్యజిత్ రాయ్

(2వ పేజీ తరువాయి)

సచిత్ర నవలగా తీసుకురావాలని తలపెట్టారు ప్రచురణ కర్తలు. ఉద్యోగంలో భాగంగా దానికి బొమ్మలు వేసే పని సత్యజిత్ రాయ్‌కి అందింది. అది అతడి జీవితంలో ఒక పెద్ద మలుపు. ఆయన ఆ పుస్తకంతో, ఆ పాత్రలతో, ఆ బొమ్మలతో ఎంతగా మమేకమయ్యాడంటే, దాన్నే సినిమాగా ఎలా తీయవచ్చా అని ఆలోచించడం మొదలుపెట్టాడు. ఏముందందులో! ఓ ప్రేమా పాడూ వుందా? పాటా, ఫైటుకు అవకాశముందా? కనీసం హ్యాపీ ఎండింగు వుందా? మరొకడైతే దాని వైపు కన్నెత్తి చూసేవాడు కాదు. కానీ సత్యజిత్‌రాయ్‌కి అందులో ఒక అద్భుత కళాఖండం కన్పించసాగింది. రాయ్‌కి స్క్రిప్టు దశలోనే సన్నివేశాలను స్కెచ్చులుగా వేసుకుని వుంచుకునే అలవాటు వుండేది. ఆ అలవాటు ఈ పిల్లల పుస్తకానికి బొమ్మలు వేసినప్పుడే మొదలైంది.

**రెనర్ సాంగత్యం - లండన్ ప్రయాణం**

సినిమాలు తీయాలని ఆసక్తి ఉన్నా అతడు కోరుకున్నవి భారతదేశంలో తయారౌతున్న మాదిరి సినిమాల్లాంటివి కావు. అందుకని సినీ సాహిత్యాన్ని చదవడం మొదలుపెట్టాడు. రష్యన్ మాష్టర్స్ పుదోవ్కిన్, సెర్గీ ఐజెన్ స్టీన్ పుస్తకాలు చదివి మాంటేజి టెక్నిక్‌ను అర్థం చేసుకున్నాడు. బ్రిటీషు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ వారి 'సైట్ అండ్ సౌండ్' పత్రికకు చందాదారుడయ్యాడు. మంచి సినిమాల ప్రచారం కోసం చిదానంద దాస్‌గుప్తా తదితరులతో కలిసి 1947లో కలకత్తా ఫిల్మ్ సొసైటీ స్థాపించాడు. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా కలకత్తా పోస్టింగ్‌లో వున్న అమెరికన్ సైనికులు కొందరితో రాయ్‌కి స్నేహం వుండేది. వారు తాజా అమెరికా సినిమాల గురించీ, సంగీతం గురించీ సమాచారం అందించేవారు.

1949 లో అతడి జీవితంలో ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. మొదటిది, తన ప్రేయసి, బంధువులమ్మాయి బిజయా దాస్‌తో పెళ్లి, కుమారుడు సందీప్ జననం. రెండోది, ప్రఖ్యాత ఫ్రెంచి దర్శకుడు జీన్ రెనర్ తన 'ది రివర్' సినిమా షూటింగు కోసం కలకత్తా రావడం. కలకత్తాకు బయట వున్న బ్యారక్‌పూర్ తదితర ప్రాంతాల్లో షూటింగుకు వెళ్లినపుడు, రాయ్ అతనికి గైడుగా వుంటూ షూటింగును పరికిస్తూ అతని నుండి దర్శకత్వంలో కిటుకులెన్నో నేర్చుకున్నాడు. 'పాథేర్ పాంచాలీ' సినిమా తీయాలన్న సంగతి రెనర్‌కు చెప్పాడు. ఆయన సత్యజిత్‌ను మనసారా ప్రోత్సహించాడు. సత్యజిత్ సినీ నిర్మాణంపై రెనర్ ప్రభావం ఎంతో వుంది.

1950 లో రాయ్ పనిచేసే డి.జె. కీమర్ కంపెనీ అతడ్ని ఆరు నెలల పాటు లండన్ హెడ్ ఆఫీసుకి పంపించింది. సత్యజిత్‌కి ఈ లండన్ యాత్ర ఒక వరంలా పనిచేసింది. ఆ ఆర్నెల్లలో అతడు 99 పేరైన విదేశీ సినిమాలు చూశాడు. ఇటలీ నవ్యవాస్తవవాద ధోరణిలో విటోరియా డిసికా తీసిన **'ది బైసైకిల్ థీవ్స్'** (1948) అతడ్ని ఎంతగా ఆకట్టుకుందంటే, ఆ సినీవీక్షణంతో తను తీయబోయే సినిమా ఎలా వుంటుందో అతడికి అర్థమైపోయింది. 'సినిమా కోసం ఉద్యోగాన్ని వదులుకునే ఆలోచన నాకిక కలవరపెట్టడం లేదు. అంతగా నన్ను కదిలించింది ఈ సినిమా' - అని **'ది బైసైకిల్ థీవ్స్'** గురించి రాయ్ ఒక ఉపన్యాసంలో చెబుతాడు. ఆయన ఆ సినిమాను తన జీవితంలో 25 సార్లు చూశాడు. 'అవర్ ఫిల్మ్స్ - దెయిర్ ఫిల్మ్స్' (మన సినిమాలు - వారి సినిమాలు) పుస్తకంలో ఈ సినిమా గురించి ఎంతగానో వివరించి రాస్తాడు. **'పాథేర్ పాంచాలి'** సినిమా నిర్మించవలసిందే అనే కృతనిశ్చయంతో కలకత్తాకు తిరిగి వస్తాడు రాయ్.

**రహదారిలో కఠిన సినీ ప్రయాణం**

**'పాథేర్ పాంచాలి'** అంటే 'రహదారి వినిపించే గేయకావ్యం'. 1929లో విడుదలై అప్పటికే బెంగాల్‌లో క్లాసిక్‌గా పేరు తెచ్చుకున్న నవల ఇది. ఇందులో 300 పాత్రలున్నాయి. కానీ రాయ్ ముఖ్యమైన 30 పాత్రల్ని తీసుకున్నాడు. కెమేరామ్యాన్ సుబ్రత మిత్రా, కళా దర్శకుడు బన్సీ చంద్రగుప్తా లాంటి వాళ్లంతా కొత్తవాళ్లు లేదా కొద్దిపాటి అనుభవమున్న వాళ్లే. ఉద్యోగాలు చేస్తూ వారాంతాల్లో షూటింగు చేయాలని అనుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య సినిమా షూటింగు మొదలుపెట్టారు. భార్య నగలూ, అరుదైన రికార్డులూ అమ్మేశారు. ప్రముఖుల పరిచయాలతో నిధులు సేకరించారు. మామ సుబిమల్ రాయ్ ప్రావిడెంట్ ఫండ్ కూడా తగలెట్టేశారు. అయినా చాల లేదు. చివరికి పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి బిదాన్ చంద్రరాయ్‌ను ఆశ్రయించారు. ఆయన మొదట్లో పెద్ద ఆసక్తి చూపకపోయినా, ఆతర్వాత వొప్పుకుని 'రహదారి కథ' కనుక 'రోడ్డు రవాణా శాఖ' నుండి ధన సహాయం చేశారు.

పాథేర్ పాంచాలిలో పాత్రలకు మేకప్ లేదు, రియల్ లొకేషన్స్‌లో సహజకాంతిలో తీశారు. పాత్రలు సహజంగా మనమధ్య తిరుగాడే మనుషుల్లా వున్నాయి. ఈ షరతులతో ఖచ్చితంగా నిర్మించిన సినిమా కాబట్టే, విడుదల కాగానే ప్రపంచ సినిమాలో అది తనకంటూ ఒక స్థానాన్ని ప్రతిష్ఠించుకుంది. 1955 కాన్స్‌లో 'ఉత్తమ హ్యూమన్ డాక్యుమెంట్' అవార్డు అందుకుంది. ఈ సినిమా విడుదలయ్యాక రాయ్ తన ఉద్యోగం వదిలేశాడు.

**అపూత్రయం**

'పాథేర్ పాంచాలీ' (1955), 'అపోరాజితో' (1956), అపూర్ సాంసార్ (1959) - ఈ మూడు సినిమాల్నీ కలిపి 'అపూ ట్రిలాజీ' (అపూత్రయం) అంటారు.

**'పాథేర్ పాంచాలీ' (1955) :** బెంగాలు గ్రామంలోని పేద బ్రాహ్మణ పరివారం కథ. భర్త హరిహర్, భార్య సర్బజయా, పిల్లలు దుర్గ, అపూలతో చాలీచాలని బ్రతుకు. హరిహర్‌కు అక్క వరుస పండు ముసలామె ఇందిర్ ఠాక్రూన్ కూడా వారితోనే వుంటూ బ్రతుకీడ్చుతుంది. పౌరోహిత్యంలో పూట గడవక హరిహర్ వూళ్లు తిరుగుతూంటాడు. నెలల తరబడి ఇంటికి రాడు. కుటుంబ బాధ్యతంతా సర్బజయాదే. దుర్గ, అపూల ఆకతాయి చేష్టలతో సినిమా నడుస్తుంది. ఈ సినిమాలోని ఎన్నో దృశ్యాలు మనమూ పాత్రలతోనే ఆ ప్రాంతాల్లో తిరుగుతున్నామా అన్నంత సహజంగా చిత్రించాడు దర్శకుడు. బామ్మ మరణం తర్వాత సినిమా ఆఖర్లో దుర్గ మరణం మన హృదయాలను బరువెక్కిస్తుంది. తండ్రీ, తల్లీ, అపూ జీవనపోరాటం కోసం బనారస్ బయల్దేరడంతో 'పాథేర్ పాంచాలీ' ముగుస్తుంది.

**'అపోరాజితో' (1956) :** బనారస్ లో పౌరోహిత్యం ద్వారా కొద్దిపాటి సంపాదన తెస్తున్న హరిహర్ ఒకరోజు నది వొడ్డున జ్వరంతో కుప్పకూలిపోతాడు. తర్వాతి దినం ఉదయాన్నే అపూ తెచ్చిన గంగ నీళ్లు పోస్తుండగా ప్రాణం విడుస్తాడు. దాంతో తల్లీ, కొడుకూ మామయ్య గారి గ్రామానికి వస్తారు. తండ్రి నేర్పిన పౌరోహిత్యం కొనసాగించమని తల్లి కోరితే, తను బడికి పోతానంటాడు అపూ. చదువులో చురుగ్గా వున్న అపూకు హెడ్ మాష్టర్ ప్రోత్సహిస్తాడు. స్కాలర్‌షిప్ రావడంతో తల్లికి ఇష్టంలేక పోయినా, కలకత్తాలో చదువుకోడానికి వెళతాడు. తల్లి ఆరోగ్యం క్షీణిస్తుంది, కొడుకు కోసం నిరీక్షిస్తూ, మిణుగురులు నాట్యం చేస్తున్న ఓ రాత్రి వేళ మరణిస్తుంది. తల్లీ, కొడుకుల అనుబంధం, వారి మధ్యసంఘర్షణ ఇందులో ప్రధాన యితివృత్తం. 'ది షో మస్ట్ గో ఆన్'అని సినిమా వాళ్లు అనే మాదిరిగానే ఎన్ని చావుల తర్వాతనైనా జీవితం కొనసాగవలసిందే.

ఒంటరిగానైనా ఆ యాత్ర సాగవలసిందే. 'అపరాజితో' అంటే 'అపజయం లేని" అని అర్థం. ఈ జీవశక్తే అపూ త్రయానికి చోదకశక్తి.

**అపూర్ సాంసార్ (1959):** మూడో భాగం తీయాలని సత్యజిత్ రాయ్ మొదట్లో అనుకోలేదు. ఈలోగా 'పారాస్ పాథొర్' (1957), 'జల్సాఘర్' (1958) అనే సినిమాలు తీశాడు. కానీ ఒక విదేశీ పాత్రికేయుడికిచ్చిన జవాబు కారణంగా మూడో భాగం తీశాడు. ఇందులో అపూ వైవాహిక జీవితం, దాని ఒడిదొడుకులూ చోటుచేసుకుంటాయి. నిరుద్యోగి అయిన అపూ తన స్నేహితుడి చెల్లెలి పెళ్లికి వెళతాడు. అనుకోని పరిస్థితుల్లో పెళ్లి చెడిపోగా, తనే ఆ అమ్మాయి అపర్ణను పెళ్లిచేసుకుంటాడు. పేదరికంలో కూడా ఆ జంట అన్యోన్యతను అందంగా చిత్రిస్తాడు దర్శకుడు. ఈ సినిమాలో సత్యజిత్ తన అభిమాన నటీనటులు సౌమిత్ర చటర్జీ, షర్మిలా ఠాకూర్‌లను ప్రధాన పాత్రధారులుగా తీసుకున్నాడు. పుట్టింటికి వెళ్లిన అపర్ణ కాన్పు సమయంలో చనిపోవడంతో పిచ్చివాడిలా మారిపోతాడు అపూ. తను రాస్తున్న నవల రాత ప్రతుల్ని విసిరేస్తాడు. ఐదేళ్ల వరకు కన్న కొడుకును చూట్టానికి కూడా వెళ్లడు. చివరికి ఒక స్నేహితుడి మందలింపుతో కొడుకును చూట్టానికి వెళ్లడం, ఆ పసివాడి నమ్మకాన్ని జయించి, అతడ్ని తన భుజాలపై కూర్చోబెట్టుకుని తన వెంట తీసుకురావడంతో సినిమా ముగుస్తుంది.

కొన్ని ప్రతీకలతో ఒక భాగం నుండి మరో భాగానికి చాలా సునాయాసంగా లింకు కలుపుతాడు దర్శకుడు. రైలు కనిపించే ప్రతిసారీ, ఆ ధ్వని వినిపించే ప్రతిసారీ ఒక వేర్పాటు, ఒక మరణం సంభవించడం చూస్తాం. రైలు ధ్వని చెవిలో పడ్డ ప్రతిసారీ అపూకు తన అక్క గుర్తొచ్చి బాధపడుతుంటాడు. పుస్తకంపై ఇంకు పడిపోయే దృశ్యంతో రెండో భాగానికీ, మూడో భాగానికీ చాలా తొందరగా లింకు కలుస్తుంది. అలాగే చిరిగిన కిటికీ గుడ్డ, వీధి ద్వారాలను కూడా ప్రతీకాత్మకంగా, కళాత్మకంగా వినియోగిస్తాడు దర్శకుడు. ఈ సినిమాల గురించి ఎందరో సినీ విమర్శకులు ఎన్నో విశ్లేషణలు ఇప్పటికీ చేస్తున్నారు. ప్రపంచంలోని సినిమా బోధనా సంస్థల్లో వీటిపై అధ్యయన పాఠాలు నడుస్తునే వున్నాయి.

**చారులత (1964) :** సత్యజిత్ రాయ్ సినిమాల్లో అతడికి వ్యక్తిగతంగా బాగా నచ్చిన సినిమా 'చారులత'. రవీంద్రుని 'నష్టనీర్' (చెడిన గూడు) కథ ఆధారంగా తీశాడు. భూపతి, చారులత ధనిక దంపతులు. భూపతికి తన ప్రెస్‌తో, రాజకీయలతో తీరిక ఉండదు. చెడు తిరుగులవాడు కాదు గానీ, భార్య కోసం సమయం ఇవ్వలేడు. చారులతకూ భర్త మీద ప్రేమే కానీ, ఆమెకున్న లోపమేమిటో, ఆమె దగ్గర వ్యర్థ సమయం ఎలా కుళ్లుతోందో దర్శకుడు సినిమా ప్రారంభంలోనే ఒక ఏడు నిమిషాల ఎస్టాబ్లిష్‌మెంట్ సన్నివేశంలో చూపుతాడు. కోతుల్ని ఆడించేవాడ్ని, దారిన పోతున్న లావుపాటి వ్యక్తినీ వారు కనుమరుగైనంత సేపు దుర్భిణీలో చూసేటంత సమయం ఆమె వద్ద వుంటుంది. గాలి ధుమారం రేగుతున్న వేళ ఆమె మరిది అమల్ సెలవులు గడిపేందుకు వారింటికి వస్తాడు. తన భార్యలోని సృజనాత్మకతను వెలికి తీయమని తన తమ్ముడికి చెబుతాడు భూపతి. రవీంద్రనాథ్‌కి కాదంబరీ దేవి విషయంలో జరిగిన లాంటి పరిస్థితే ఎదురౌతుంది అమల్‌కు. అమల్‌పై అభిమానం హద్దులు దాటుతోంటే చారులత అనుభవించే భావోద్వేగాలనూ, అంతర్మథనాన్నీ అందాల సహజనటి మాధవీ ముఖర్జీ అద్భుతంగా కనపరుస్తుంది. శారీరక సంపర్కం లాంటి చవకబారు దృశ్యాలు వుండవు. ఒక సున్నితమైన భావనను చాలా మానవీయంగా చిత్రిస్తాడు. సినిమా ఆరంభంలో భూపతి కోసం 'బి' అనే అక్షరంతో చారులత ఎంబ్రాయిడరీ చేస్తున్న చేతి రుమాలు సినిమా ఆఖర్లో భూపతికి కనువిప్పు కలిగిస్తుంది. ఉయ్యాలలో చారు మనసులోని డోలయానస్థితిని చూపడం, అలానే వేర్వేరు సమయాల్లో వేర్వేరు వ్యక్తులు బాల్కనీ దారంతా నడుచుకుంటూ వెళ్లి, మెట్లు దిగి, ఆమె కనుచూపు నుండి మాయమవడం వంటి ఎన్నో ప్రతీకాత్మక దృశ్యాలను రాయ్ అద్భుతంగా చిత్రీకరించాడు. 'సున్నితత్వం, సరళత్వాల దోబూచులాట అద్భుతంగా వుంది' అంటూ ఈ సినిమాకు కితాబునిచ్చింది రాయ్ మెచ్చే సినిమా పత్రిక 'సైట్ అండ్ సౌండ్' సంపాదకురాలు పినలోప్ హూస్టన్.

**వైవిధ్యమైన అంశాలతో సినిమాలు**

రాయ్ మొత్తం 30 సినిమాలు తీశాడు. వాటిలో గ్రామీణులూ, మధ్యతరగతి జనాలు, మేధావులూ, జమీందార్లూ, రాజులూ, డిటెక్టివ్‌ల గురించి వివిధ ఇతివృత్తాలతో కథలున్నాయి. ఏదీ మరొక దానికి నకలు కాదు. వస్తువులోనూ, కథన విధానంలోనూ దేనికదే ప్రత్యేకం. జీవితాన్ని స్పష్టంగా ప్రతిఫలించేవే ఆ సినిమాలన్నీ! 37 సంవత్సరాల తన సినీ కెరీర్‌లో ఒక శతాబ్దకాలపు చారిత్రక మార్పుల్ని అతడు తన సినిమాల్లో రికార్డు చేశాడు. ప్రేమ్‌చంద్ కథ ఆధారంగా వచ్చిన **'షతరంజ్‌కే ఖిలాడీ'** (1977) ఈస్టిండియా కంపెనీ దూసుకొస్తుంటే చదరంగం ఆటల్లో తలమునకలైన మొఘల్ రాజులను చూపుతుంది. జమీందారీ వ్యవస్థ పతనమౌతుంటే తన పాత రాజసాన్ని వదులుకోలేక, కొత్త ధనాఢ్యుల పొగరును జీర్ణించుకోలేని ఒక జమీందారు బాధను చూపుతుంది **'జల్సాఘర్'** (1958). ఆధునిక భారతంలో పేద బ్రాహ్మణ కుటుంబపు ఈతి

# ప్రజాసైన్స్ ఉద్యమం అనుభవాలు, సవాళ్లు

(32వ పేజీ తరువాయి)

ప్రజాసైన్సు ఉద్యమం. ఏ సామాజిక లక్ష్యం లేకుండా ఇది ఏర్పడలేదు. పనిచేయటం లేదు. దీన్ని గుర్తుంచుకున్నప్పుడు ఏ ఏ కార్యక్రమాలకు ఎవరిని తోడు తెచ్చుకోవాలో ఒక స్పష్టత ఉండాలి. ప్రజానాట్యమండలి సహకారం లేకుండా మన కళాయాత్రలు విజయవంతం అయ్యేవా? యుటియఫ్ భాగస్వామ్యం లేకుండా సాక్షరతా ఉద్యమం సాధ్యమయ్యేదా? టీచర్ల తోడ్పాటు లేకుండా పాఠశాలలో ఎలా పని చేయగలరు?

అలాగే ప్రజాసంఘాలు కూడా. ఆర్థిక డిమాండ్లలో కూరుకుపోకుండా సామాజిక స్పృహ కూడా తమ లక్ష్యంగా నిర్దేశించుకున్న యుటిఎఫ్ లాంటి ఉపాధ్యాయ ఉద్యమసంస్థలు ప్రజా సైన్స్ ఉద్యమాన్ని తమ సహజ మిత్రుడిగా గుర్తించాలి. యువకులలో ప్రజాస్వామ్య భావాల వ్యాప్తికి యువజన సంఘాలకు ఎంతైనా జెవివి ఉపయోగపడుతుంది. కళాశాల్లోని విద్యార్థుల కోసం జెవివి సహకారంతో ఎలాంటి కార్యక్రమాలను చేపట్టవచ్చో విద్యార్థి మహిళా సంఘాలు ప్లాన్ చేసుకోవచ్చు. అన్ని సంఘాల్లో పనిచేస్తున్న వారికీ ఒక శాస్త్రీయ దృక్పథం అవసరం. లేకుంటే అవి కూడా ఒక స్పష్టతతో పని చెయ్యలేవు.


సైన్స్ ఉద్యమానికి గొప్ప అవకాశం, సమాజానికి సైన్సు ఉద్యమ అవసరం ఎంతో వున్న కాలమిది. దీన్ని గుర్తించి సరైన సైదాంతిక స్పష్టతతో, నైపుణ్యాలతో, సృజనాత్మకంగా ప్రజల్లోకి ఎలా వెళ్ళగలమా అనేది నిర్ణయించుకోవాలి. అలా చేయలేక పోతే లోపం మనదే తప్పు సమాజానికి కాదు. ప్రజల్ని నిందించి ప్రయోజనం లేదు. ❄

బాధల్ని **'అపూ త్రయం'** చూపగా, మూఢనమ్మకాలతో కోడల్ని అమ్మవారుగా మార్చేస్తుంటే, ఆధునిక హేతువాదభావాలతో దాన్ని ఎదిరించేవాళ్లు తయారౌతున్న వైనాన్ని **'దేవి'** (1960) సినిమా దర్శింపజేస్తుంది. **'చారులత', 'మహానగర్'** (1963) సినిమాల్లో స్త్రీల విముక్తిని చిత్రిస్తే, **'ప్రతిద్వంది'** (1970) నిరుద్యోగ సమస్యను వర్ణిస్తుంది. క్రమంగా దిగజారుతున్న లంచగొండి సమాజంలో మధ్యతరగతి నైతిక పతనాన్ని **'జనారణ్య'** (1975) సాక్షాత్కరింపజేస్తుంది. **'ప్రతిద్వంది' – 'సీమాబద్ధ'** (1971) – **'జనారణ్య'** సినిమాలను కలిపి సత్యజిత్ రే **'కలకత్తా త్రయం''** అని అంటారు. (మృణాల్ సేన్ **'కలకత్తా ట్రిలాజీ'** వేరే వుంది.) **'గోపీ గాయిన్ – బాగా బాయిన్'** (1968) సంగీతం, హాస్య రసాలతో ఆబాలగోపాలన్ని అలరించింది. ఇవే క్యారెక్టర్లతో ఇందిరా గాంధీ ఎమెర్జెన్సీపై చురకలా పరోక్ష విమర్శతో **'హిరక్ రాజార్ దేశే'** (హిరక్‌రాజు దేశంలో) (1980) సినిమా వచ్చింది. ఇరవై లక్షల మందిని పొట్టన పెట్టుకున్న బెంగాల్ క్షామం మానవుల్ని ఎంత దయనీయ స్థితిలోకి నెడుతుందో చూపుతుంది **'అశని సంకేత్'** (1973).

**డాక్యుమెంటరీలూ, లఘు చిత్రాలూ, ఇతరాలూ**

రాయ్ నిర్మించిన డాక్యుమెంటరీల్లో ముఖ్యమైనవి – విశ్వకవిపై తీసిన **'రవీంద్ర నాథ్ ఠాకూర్'** (1961), చిత్రకారుడు బినోద్ బిహారీ ముఖర్జీపై **'ది ఇన్నర్ ఐ'** (1972), తన తండ్రి జీవితంపై **'సుకుమార్ రాయ్'** (1987), భరతనాట్యం నర్తకి బాలసరస్వతిపై **'బాల'** (1976). సిక్కిం మనదేశంలో అంతర్భాగం కాకముందు అక్కడి రాజు ధన సహాయంతో **'సిక్కిం'** (1971) డాక్యుమెంటరీని నిర్మించాడు రాయ్. కానీ, ఇందులో సిక్కిం పేదరికాన్ని చూపారంటూ దీనిపై చాలా ఏళ్లు నిషేధం విధించారు. చివరికి 2010 లో కోల్‌కతా అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ డాక్యుమెంటరీని చూసే అవకాశం దొరికింది.

1964 లో **'టూ'** అనే లఘుచిత్రం పేద, ధనిక పిల్లల్లో ఎవరు గొప్ప అనే విషయాన్ని చర్చిస్తుంది. గెలిచాననుకున్న ధనిక పిల్లాడు తను ఎక్కడ ఓడాడో అర్థం చేసుకుంటాడు. అంతకు ముందు ఠాగూర్ కథలతో తీసిన **'తీన్ కన్యా'** (1961) కూడా మూడు లఘుకథల సమాహారమే. 1980 లో **'పికూ'** అనే మరో లఘు సినిమా నిర్మించాడు రాయ్. బెంగాల్ సూపర్‌స్టార్ ఉత్తమ్ కుమార్‌తో రెండు సినిమాలు తీశాడు సత్యజిత్ రాయ్.




పథేర్ పాంచాలి చిత్రంలో ఒక దృశ్యం

అందులో ఒకటి ఒక సూపర్‌స్టార్‌తో ఒక విలేకరి సంవాదంగా వచ్చిన **'నాయక్'** (హీరో) (1966). మాట్నీ హీరోల మిరమిట్లు గొలిపే జీవితంలోని డొల్లతనాన్ని ఎండగడుతుంది ఈ సినిమా. రెండోది శరదిందు బంధోపాధ్యాయ డిటెక్టివ్ బ్యోమ్‌కేశ్ బక్షీ పాత్రతో అపరాధ పరిశోధక కథ **'చిడియాఖానా'** (జూ) (1967). సత్యజిత్ రాయ్ మొదట్లో తన సినిమాలకు పండిత్ రవిశంకర్ తదితరులతో సంగీతం వేయించే వాడు. కానీ తర్వాతి సినిమాల్లో తనే సంగీత దర్శకుడిగా మారాడు. తన సినిమాలకే కాక ఇతరుల సినిమాలకు స్క్రిప్టు రాయడం, సంగీతం అందివ్వడం కూడా చేశాడు రాయ్.

1983 లో స్వదేశీ ఉద్యమ నేపథ్యంలో ఒక స్వదేశీ నాయకుడి ద్వంద్వవైఖరిని ఎండగడుతూ **'ఘరే బాయిరే'** సినిమా తీశాడు. ఆ షూటింగు జరుగుతుండగా సత్యజిత్ రాయ్‌కి హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆ తర్వాత చాలా జాగ్రత్తగా వుండాల్సి వచ్చింది. 1987 లో కొంత కోలుకున్నాక, ఇండోర్ షూటింగులకే పరిమితమౌతూ, ఔట్‌డోర్ షూటింగు కోసం కుమారుడు సందీప్‌పై ఆధారపడుతూ మరణించేలోగా మరో మూడు సినిమాలు **'గణశత్రు'** (ప్రజా శత్రువు) (1989). **'శాఖా ప్రోశాఖా'** (శాఖోపశాఖలు) 1990, **''ఆగంతుక్''** (అపరిచితుడు) 1991 తీశాడు.

**సత్యజిత్ రాయ్ సాహిత్య సేవ**

1961 లో సత్యజిత్ రాయ్ తన తాతయ్య ప్రారంభించిన 'సందేశ్' పత్రికను పునరుద్ధరించాడు. 'సందేశ్' అనే పదానికి 'సందేశం' (మెసేజ్) అనీ, 'బెంగాల్లో దొరికే ఒక మిఠాయి' అనీ రెండర్థాలు వున్నాయి. ఈ రెండర్థాలకూ న్యాయం చేస్తూ రాయ్ విజ్ఞానదాయకంగా, వినోదాత్మకంగా వుండే రచనలు పిల్లల కోసం రాసేవాడు. వేరే పత్రికలకూ రాస్తూ కొన్ని రూకలు పారితోషికంగా సంపాదించేవాడు. అపరాధ పరిశోధక నవలికలు రాసినా, వాటిలో పిల్లలకు తగ్గట్టు శృంగారం గానీ, అతి హింస గానీ లేకుండా జాగ్రత్త పడేవాడు. షెర్లాక్ హోమ్స్ ప్రేరణతో సృష్టించిన డిటెక్టివ్ ఫెలూదా కథలతో **'సొనార్ కెల్లా'** (1974), **'జాయ్ బాబా ఫేలూనాథ్'** (1979) సినిమాలు నిర్మించాడు. సినిమాలపై **'బిషోయ్ చలన్‌చిత్రొ'** (చలనచిత్రాల గురించి), **'ఎకేయ్ బొలే షుటింగ్'** (దీన్నే షూటింగంటారు) మొదలైన గ్రంథాలు రాశాడు. అతని సాహిత్యం చాలా మటుకు ఇతర ప్రధాన భాషల్లోకి అనువాదమైంది.

**ముగింపు**

సత్యజిత్ రాయ్‌ని వర్ణించడానికి బహుముఖ ప్రజ్ఞాశాలి అనే చిన్నమాట సరిపోదు. తను పనిచేసిన ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వదిలాడు రాయ్. వ్యక్తిగతంగానూ, వివిధ సినిమాలకూ, పుస్తకాలగ్గానూ అతడు లెక్కలేనన్ని అవార్డులు అందుకున్నాడు. వాటిలో చాలా ముఖ్యమైన వాటి గురించి ఈ వ్యాసం ఆరంభంలోనే చెప్పుకున్నాం. సత్యజిత్ సినిమాలు చాలా స్లోగా వుంటాయనే వారు సినిమా గ్రామర్ గురించి తెలీనివారైనా అవ్వాలి లేదా సినిమాను ఒక సర్కస్‌గా మార్చిన వారైనా అయ్యుండాలి. రాయ్ భారత దేశపు పేదరికాన్ని విదేశాలకు అమ్మాడని ప్రఖ్యాత నటి నర్గిస్ ఓసారి విమర్శించారు. కానీ తమరి 'మదర్ ఇండియా' భారతదేశ ఐశ్వర్యం చూపిందా అంటూ ఉత్పల్‌దత్తా చాలా ఘాటుగానే విమర్శించాడు. అనారోగ్యంతో వున్నా చనిపోయే మునుపటి సంవత్సరం వరకూ అతడు చిత్రనిర్మాణం చేస్తూనే వున్నాడు. 1992 లో ఆసుపత్రి బెడ్డు నుండి అకాడెమీ లేదా ఆస్కారు జీవనసాఫల్య గౌరవ పురస్కారం అందుకున్నాడు. సాటిలైట్ టెలివిజన్ ద్వారా ఆస్కారు అవార్డుల సభను సంబోధించాడు. **''చలన చిత్రాల కళపై అతని అరుదైన పాండిత్యానికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రనిర్మాతలు, ప్రేక్షకులపై చెరగని ప్రభావాన్ని చూపిన అతని లోతైన మానవతా దృక్పథానికీ గుర్తింపుగా''** ఈ గౌరవం ఇస్తున్నట్టు అకాడమీ అవార్డు కమిటీ తన సైటేషన్లో పేర్కొంది.

దేశ విదేశాల్లో భారతీయ సినిమా పతాకాన్ని అత్యున్నతంగా ఎగురవేసి, సృజనాత్మక కళలో అనేక తరాలకు ఆదర్శంగా నిలిచిన సత్యజిల్ రాయ్ 1992 ఏప్రిల్ 23న కలకత్తాలో తుదిశ్వాస విడిచారు. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 2 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# అశాంతి వైపు పయనిస్తున్న ప్రపంచం



పెరుగుతున్న భూగోళ రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల మూలంగా ప్రపంచ శాంతి 2025లో సగటున 0.36 శాతం పడిపోయిందని ప్రపంచ శాంతి సూచీ (జిపిఐ) తెలియజేసింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్థికరంగం, శాంతి (ఐఇపి) అనే సంస్థ ప్రతి ఏటా ప్రపంచ శాంతి సూచీని విడుదల చేస్తుంది. ఈ సూచీ ప్రకారం భూగోళం మీద రోజురోజుకీ శాంతి తగ్గిపోయి యుద్ధాలు, ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ రోజు ప్రపంచ శాంతి అత్యంత దిగువ స్థాయిలో ఉందని సూచీ తెలియజేసింది.

గత 17 ఏళ్లలో దేశాల శాంతి స్కోరు సగటున 5.4 శాతం పడిపోయిందని సూచీ తెలిపింది. అంటే 2008వ సంవత్సరం నుండి ప్రపంచ శాంతి క్రమంగా దిగజారుతూ వస్తోందన్న మాట. 2008లో అమెరికాలో ప్రారంభమైన ద్రవ్య సంక్షోభం ప్రపంచ మంతటికీ విస్తరించిన సంగతి విదితమే. అయితే ఈ ఏడాది మాత్రం 74 దేశాలు తమ శాంతియుద వాతావరణంలో కొంచెంద మెరుగుదల చూపించాయని సూచీ తెలియజేసింది.

జనసాంద్రత అతి తక్కువగా ఉండే ఐస్‌లాండ్ 2008 నుండి శాంతి సూచీలో అగ్ర స్థానంలో ఉంటూ వస్తున్నది. ప్రాంతాల వారీగా చూస్తే అత్యంత తక్కువ శాంతియుతంగా ఉన్న ప్రాంతంలో మధ్య ప్రాచ్యం, ఉత్తరాఫ్రికా ముందు భాగాన ఉన్నాయి. ప్రపంచంలో అత్యంత తక్కువ శాంతి ఉన్న 10 దేశాల్లో నాలుగు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.

గత రెండు దశాబ్దాలుగా అత్యంత శాంతియుత దేశాలకూ, తక్కు శాంతి నెలకొన్న దేశాలకూ మధ్య అంతరం 11.7 శాతం పెరిగిందని సూచీ తెలిపింది.

శాంతి ఎక్కువగా ఉన్న మొదటి పది దేశాల్లో వరుసగా ఐస్‌లాండ్, ఐర్‌లాండ్, న్యూజీలాండ్, ఆస్ట్రియా, స్విట్జర్‌లాండ్, సింగపూర్, పోర్చుగల్, డెన్మార్క్, స్లోవేనియా, ఫిన్లాండ్ ఉన్నాయి. అతితక్కువ శాంతి ఉన్న చివరి పది దేశాల్లో రష్యా, ఉక్రెయిన్, సూడాన్, డిపిఆర్ కాంగో, యెమెన్, ఆఫ్ఘనిస్థాన్, సిరియా, దక్షిణ సూడాన్, ఇజ్రాయిల్, మాలీ ఉన్నాయి.

ఈ సూచీలో మొత్తం 160 దేశాల్లో భారత దేశం 115వ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ 123వ స్థానంలో, పాకిస్థాన్ 144వ స్థానంలో ఉన్నాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ..........................................
**వీధి** ..........................................
**గ్రామం** ..........................................
**మండలం లేదా పట్టణం** ..........................................
**జిల్లా** ..........................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.